www.prajasakti.com

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 39 Vol సంచిక : 34 No | విజయవాడ, సోమవారం 4 ఫిబ్రవరి 2019 | 14 +12 పేజీలు వెల : 4.00 Rs

# బెంగాల్‌లో పోటెత్తిన ఎర్ర సంద్రం



కేంద్రంలో బిజెపిని, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడించి దేశాన్నీ, రాష్ట్రాన్నీ రక్షించుకుందామని పిలుపునిస్తూ కొల్‌కతాలో సిపిఎం ఆదివారం నాడు నిర్వహించిన పీపుల్స్ బ్రిగేడ్‌కు ప్రజానీకం మహాసముద్రంలా పోటెత్తారు

వార్త 3లో

## కిరీటాలు మాయంపై విచారణ

7



# సవాలుగా పెండింగ్ కేసులు

### సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

### హైకోర్టు ప్రారంభోత్సవ సభలో సుప్రీం చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

న్యాయవ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, వాటిలో పెండింగ్ కేసులూ కూడా ఒకటని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక భవన ప్రారంభం, శాశ్వత భవన భూమిపూజ, శిలాఫలక ఆవిష్కరణ కార్యక్రమాల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి తక్షణ ప్రాధాన్యత ఇవ్వాల్సిఉందని న్యాయమూర్తులకు సూచించారు. దేశ వ్యాప్తంగా 3 కోట్ల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని, వీటిలో పదేళ్లకు పైగా 25 లక్షల కేసులు పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. శాశ్వత హైకోర్టు నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని, శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా హైకోర్టు జడ్జి పోస్టులు 392 ఖాళీగా ఉన్నాయని, ఇందులో 270 పోస్టులకు అభ్యర్థులకు సంబంధించిన ప్రతిపాదనలు హైకోర్టుల నుంచి పంపాలని ఆయన కోరారు. మరో 130 పోస్టులు సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నాయని,భర్తీకి సంబంధించిన ప్రకియ జరుగుతోందన్నారు. త్వరలో 75 శాతం

మిగతా 8లో





ఆబోతుల రాములు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

## విద్యుదాఘాతంతో నలుగురు మృతి

### పెళ్లింట విషాదం

ప్రజాశక్తి- లావేరు (శ్రీకాకుళం జిల్లా)

విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా పెళ్లింట విషాదం చోటు చేసుకుంది. పెళ్లి పనుల్లో బిజీగా ఉన్న ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. బుధవారం జరగాల్సిన నిశ్చితార్థానికి అంతా సిద్ధం చేస్తున్న సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు మృత్యువాతపడ్డారు. వీరిలో భార్యాభర్తలు ఉన్నారు. వీరి

మిగతా 8లో

# కొల్‌కతాలో హైడ్రామా

- కమిషనర్‌ను విచారించేందుకు సిబిఐ యత్నం
- నివాసం వెలుపలే అడ్డుకుని అదుపులోకి తీసుకున్న బెంగాల్ పోలీసులు
- కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మమత ధర్నా
- పలువురి మద్దతు



కొల్‌కతాలో మెట్రో ఛానెల్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

ప్రజాశక్తి ప్రతినిధి - కొల్‌కతా

ఆదివారం కొల్‌కతాలో హైడ్రామా నెలకొంది. శారదా చిట్‌ఫండ్, రోజ్ వ్యాలీ కుంభకోణాల కేసుల్లో కొల్‌కతా నగర పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను విచారించేందుకు ఆయన నివాసానికి వెళ్లిన 40 మది సభ్యుల సిబిఐ బృందాన్ని స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. విచారణకు కావాల్సిన అధికారిక పత్రాలు చూపాలని నిలదీశారు. సిబిఐ అధికారులు ఆ పత్రాలు చూపలేకపోవడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కొందరిని జీపుల్లో కుక్కి, సమీపంలోని బిధాన్ నగర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ తరువాత కాసేపటికి వదిలిపెట్టారు. మరోవైపు

మిగతా 8లో

### ప్రజల దృష్టిని మళ్లించేందుకే నాటకం : సూర్యకాంత్ మిశ్రా

8

## పద్మశ్రీ వెనక్కి

- పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మణిపూర్ సినీ నిర్మాత శ్యాంశర్మ నిర్ణయం

3

## పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం : మదురో

- కారకాస్‌లో భారీ ర్యాలీ
- అమెరికా ఒత్తిడికి లొంగని స్పెయిన్

8



# ఉపాధ్యాయులపై నిర్బంధం

### సిపిఎస్ రద్దు కోరుతూ పాదయాత్రలు

- గుంటూరులో అక్రమ అరెస్టు
- ఏలూరులో మరో యాత్ర ప్రారంభం
- 7న అసెంబ్లీ ముట్టడి



పాదయాత్రను అడ్డగించిన పోలీసులు (ఇన్‌సెట్లో) లక్ష్మణరావును అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-గుంటూరు/ఏలూరు

ఉద్యోగుల రిటైర్మెంట్ జీవితానికి భరోసా లేని నూతన పెన్షన్ విధానం రద్దు కోరుతూ ఉపాధ్యాయులు కదం తొక్కారు. యుటిఎఫ్ పిలుపు మేరకు 7న అసెంబ్లీ ముట్టడించడానికి ఆదివారంనాడు గుంటూరు నుండి ఒకటి, ఏలూరు నుండి మరోటి రెండు పాదయాత్రలు ప్రారంభమయ్యాయి. అయితే, గుంటూరులో శాంతియుతంగా సాగుతున్న పాదయాత్రను పోలీసులు అడ్డగించి, ఉపాధ్యాయులను నిర్బంధించారు.

అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల నుండి ఆదివారం వేకువజామునే వేలాది మంది ఉపాధ్యాయులు గుంటూరు చేరుకున్నారు. గుంటూరు మార్కెట్ సెంటర్ నుండి ప్రారంభమైన పాదయాత్ర చందనా బ్రదర్స్ వద్దకు రాగానే పోలీసులు బారికేడ్లు పెట్టి ఆపేశారు. యుటిఎఫ్ నాయకులను, ఉపాధ్యాయుల్ని అరెస్ట్ చేసి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.బాబురెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వై.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు సహా సుమారు వెయ్యి మందిని అరెస్ట్ చేశారు. తొలుత చుట్టుగుంట నుండి పాదయాత్ర ప్రారంభమవుతుందని నాయకులు ప్రకటించటంతో పోలీసులు ఆ ప్రాంతంలో భారీగా

మిగతా 8లో

### అరెస్ట్ అప్రజాస్వామికం

సిపిఎం, సిపిఐ రాష్ట్ర కమిటీల ఖండన

8




# రెండోరోజూ నిరసనలు తోపులాటలు

- స్పృహ తప్పిన వైసిపి ఎమ్మెల్యే చెవిరెడ్డి
- మంత్రి పరిటాల సునీత కాన్వాయ్‌పై చెప్పులు
- ఉయ్యూరులో వృద్ధురాలు మృతి
- పసుపు-కుంకుమ, పింఛన్ల పంపిణీ సభల తీరు

7

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న పసుపు-కుంకుమ, పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రెండోరోజైన ఆదివారమూ ప్రజల నుండి నిరసనలు ఎదురయ్యాయి. టిడిపి, వైసిపి నాయ కుల మధ్య తోపులాటలు నెలకొన్నాయి. చిత్తూరు జిల్లాలో నిర్వహించిన సభలో టిడిపి కార్యకర్తలు దాడికి పాల్పడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. చంద్రగిరి వైసిపి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్పృహ తప్పి పడిపోయారు. ఎమ్మెల్యేను పోలీసులు హుటాహుటిన తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. అనంతపురం జిల్లాలో మంత్రి పరిటాల సునీతను మహిళలు నిలదీశారు. ఆమె కాన్వాయ్‌పై కొందరు గ్రామస్తులు చెప్పులు, చీపుర్లు విసిరారు. కృష్ణా జిల్లా ఉయ్యూరులో పీతల కోటీశ్వరమ్మ (70) మృతి చెందింది. వృద్ధాప్య పింఛను తీసుకోవడానికి వచ్చిన మామిళ్లకుంట్లపల్లికి చెందిన ఎద్దుల లక్ష్మీనరసమ్మ కుడికాలు విరిగిపోయింది.

## స్వార్థ ప్రయోజనాలే బిజెపి అజెండా

### అమిత్ షా కు బహిరంగలేఖలో కళా వెంకటరావు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఒకనాడు సిద్ధాంతాలు, విలువలకు ప్రాధాన్యతనిచ్చిన బిజెపి నేడు స్వార్థ రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా, అవకాశవాదమే అజెండాగా ముందుకు సాగుతోందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కిమిడి కళా వెంకటరావు ఆరోపించారు. ఆర్థిక నేరస్తులు, అవినీతిపరులను ఆ పార్టీ ప్రోత్సహిస్తోందన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్‌షాకు ఓ బహిరంగ లేఖ రాశారు. రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ భ్రష్టుపట్టించారని ఆయన పేర్కొన్నారు. ఏపీలో అడుగుపెట్టే ముందు తాము అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పి యాత్రను ప్రారంభిం చాలని కళా వెంకటరావు డిమాండ్ చేశారు. ఏపీ పునర్వి భజన చట్టం, పార్లమెంట్ హామీలకు సంబందించిన ప్రస్తావనే లేకుండా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఐదు కోట్ల ఆంధ్రులను అవమానపరచడం కాదా? ఇది కక్ష సాధింపు చర్యలకు నిదర్శనం కాదా?అని ప్రశ్నించారు. రూ.43వేల కోట్లు పేదల డబ్బును దోచుకుని సిబిఐ చార్జ్‌షీట్‌లతో 12 కేసుల్లో ఎ1 ముద్దాయిగా ఉన్న జగన్ మీకు ఎలా దోస్త్ అయ్యారు? మీకు స్వార్థప్రయోజనాల తప్ప విలువలు, సిద్ధాంతాలు లేవని వెల్లడి కావడం లేదా? అని పేర్కొన్నారు.



ఛాంపియన్‌గా నిలిచిన భారత్ టీమ్

## అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ భారత్

### ద్వితీయ, తృతీయ స్థానాల్లో నేపాల్, శ్రీలంక

**ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో**

యునైటెడ్ షాటోకాన్ కరాటే డో ఇండియా అసోసియేషన్ నిర్వహించిన ఆల్ సేల్స్ 3వ అంతర్జాతీయ ఆహ్వానపు కరాటే టోర్నీలో ఆతిథ్య భారత్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. కుమిటి, కాటాస్, వెపన్ ఈవెంట్లలో క్రీడాకారులు ప్రతిభ కనబర్చి 514 పాయింట్లతో ఛాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. 195 పాయింట్లతో నేపాల్ ద్వితీయ స్థానంలో, 147 పాయింట్లతో శ్రీలంక తతీయ స్థానంలో నిలిచాయి. బంగ్లాదేశ్ 96 పాయింట్లతో 4వ స్థానాన్ని దక్కించుకుంది. పోర్ట్ రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా సాగిన ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి గీతం విద్యా సంస్థల చైర్మన్ శ్రీభరత్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహక కార్యదర్శి అలీ, తాజుద్దీన్, పలు దేశాలకు చెందిన కరాటే సంఘాల ప్రతినిధులు, మాస్టర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## చలి తగ్గుముఖం

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**



మరికొద్ది రోజుల్లోనే రాష్ట్రంలో చలి తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ విశ్రాంత శాస్త్రవేత్త రాళ్లపల్లి మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం రాత్రి ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ, పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగనున్నాయని పేర్కొన్నారు. వాతావరణం ప్రస్తుతం సాధారణ స్థితిలోనే కొనసాగుతుందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

## దళితులను పూర్తిగా విస్మరించారు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

చంద్రబాబు అధికారంలోకొచ్చాకా దళితులను పూర్తిగా విస్మరించారని వైసిపి నేత నందిగం సురేష్ అన్నారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో చంద్రబాబు దళితులకు చేసిందేమీలేదన్నారు. అసైన్డ్ భూముల జీవో దళితుల పొట్ట కొట్టేదిగా ఉందని మండిపడ్డారు. లంక భూములకు ఒక ప్యాకేజీ, పట్టా భూములకు ఒక ప్యాకేజీ ఇస్తూ దళితులను మోసం చేస్తున్నారని, రాజధానిలో ఉన్న వ్యవసాయ కూలీలకు సైతం పనులివ్వకుండా బీహర్ తదితర రాష్ట్రాల నుంచి తెస్తూ స్థానికులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

**ప్రజ్ఞ**

సమాధానాలు 9లో

1. 2017-18 సంవత్సరానికి ప్రభుత్వ ఆర్థిక వృద్ధి రేటును ఎంత శాతానికి సవరించింది?
2. ఏ నగరంలో గాంధీ మృణ్మయ కుడ్య చిత్రాన్ని ఉపరాష్ట్రపతి అవిష్కరించారు?
3. ఎన్ఎస్ఎస్ఒ (2017-18) ప్రకారం ఇండియా నిరుద్యోగ రేటు ఎంత శాతం ?
4. ఫాక్స్‌కాన్ ఏఐ-ఆర్ అండ్‌డీ సెంటర్ ఎక్కడ ఏర్పాటు చేశారు?
5. అగస్టా కేసులో అరెస్టు అయిన వ్యాపారవేత ఎవరు?

# కాంట్రాక్టు వ్యవస్థ పోతేనే ఉద్యోగ భద్రత

- సమస్యల్ని పరిష్కరించలేని ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి
- ఇ సేవ ఉద్యోగుల సభలో వక్తల పిలుపు




ప్రదర్శన సభలో మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కాంట్రాక్టు వ్యవస్థ పోతేనే రాష్ట్రంలో ఉద్యోగ భద్రత ఉంటుందని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. ఎపి ఇ సేవ, మీసేవ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో ప్రదర్శన సభను ఆదివారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ నాగేశ్వరరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్య అథితిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ ఈసేవ కేంద్రాలను తన మానస పుత్రికగా అభివర్ణించే చంద్రబాబు, ఈ కేంద్రాల్లో 15ఏళ్లుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు ఎందుకు ఇవ్వడంలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలకు నేరుగా జీతాలివ్వడానికి వర్తించే నిబంధనలు, 15 ఏళ్లుగా కష్టపడుతున్న ఉద్యోగుల జీతాలు పెంచడానికి ఎందుకు వర్తించవో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ప్రజాసాధికార సర్వేలో ఈసేవ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడం వల్ల ప్రభుత్వ పథకాలకు దూరం అవుతున్నారన్నారు. జీతాలు పెంచాలని కోరుతున్న ఉద్యోగులపై చంద్రబాబు ప్రభుత్వం కక్షపూరిత చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి నేతల జేబులు నింపేందుకే రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవస్థను అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలోనే సుప్రీం ఆదేశాలను లెక్కచేయకుండా కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడంలేదన్నారు. అధికారంలోకి రాగానే కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్దీకరిస్తానని 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించని ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

రానున్న ఎన్నికల్లో రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి రెండు చేతులు లేనివారికి రూ.10వేల పింఛను ఇస్తున్నానని గొప్పలు చెప్పుకుంటున్న సిఎంకు, రోజంతా రెండు చేతులతో కష్టపడి పని చేసేవారికి కనీస వేతనం ఇవ్వాలని తెలియదా అని ఎపి ఎన్జీఒ పశ్చిమ కృష్ణా అధ్యక్షులు విద్యాసాగర్ ముఖ్యమంత్రిని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో ఒకే ఉద్యోగంలో నాలుగు రకాల ఉద్యోగులు(పెన్షన్‌తో కూడిన శాశ్వత ఉద్యోగులు, సిపిఎస్‌తో కూడిన ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు) ఉండడం దారుణమన్నారు. రూ.6వేల జీతంతో కుటుంబాలను నెట్టుకొస్తూ ఈసేవ ఉద్యోగులు ఎన్నో కష్టాలు పడుతున్నారన్నారు. ఎపి ఎన్జీఒ కమర్షియల్ ట్యాక్స్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్ ఈసేవ ఉద్యోగుల పోరాటానికి తమ మద్దతు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించలేని ప్రభుత్వం కక్షపూరిత చర్యలతో ఉద్యోగుల గొంతు నొక్కుతుందని బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(బెఫీ) ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ విమర్శించారు. ఈసేవ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ సిఎం చంద్రబాబుకు, ఐటి మంత్రి లోకేష్‌కు వినతిపత్రాల్ని అందించినా పట్టించుకోలేదని సిఐటియు సెంట్రల్‌సిటి ప్రధాన కార్యదర్శి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఈసేవ ఉద్యోగుల సంఘం నేతలు, సిఐటియు రాష్ట్ర నాయకులు నూర్ మహ్మద్, సిటి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ జెఎసి అధ్యక్షులు ఎం బాబూరావు, గౌరి, అశోక్, శ్రీకాంత్, సింహాచలం, రామారావు, చక్రవర్తి, రాధ, పార్వతి, నాగమణి, సౌజన్య, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో తప్పులను సవరించండి

### ముఖ్య ఎన్నికల అధికారికి సిపిఎం లేఖ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో తప్పులను సవరించాలని కోరుతూ ముఖ్య ఎన్నికల అధికారికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు లేఖ రాశారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం జనవరి 1 నుంచి ఫిబ్రవరి 10 వరకూ నూతన ఓటర్ల దరఖాస్తులు స్వీకరించాలని, దీనికి భిన్నంగా స్థానిక అధికారులు వ్యవహరిస్తున్నారని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొమ్మని సలహా ఇస్తున్నారని, గతంలో మాదిరిగానే దరఖాస్తు స్వీకరించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. 2017 ఎన్నికల్లో వేలాదిగా అర్హతలు లేనివారు దొంగ ఓటర్లుగా నమోదయ్యారని, ఆనాడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు పంపిన తరువాత 40 వేల ఓట్లు తొలగించారని, ఈ ఎన్నికల్లో దొంగ ఓట్లు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఓటరు నమోదు సందర్భంగా చేస్తున్న దరఖాస్తు, అర్హతల పత్రం ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో డిస్‌ప్లే చేయాలని కోరారు. మొదటి దశ లిస్టునే సరిగా పరిశీలన చేయలేదని, అందుకు తగిన ఉదాహరణలు లేఖలో పొందుపరచినట్లు తెలిపారు. ప్రస్తుతం నమోదు అవుతున్న ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ఓట్లను తప్పనిసరిగా పరిశీలన చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి విడుదల చేసిన డ్రాఫ్టు జాబితాలో అనేక లోపాలు ఉన్నాయని, క్షేత్రస్థాయిలో దరఖాస్తులు పరిశీలించకుండా అర్హులైన వారి దరఖా స్తులు కూడా తిరస్కరించారని, ఎందుకు తిరస్కరించారో తెలపలేదని పేర్కొన్నారు. 20 శాతం దరఖాస్తులు తిరస్కరించాలనే లక్ష్యంతో చేసినట్లుగా తెలుస్తోందని, కొన్ని పట్టణ ప్రాంతాల్లో 50 శాతం దరఖాస్తులు తిరస్కరించారని తెలిపారు. సరైన కారణం లేకుండా తిరస్కరించిన వాటిని పరిశీలించి అర్హులైన వారిని చేర్చాలని, తిరస్కరించిన జాబితాలను ప్రకటిం చాలని, కారణాలను దరఖాస్తు చేసిన వారికి తెలపడంతో పాటు ఆన్‌లైన్‌లో ఉంచాలని కోరారు. గుంటూరు జిల్లాలో మొత్తం 1,41,277 మంది దరఖాస్తు చేయగా 1,12,642 దరఖాస్తులు డ్రాఫ్టు లిస్టులో చేర్చారని, 28,635 దరఖాస్తులు తిరస్కరించారని పేర్కొన్నారు. వినుకొండలో 45 శాతం, బాపట్లలో 43 శాతం, నర్సరావు పేటలో 30 శాతం, చిలకలూరిపేటలో 27 శాతం, పొన్నూరులో 26 శాతం, సత్తెనపల్లిలో 25 శాతం దరఖాస్తులు తిరస్కరించారని తెలిపారు. నివాస ప్రాంతానికి దగ్గర్లో ఉండే పోలింగ్ కేంద్రంలో ఓటర్లను కేటాయించా లని, దీనికి భిన్నంగా కేటాయించారని, ఒక మండల పరిధి లోని ఓటర్లను ఆ మండల పరిధిలోని పోలింగ్ కేంద్రంలో కేటాయించాలని కోరారు. ఒకే ఇంటిలోని ఓటర్లను వివిధ కేంద్రాల్లో కేటాయించారని, దీన్ని సవరించాలని, కొన్ని పేర్లు రెండు, మూడు సార్లు పునరావృతమయ్యాయని, వాటిని సవరించాలని, పట్టణ ప్రాంతల్లో నివాసానికి దగ్గరల్లోని కేంద్రంలో ఓటర్లను కేటాయించాలని కోరారు.

## ఆనంద్ తెల్తుంబ్డే అరెస్ట్ సిగ్గుచేటు

### కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

దళిత ప్రొఫెసర్ ఆనంద్ తెల్తుంబ్డేను అరెస్టు చేయడం సిగ్గుచేటని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి అన్నారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో మతోన్మాద గుండాలను వదిలేసి దళితులకు మద్దతుగా ఉన్న మేధావులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. తక్షణం ఆయనపై పూనే పోలీసులు పెట్టిన తప్పుడు కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు కొరెగావ్ భీమా ముద్దాయిలను అరెస్టు చెయ్యలేదని, ఇంతకన్నా సిగ్గు చేటు ఉందా? అని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లా గూడూరు మున్సిపల్ కమిషనర్ ఓబులేసును కులం పేరుతో దూషించి చేతిలో ఉన్న కాగితాలు చింపివేసిన తెలుగు దేశం పార్టీ గుండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కమీషనర్‌ను అన్యాయంగా బదిలీ చేయడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. మంత్రి నారాయణ తన అధికార జులుంతో అక్కడ జరిగిన వాస్తవాలు పరిశీలించకుండా కమీషనర్‌ను బదిలీ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ దుర్మార్గాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

## అవాస్తవాలు... అభాండాలు

### ఆంధ్రజ్యోతిలో '10టివి' కథనంపై సిపిఎం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

10టివి అమ్మకానికి సంబంధించి అవాస్తవాలు, పార్టీపై అభాండాలతో ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంలో వాస్తవాలు లేవని సిపిఎం రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి మధు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పార్టీపై ఇలాంటి కథనాలు ప్రచురించడం సరైంది కాదని పేర్కొన్నారు. 10టివికి సంబంధించిన అన్ని విషయాలు పారదర్శకంగా ఉన్నాయని, ఈ కథనం అపోహలకు గురికావద్దని, తప్పుడు ఆరోపణలు నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలి

### ప్రైవేట్ ఉపాధ్యాయుల ధర్నా

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలన్న డిమాండ్‌తో ప్రైవేట్ ఉపాధ్యాయులు టీచర్స్ లెక్చరర్స్ ప్రొఫెసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ధర్నా నిర్వహించింది. విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ కన్వీనర్ నూర్ మహమ్మద్ మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు అన్ని అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం, ఉపాధ్యాయుల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ వంటి కనీస సౌకర్యాలను పర్యవేక్షించాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యతలను నిర్వర్తించడం లేదని విమర్శించారు. కో కన్వీనర్ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి హెల్త్ కార్డు ఇవ్వాలని, జీవితాంతం ఉపాధ్యాయునిగా పనిచేసి మరణించిన వారికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని కోరారు. మహిళా ఉపాధ్యాయులకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వాసు నాయక్, రమేష్ బాబు, శ్రీనివాస్, యూనివర్సిటీల కన్వీనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి జగన్

### నేడు సిఇసితో భేటీ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితాలో జరుగుతున్న అవకతవకలు, అక్రమంగా ఓట్ల తొలగింపుపై ప్రతిపక్ష నేత, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారికి పిర్యాదు చేయనున్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం సాయంత్రమే పార్టీ నాయకులతో కలిసి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. సోమవారం ఉదయం 11:30 గంటలకు పార్టీ నేతలతో కలిసి సీఈసీ రావత్‌తో సమావేశం కానున్నారు. టిడిపి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడటమే కాకుండా పోలీసు వ్యవస్థను సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకోవడంపె పిర్యాదు చేయనున్నారు. ఓటర్ల తొలగింపునకు సంబంధించిన అంశాలతో సీఈసీకి వినతిపత్రాన్ని కూడా అందజేయనున్నారు. సర్వేల పేరుతో నియోజకవర్గాల వారిగా అక్రమంగా ఓట్ల తొలగింపు కార్యక్రమాన్ని చేపడుతున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఇసిని కలిసి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. అలాగే రాష్ట్ర డిజిపి వ్యవహారశైలిపైనా పిర్యాదు చేసే అవకాశం ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు. జగన్ వెంట రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ విథున్‌రెడ్డి తదితరులు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

## ఔషధ ధరల పర్యవేక్షణా వ్యవస్థను ఏర్పాటు చేసిన కేరళ

**కోజికోడ్ :** కేరళ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ రంగంలో ఔషధ ధరల పర్యవేక్షణ, పరిశోధనా యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఔషధ ధరల నియంత్రణా చట్టం (డిపిసిఓ) పరిధిలో అత్యవసర ఔషధాలు, వైద్య పరికరాల ధరల ఉల్లంఘనను ఈ యూనిట్ పర్యవేక్షిస్తూ ఔషధ నియంత్రణాధికారులకు సహకరిస్తుంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు జాతీయ ఔషధ ధరల నిర్ణాయక వ్యవస్థ (ఎన్‌పిపిఎ)ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన ఐదేళ్లకు కేరళ ఈ వ్యవస్థను ఏర్పాటు చేయటం విశేషం. ఈ యూనిట్‌కు అవసరమైన కేంద్ర సహాయాన్ని పొందేందుకు ఒక సొసైటీని రిజిస్టర్ చేశామని రాష్ట్ర డ్రగ్స్ కంట్రోలర్ రవి ఎస్ మీనన్ మీడియాకు చెప్పారు. మౌలిక వసతులు ఏర్పాటు చేసిన వెంటనే కొత్త వ్యవస్థ పనిచేయటం ప్రారంభిస్తుందన్నారు. ఇప్పటి వరకూ ఔషధ ధరల సమీక్షకు ప్రత్యేక యంత్రాంగం ఏమీ లేదని ఆయన వివరించారు. కొత్తగా ఏర్పడే సొసైటీకి రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి ఛైర్మన్‌గానూ, డ్రగ్స్ కంట్రోలర్ సభ్య కార్యదర్శిగానూ వ్యవహరిస్తారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధితో పాటు ప్రైవేట్ ఫార్మాకంపెనీల ప్రతినిధులు సభ్యులుగా వుంటారు. వీరితోపాటు వినియోగదారుల హక్కుల రక్షణ వేదికకు చెందిన ప్రతినిధులు కూడా సభ్యులుగా వుంటారు. ఈ సొసైటీకి డ్రగ్స్ కంట్రోలర్ నేతృత్వంలో కార్యనిర్వాహక మండలి వుంటుంది. కొత్త పర్యవేక్షణా వ్యవస్థ ఔషధ ధరల పర్యవేక్షణ, డిపిసిఓ నిబంధనల ఉల్లంఘన, ఎన్‌పిపిఎ నిర్ణయించిన ధరల కొనసాగింపు, శాంపుల్స్ సేకరణ వంటి అంశాలలో డ్రగ్ కంట్రోలర్, ఎన్‌పిపిఎలకు సహకరిస్తుంది.

## మళ్ళీ నేనే ప్రధాని : మోడీ ధీమా

**లేహ్ :** మళ్ళీ తానే ప్రధానిని అవుతానని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ఆదివారం ధీమా వ్యక్తం చేశారు. మళ్ళీ తాను ప్రధాని అయ్యి ఇప్పుడు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేసేందుకు వస్తానని కాశ్మీర్ ప్రజలతో ఆయన అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఆదివారం పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ఆయన లేహ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ సుదూర, కష్టతర ప్రాంతాలలో నివసిస్తున్న పేద రైతులకు రూ.6,000లు ఎంత ముఖ్యమో ఢిల్లీలోని ఎసి రూముల్లో కూర్చున్న వారికి ఏ మాత్రం తెలియదని ప్రతిపక్షాల నుద్దేశించి వ్యాఖ్యానించారు. ఇటీవల ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో రెండు హెక్టార్ల వరకు సాగు భూమి ఉన్న రైతులకు ఏడాదికి రూ.6,000లు ప్రత్యక్ష ఆదాయాన్ని అందించనున్నట్లు మోడి ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పథకాన్ని వివరిస్తూ "అర్హత ఉన్న ప్రతి ఒక్క రైతుకు ఏడాదికి రూ.6 వేలు అందుతాయి. మూడు దఫాలుగా దీనిని చెల్లిస్తాం. మొదటి విడత చెల్లింపులు త్వరలోనే అందుతాయి. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతాను" అని మోడి అన్నారు. లడక్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన తొలి యూనివర్సిటీని ఆయన ప్రారంభించారు. లేహ్‌లోని కుషోక్ బకుల రింపోచీ (కెబిఆర్) విమానాశ్రయ కొత్త టెర్మినల్ భవనానికి శంకుస్థాపన చేశారు. లడక్‌లోని కొత్త పర్యాటక, ట్రెక్కింగ్ మార్గాలను ఆయన ప్రారంభించారు. మోడీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ తిరిగి తానే అధికారంలోకి వస్తానన్న ధీమా వ్యక్తం చేశారు. ఇప్పుడు తాను శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను తానే తిరిగి ప్రారంభిస్తానన్నారు. ఈ ప్రాంత సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అభివృద్ధి ప్రయోజనాలు పొందని ప్రజలకు చేరువయ్యేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని చెప్పారు.

**ప్రత్యేకం**

# మత ఘర్షణలతో లబ్ధికి యత్నం

- బిజెపిది హేయమైన చర్య
- ప్రశ్నిస్తే అర్బన్ నక్సల్ ముద్ర వేయడం దారుణం
- జంతర్ మంతర్ ధర్నాలో సుభాషిణీ అలీ, ప్రశాంత్ భూషణ్



**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

మత ఘర్షణలతో బిజెపి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తుందని, ఇది హేయమైన చర్య అని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణీ అలీ విమర్శించారు. కుల, మత కొట్లాటలను ఏ నాగరిక సమాజం స్వాగతించదని, అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్నటువంటి పాలకులు మాత్రం మత ఘర్షణలు చేయడాన్ని ఫ్యాషన్‌గా భావిస్తున్నారని విమర్శించారు. మోడీ సర్కార్ పాలనలో పౌర హక్కుల సంఘాలపై దాడులు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత, గిరిజన, అణగారిన వర్గాల కోసం అన్ని సంఘాలు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారీ వర్గాల కోసం పని చేస్తున్న పాలక పక్షాలు పౌర సంఘాలపై దేశ విద్రోహం పేరుతో భౌతిక, న్యాయ పరంగా దాడులు చేస్తున్నాయని దుయ్యబట్టారు. కేంద్రంలో అధికారం వెలగబెడుతున్న మోడీ సర్కారు పెట్టుబడిదారీ వర్గాల కోసం నిరంతరం పని చేస్తూ అణగారినవర్గాల ప్రజానీకం సమస్యలను విస్మరిస్తుందని విమర్శించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు పలు సామాజిక, ప్రజాస్వామ్య సంఘాలు, రాజకీయ పార్టీలు సంయుక్తంగా తలపెట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నాడు జంతర్ మంతర్ వద్ద పౌర, సామాజిక హక్కుల సంఘాలు సంయుక్తంగా భారీ ధర్నా చేపట్టాయి. వేలాది మంది పౌర, సామాజిక సంఘాల కార్యకర్తలు పాల్గొన్న ఈ ఆందోళనలో మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ధర్నాలో పాల్గొన్న సుభాషిణీ అలీ మాట్లాడుతూ పౌర, సామాజిక సంఘాలు చేపడుతున్న ఉద్యమానికి సిపిఎం అండగా ఉంటుందని, ప్రజా ఉద్యమాలకు పరోక్షంగా, ప్రత్యక్షంగా మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. దేశంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, హక్కుల కోసం ఉద్యమిస్తే దేశ ద్రోహం, అర్బన్ నక్సల్స్ ముద్ర వేస్తున్నారని విమర్శించారు. స్వేచ్ఛ, భావప్రకటన హక్కులపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. హక్కుల కోసం ఉద్యమించిన నేతలపై కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం వంటి అప్రజాస్వామ్యక చర్యలకు మోడీ సర్కార్ పాల్పడుతుందని దుయ్యబట్టారు. హక్కుల కార్యకర్త, ప్రొఫెసర్ ఆనంద్ తెల్తుంబ్డేను శనివారం ముంబాయి పోలీసులు అప్రజాస్వామ్యంగా అరెస్టు చేశారని, పోలీసులు చట్టవ్యతిరేక అరెస్టులను పుణే కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని విమర్శించారు. సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ సామాన్య ప్రజల హక్కుల కోసం పని చేస్తుంటే, అర్బన్ నక్సల్స్ అంటూ ముద్రేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎన్నికల ముందు ఏదో మత ఘర్షణ జరిగే ప్రమాదం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. లౌకికవాదులంతా అప్రమత్తంగా దేశాన్ని కాపాడుకోవాలని సూచించారు.. రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, సైనికుల సంక్షేమంపై ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మోడీ సర్కార్‌కు ప్రజలకు ప్రాథమిక హక్కులు కల్పించడం, సంక్షేమం అందించడం వంటి అంశాలపై దృష్టి లేదని, కేవలం అధికార యావ మాత్రమే ఉందని పేర్కొన్నారు. ప్రముఖ సామాజిక కార్యకర్త, రచయిత గుహర్ రాజా మాట్లాడుతూ దేశమంతా నమో ఫోబో యోలో కొనసాగుతుందని ఎద్దేవా చేశారు. ఈ ధర్నాలో ప్రముఖ పౌర హక్కుల సంఘాల నేతలు తెహ్మీన్ అరోరా, దేవేంద్ర భారతి, మంజూషా, పుజా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

**సంక్షిప్తం**

## నేటి నుంచి కన్నా బసు యాత్ర - ప్రారంభించనున్న అమిత్‌షా

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ ఈ నెల 4వ తేదీ నుంచి జనచైతన్య యాత్ర చేపట్టనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ వెల్లడించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రత్యేకంగా బస్సును సిద్ధం చేసుకున్నారని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యాత్ర శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ నుంచి ప్రారంభమవుతుందని, పార్టీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై యాత్రను ప్రారంభించనున్నారని తెలిపింది.

## భారత్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోం : పాక్

**లాహోర్ :** భారత్ అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకునే ఉద్దేశ్యం తమకు లేదని పాక్ విదేశాంగ మంత్రి షా మహ్మద్ ఖురేషి తెలిపారు. కాశ్మీర్ వేర్పాటువాద హురియత్ నేత మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్‌తో తాను జరిపిన టెలిఫోన్ సంభాషణను ఒక వివాదంగా మార్చకూడదని భారత్‌కు విజ్ఞప్తి చేశారు. పాక్ దౌత్యాధికారి సొహెయిల్ మహమూద్‌ను గత జనవరి 30 భారత్ పిలిపించి ఫరూక్‌తో ఖురేషి జరిపిన టెలిఫోన్ సంభాషణ దేశ ఐక్యతను అణిచివేసే ప్రయత్నమని, తమ దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను ఉల్లంఘించే ప్రయత్నమని ఆయనకు తెలియచేసింది. పాక్ దౌత్యాధికారి మహమూద్‌ను విదేశాంగ శాఖ కార్యదర్శి విజయ్ గోఖలే ఈ విషయమై హెచ్చరిస్తూ ఖురేషీ తీరు ఇబ్బందికరంగా ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఈ నేపథ్యంలో శనివారం ఖురేషి ముల్తాన్‌లో మాట్లాడుతూ భారత్ అంతర్గత వ్యవహారాలో జోక్యం చేసుకునే ఉద్దేశ్యం పాక్‌కు లేదని వివరణ ఇచ్చారు. హురియత్ నేత మిర్వాయిజ్‌తో ఫోన్‌లో సంభాషించినట్లు అంగీకరించారు. భారత్ దీనిని ఒక సమస్యగా చూడకూడదని అన్నారు. "కాశ్మీర్ సమస్యను చర్చలతో పరిష్కరించుకోవాలనుకుంటున్నాం. కాని భారత్ దీనిపై అనవసరమైన రాద్ధాంతం చేస్తోంది. భారత్‌లోనే సమస్యలు తలెత్తుతున్నాయి. వాటిల్లో పాక్ పాత్ర లేదు" అని ఖురేషి స్పష్టం చేశారు. లండన్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఈ వారంలో జరిగిన ఒక కార్యక్రమంలో కాశ్మీర్‌పై పాక్ అభిప్రాయాన్ని తెలియచెప్పినట్లు ఖురేషి అన్నారు.

# మోడీ, మమత ప్రభుత్వాలను గద్దె దించుతాం

### పీపుల్స్ బ్రిగేడ్ ర్యాలీలో ప్రజల ప్రతిజ్ఞ

### జనసంద్రమైన కోల్‌కతా నగరం

### బిజెపి, తృణమూల్‌లవి అప్రజాస్వామిక విధానాలు

### వామపక్షాలకు మద్దతు పలకాలని నేతల పిలుపు



అభివాదం చేస్తున్న నేతలు

**ప్రజాశక్తి ప్రతినిధి-కోల్‌కతా :** కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని మమత ప్రభుత్వాలను గద్దె దించుతామని పశ్చిమబెంగాల్ ప్రజలు ప్రతిన బూనారు. ఆదివారం నిర్వహించిన పీపుల్స్ బ్రిగేడ్ ర్యాలీ సందర్భంగా నగరమంతా ఎరుపు వర్ణం అలముకుంది. కోల్‌కతా నగరం ఎరుపు జెండాకు పర్యాయపదంగా మారిందా అన్న విధంగా వామపక్ష కార్యకర్తలు లక్షలాదిగా కదంతొక్కారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో మమత ప్రభుత్వానికి చరమగీతం పాడుతామని, తద్వారా దేశంలో మార్పు కోసం బాటలు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. దాదాపు 3.8 చదరపు కిలోమీటర్ల బ్రిగేడ్ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసించారు. ప్రత్యామ్నాయ రాజకీయాలతోనే దేశ మార్పు, అభివృద్ధి సాధ్యమని పలువురు నేతలు తెలిపారు. దీనికి ప్రజలందరూ మద్దతు పలకాలని కోరారు. రైతులు, కార్మికులు, ఇతర వర్గాల ప్రజలు తరలివచ్చిన ఈ ర్యాలీని చూస్తుంటే జనసంద్రాన్ని తలపిస్తోందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. మతతత్వ బిజెపి, అప్రజాస్వామిక మమత ప్రభుత్వాలు ఈ జన సునామీలో కొట్టుకుపోతాయని, రాజకీయాల్లో పెనుమార్పులకు ఇది నాంది పలుకుతుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు మహ్మద్ సలీం అభిప్రాయపడ్డారు. దేశాన్ని రక్షించుకోవాలంటే బిజెపిని, రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే తృణమూల్‌ను తరిమికొట్టాలని ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు.



ప్రముఖ శాస్త్రవేత డా. తపస్ చక్రవర్తితో కలిసి ప్రదర్శనకు హాజరైన టెలికాం ఉద్యోగుల మాజీ నేత మధుసూధన్ చక్రవర్తి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సూర్యకాంత మిశ్రా మాట్లాడుతూ బిజెపి, టిఎంసీల మధ్య రహస్య మిత్రత్వం ఉందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారం కోల్పోతే, రాష్ట్రంలో టిఎంసీ ప్రభుత్వానికి కూడా నూకలు చెల్లినట్లేనన్నారు. ప్రస్తుతం రైతులు, కార్మికులు చేస్తున్న ఈ పోరాటం దేశ భవిష్యత్తుకు ఉపయోగపడుతుందన్నారు. లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్ బసు మాట్లాడుతూ ప్రభుత్వంపై పోరాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఈ సమమావేశంతో స్పష్టమైందన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ మంత్రి దెబ్లినా హెమ్రేమ్ తన మాతృభాష సంతాలి, బెంగాలీ భాషలలో మాట్లాడుతూ ప్రజలను ఉత్సాహపరిచారు. ఆహారం, విద్య, నివాసం, ఉపాధి కోసం ఆదివాసీలు ఇప్పటికీ పోరాడుతున్నారని తెలిపారు. వారి దీన స్థితి వర్ణించలేనిదని ఈ సందర్భంగా ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సరైన విద్య అందించాలని, తమ భాషకు తగిన గౌరవం కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వామపక్ష ప్రభుత్వంలో తమకు ఉన్న గౌరవం నేడు లేదన్నారు. దోచుకున్న సొమ్ముతో టిఎంసీ పార్టీ ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. ఇది వారికి సాధ్యం కాదని తెలిపారు. దెబ్లీనా ప్రసంగంతో సభ అంతా హర్షధ్వానాలతో మారుమోగింది.

సిపిఐ నేత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు, వామపక్షాలతో కూడిన ఈ ఐక్య ఉద్యమం రానున్న రోజుల్లో పెనుమార్పులు తీసుకురానుందన్నారు. ఈ సభ వచ్చే లోక్‌సభ ఎన్నికలపై తప్పక ప్రభావం చూపుతుందన్నారు. ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శి క్షితి గోస్వామి మాట్లాడుతూ ఈ ర్యాలీతో వామపక్ష కార్యకర్తలో ఉత్సాహం వచ్చిందని, దేశంలో పెచ్చురిలుతున్న అప్రజాస్వామిక విధానాలకు ముగింపు పలికే వరకూ పోరాటం సాగిస్తారని తెలిపారు. సిపిఐ (ఎంఎల్) కార్యదర్శి దిపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ ఈ ర్యాలీతో పశ్చిమ బెంగాల్ ప్రజల్లో వామపక్ష విధానాలు ఎంత బలంగా ఉన్నాయో బిజెపి, టిఎంసీలకు అర్థమైవుంటుందన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ కార్యదర్శి దేబ్రబత బిస్వాస్ మాట్లాడుతూ నిరంకుశ దళాలను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనేది ఈ ర్యాలీతో స్పష్టమౌతుందన్నారు. వీరితో పాటు పలువురు వామపక్ష నాయకులు ర్యాలీలో మాట్లాడారు. కార్యక్రమానికి ముందు పలువురు కళాకారులు ఉద్యమ గీతాలు ఆలపించారు.




ప్రదర్శనగా వస్తున్న ప్రజానీకం



ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి, సురవరం సుధాకర రెడ్డి

## మోడీ ఓటమితోనే దేశానికి రక్షణ

### సిపిఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి

సందపను దోపిడీ చేయడంతో పాటు మతోన్మాదాన్ని వ్యాప్తి చేస్తూ దేశాన్ని అన్నివిధాలా నాశనం చేస్తున్న ప్రధాని మోడీ ఓటమితోనే దేశానికి రక్షణ ఉంటుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. అందుకోసం కేంద్రంలో ప్రత్యామ్నాయ, ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఆదివారం కోల్‌కతాలో జరిగిన పీపుల్స్ బ్రిగేడ్ ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దోపిడీ చేసే కాపలాదారుడు మనకు అవసరం లేదని, రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. సొంత లబ్ధి కోసం బిజెపి నేతలు మతోన్మాదం అనే విషాన్ని వాడవాడలా వ్యాప్తి చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే పాలన విధానాల్లో మార్పులు రావాలన్నారు. కేంద్రం చేస్తున్న మోసపూరిత వాగ్ధానాల వలలో చిక్కుకునేందుకు ప్రజలు సిద్ధంగా లేరని ఆయన చెప్పారు. ప్రజలను వంచించే విషయంలో రాష్ట్రంలోని టిఎంసీ, కేంద్రంలోని బిజెపి దొందూదొందేనని ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉందని ఏచూరి తెలిపారు.

## ఏదైనా జరిగితే ప్రజలు మోడీనే బాధ్యులుగా చేస్తారు

### సామాజిక కార్యకర్త అన్నా హజారే



**రాలేగావ్ సిద్ధి :** తనకు ఏదైనా జరిగితే ప్రజలు ప్రధాని మోడినే బాధ్యుడిగా చేస్తారని అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే ఆదివారం అన్నారు. అవినీతిని నిర్మూలించేందుకు కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాలలో లోకాయుక్త్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు రోజులుగా ఆయన తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో జన ఆందోళన్ సత్యాగ్రహ్ పేరుతో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ "సమస్యలను పరిష్కరించే వ్యక్తిగానే ప్రజలు నన్ను గుర్తుంచుకుంటారే గాని, సమస్యను మరింత తీవ్రతరం చేసే వాడిగా కాదు. నాకు ఏదైనా జరిగితే ప్రజలు ప్రధాన మంత్రినే బాధ్యునిగా చేస్తారు" అన్నారు. లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థలను ఏర్పాటు చేయడంలో మోడీ ప్రభుత్వం విఫలమయ్యిందని ఆయన వ్యాఖ్యానించారు. "ప్రధాని కూడా అవినీతికి పాల్పడుతున్నాడంటూ ప్రజలు ఆధారాలు అందిస్తే ఆయనపై లోక్‌పాల్ ద్వారా దర్యాప్తు జరుపుతారు. అదేవిధంగా రాష్ట్రాలలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలపై తగిన ఆధారాలతో అవినీతి ఆరోపణలు వస్తే లోకాయుక్త దర్యాప్తు చేపడతారు" అని ఆయన చెప్పారు. లోక్‌పాల్ బిల్లు 2013లో పార్లమెంట్ ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. అయినా ప్రభుత్వం లోక్‌పాల్, లోకాయుక్తలను ఇప్పటికీ నియమించక పోవడం గమనార్హం.

## అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా రైతులకు రుణమాఫీ

### రాహుల్ హామీ

**పాట్నా :** తాము అధికారంలోకి వస్తే దేశంలోని రైతులందరికీ రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరో ఎన్నికల అస్త్రాన్ని సంధించారు. ఇటీవల పేదలకు కనీస ఆదాయాన్ని కల్పిస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. రైతు రుణమాఫీ అస్త్రాన్ని ఉపయోగించి ఇటీవల జరిగిన రాజస్తాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్‌లో చిన్న, సన్నకారు రైతులకు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టిన రెండు రోజుల అనంతరం కాంగ్రెస్ రుణమాఫీ తాయిలాన్ని ప్రకటించింది. ఈ మూడు రాష్ట్రాల్లో తాము అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే రైతు రుణమాఫీ చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా తదుపరి సార్వత్రిక ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దేశ వ్యాప్తంగా రైతు రుణాలు మాఫీ చేస్తామని పాట్నాలోని ర్యాలీలో ఆదివారం హామీనిచ్చారు. మోడీజీ రైతులను అవమానించారని దుయ్యబట్టారు. మీరు రైతులను అవమానించి టన్లయితే, వారే మీకు సమాధానం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో తేజస్వి యాదవ్, శదర్ యాదవ్, ఇతర ప్రతిపక్ష నేతలు పాల్గొన్నారు.

## భానుప్రియ ఇంట్లో ముగ్గురు మైనర్ బాలికల గుర్తింపు

- బాలికల అక్రమ రవాణా ఆరోపణల నేపథ్యంలో దాడులు

**చెన్నై/సామర్లకోట :** సినీ నటి భానుప్రియ బాలికలను అక్రమ రవాణా చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో చైల్డ్‌లైన్ ప్రతినిధులు, అధికారులు చెన్నైలోని ఆమె ఇంటిపై అధికారులు దాడులు చేశారు. ఇంట్లో ముగ్గురు మైనర్ బాలికలను గుర్తించారు. తమ పాపను ఇంటి పనులకు ఉపయోగించుకుంటూ వేతనం చెల్లించట్లేదని పాప తల్లి ఆంధ్రప్రదేశ్‌లోని సామర్లకోటలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు చైన్నైలోని ఆమె ఇంటికి వెళ్లారు. బాలల హక్కుల కార్యకర్త అచ్చు తరావు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు లేఖ రాశారు. కమిషన్ ఆదేశాల మేరకు ఈ దాడులు జరిగాయి. బాలకార్మిక చట్టం ఉల్లంఘనపై భానుప్రియ అరెస్టు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో బాలికల అక్రమ రవాణా ఆరోపణలపై విచారణ చేయాల్సి ఉందన్నారు.

## ఆనందీబెన్ రాజీనామా చేయాలి

### మధ్యప్రదేశ్ కాంగ్రెస్ డిమాండ్



**భోపాల్ :** మధ్యప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆదివారం డిమాండ్ చేసింది. ఆమె బిజెపి ఏజెంటుగా పనిచేస్తున్నారని ఆరోపించింది. ప్రధాని మోడిని జాగ్రత్తగా చూసుకోండని ఆమె కొంతమంది గ్రామస్తులతో అన్నట్లు వార్తలు వెలువడిన ఒక రోజు తరువాత కాంగ్రెస్ పార్టీ ఆమె రాజీనామాకు డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని రేవా జిల్లా గడ్‌లో ఉన్న సౌర విద్యుత్ ప్లాంట్‌ను సందర్శించినప్పుడు ఆమె పై వ్యాఖ్యలు చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. గత ఏడాది ఏప్రిల్‌లో కూడా ఆనందీబెన్ పటేల్‌కు సంబంధించిన వివాదాస్పద వీడియో ఒకటి సామాజిక మాధ్యమంలో సర్క్యులర్ అయ్యింది. బిజెపికి చెందిన ఒక మహిళా నేతకు "ఓటు మంత్ర" ఇస్తున్నట్లు ఆ వీడియోలో ఉంది. ప్రభుత్వ అధికారులపై ఆధారపడకుండా పోషకాహార లోపంతో ఉన్న పిల్లలను దత్తత తీసుకోవాలని ఆ మహిళా నేతకు ఆనందీబెన్ సూచించారు. "ఈ అధికారులకు ఓట్లు అవసరం లేదు. కాని మనకు అవసరం" అని బిజెపి నాయకురాలు, సత్నా మేయర్ మమతా పాండేతో ఆమె అన్నట్లున్న వీడియో సోషల్ మీడియాలో సర్క్యులర్ అయి వివాదాస్పదమయ్యింది. రాష్ట్రంలోని సత్నా జిల్లాలో పటేల్ పర్యటన సందర్భంగా ఆ వీడియో తీసినట్లు భావిస్తున్నారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు పొందాలంటే ఆ ప్రాంతంలోని పౌష్టికాహార లోపంతో ఉన్న, పేద పిల్లలను దత్తత తీసుకోవాలని మమతా పాండేకు, ఇతర పార్టీ నేతలకు ఆమె సలహా ఇచ్చినట్లు ఆ వీడియోలో ఉంది. అయితే మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందిన సంగతి తెలిసిందే.

## ఇల్లును చక్కబెట్టుకోలేనోడు.. దేశాన్నేం ఉద్ధరిస్తాడు

### దుమారం రేపుతున్న నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు

**ముంబయి :** లోక్‌సభ ఎన్నికలకు ముందు అధికార పార్టీ బిజెపిలో అసమ్మతి రాగం ఊపందుకుంటున్నదా ? నిన్నా మొన్నటి దాకా శత్రుఘ్న, యశ్వంత్ సిన్హా లాంటి రెబెల్ నాయకులే.. బిజెపికి వ్యతిరేకంగా గళమెత్తగా ఇప్పుడా జాబితాకు కీలక నేతలు సైతం తోడవుతున్నారు. కానీ, రెబెల్ నేతలలాగా వీరు ప్రత్యక్షంగా ఎదురుదాడికి దిగకుండా పరోక్షంగా చురకలంటిస్తున్నారు. సొంతింటిని చక్కబెట్టు కోలేని వ్యక్తి.. ఇక దేశాన్ని ఏం ఉద్ధరిస్తారంటూ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని రేపుతున్నాయి. ప్రధాని మోడీని లక్ష్యంగా చేసుకొనే ఆయన ఇలా పరోక్ష పంథాను ఎంచుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో శనివారం జరిగిన ఎబివిపి మాజీ కార్యకర్తల సమావేశంలో గడ్కరీ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను చాలామంది ప్రజలను కలిసి మాట్లాడగా.. బిజెపి కోసం, దేశం కోసం జీవితాలను అంకితం చేయడానికైనా సిద్ధమన్నారని తెలిపారు. కాగా.. వారిలో ఒక వ్యక్తిని 'మీరు, మీ కుటుంబీకులు ఏం చేస్తారు' అని ప్రశ్నించినట్టు చెప్పారు. దానికి ఆ వ్యక్తి సమాధానంగా.. తాను చిన్నపాటి షాపు నిర్వహించేవాడినని, నష్టం రావడంతో దాన్ని మూసివేసి ఖాళీగా ఉంటున్నట్టు తెలిపాడు. 'ముందు నీ కుటుంబం బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి పిల్లలను మంచిగా చూసుకో. ఆ తర్వాతే పార్టీయైనా, దేశమైనా' అని గడ్కరీ.. సదరు వ్యక్తికి సూచించారు. సొంతింటిని చక్కబెట్టుకోలేని వారు దేశాన్ని బాగు చేయలేరంటూ వ్యాఖ్యానించడం గమనార్హం. హామీలు నెరవేర్చే ఏ నేతనైనా ప్రజలు అభినందిస్తారని, కానీ, అలా జరగని పక్షంలో వారు దాడికి సైతం వెనుకాడబోరంటూ గడ్కరీ కొద్ది రోజుల కిందట సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

## పద్మశ్రీ వెనక్కి

### పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా

### మణిపూర్ సినీనిర్మాత శ్యాంశర్మ ప్రకటన

**గువహటి :** కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పద్మశ్రీ పురస్కారాన్ని వెనక్కు ఇచ్చేందుకు మరొకరు సిద్ధమయ్యారు. కేంద్రం తీసుకొస్తున్న పౌరసత్వ సవరణ బిల్లు- 2016కు వ్యతిరేకంగా తన అవార్డును వదులుకుంటున్నానని మణిపూర్‌కు చెందిన చిత్ర నిర్మాత, సంగీత దర్శకుడు అరిబం శ్యాంశర్మ ప్రకటించారు. బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న ప్రజలను పట్టించుకోని ప్రభుత్వం ఇచ్చిన అవార్డును తన వద్ద ఉంచుకోవడం నైతికం కాదన్నారు. 1979-85 మధ్య కాలంలో అక్రమ చొరబాట్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో అసువులు బాసిన దాదాపు 855 మంది కుటుంబాల వారు తమకు 2016లో ఇచ్చిన సౌకర్యాలను ఇటీవల వదులుకున్నారు. ఇది జరిగిన వారంలోపే శ్యాంశర్మ ఈ నిర్ణయం తీసుకున్నారు.

#### కేంద్రంపై ఈశాన్యం ఆగ్రహం

పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల నుంచి డిసెంబర్ 31, 2014కు ముందు భారత్‌కు వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన ఈ బిల్లును తీసుకొస్తున్న కేంద్రంపై ఇప్పటికే పలు ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లు పరిధి నుంచి తమ రాష్ట్రాన్ని మినహాయించాలని మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేకం

## పట్టాలు తప్పిన సీమాంచల్ ఎక్స్‌ప్రెస్

### ఏడుగురు మృతి, 30 మందికి గాయాలు

**పాట్నా :** బీహర్‌లోని వైశాలి జిల్లాలో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. సీమాంచల్ ఎక్స్‌ప్రెస్(ట్రైన్ నెం : 12487) ఆదివారం ఉదయం పట్టాలు తప్పడంతో ఏడుగురు మృతి చెందగా, 30 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఈస్ట్ సెంట్రల్ రైల్వే పరిధిలోని సోనాపూర్ డివిజన్‌లోని షహదయ్‌బూజుర్గ్ వద్ద జరిగింది.. జాతీయ, రాష్ట్ర విపత్తు నివారణ బృందాలు సైతం ఘటనా ప్రాంతానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి నితీష్ కుమార్ విచారం వ్యక్తం చేసి, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు 4 లక్షల రూపాయలతో పాటు, క్షతగాత్రులకు 50 వేల రూపాయల నష్టపరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనితో పాటు మృతుల కుటుంబ సభ్యులకు 5 లక్షల రూపాయలు, తీవ్రంగా గాయపడిన వారికి లక్ష, స్వల్ప గాయాలయిన వారికి 50 వేల రూపాయలను రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది.



ఈ ఘటన విచారకరమని కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. సహాయక చర్యలు ముగిశాయని, ఈ ఘటన జరగడానికి గల కారణాలపై రైల్వే రక్షణ ఈస్టన్ సర్కిల్ కమిషనర్ దర్యాప్తు చేపట్టనున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 11 కోచ్‌లు పట్టాలు తప్పగా, మూడు కోచ్‌లు బోల్తా పడ్డాయని, ప్రమాదవ శాత్తూ జరిగిన ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని, 27 మంది స్వల్పంగా గాయపడ్డారని మంత్రిత్వ శాఖ తెలిపింది. క్షతగ్రాతులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

మేము నిద్రలో ఉండగా..రైలు పెద్ద శబ్దం చేస్తూ పట్టాలను తప్పింది. ఆ తర్వాత స్థానిక ప్రజలు తమ వద్దకు చేరుకొని సహాయం అందించారు. ఈ ఘటనలో తన సోదరి కాలుకు గాయమైందని ప్రయాణికురాలు సవితా కుమారి వెల్లడించారు. మృతులకు ప్రధాని మోడీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీలు ట్విట్టర్ ద్వారా తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.



## కౌరవం - పాండవం

**కౌరవమ్:**
తాయిలాలు పంచుతాము తరలిరండి ఓటర్లూ
బంగారక్క మేడమూ! కేతిగాడు సారూ!!
అయిదేళ్లకొక్కసారి మీకు ప్రాణ ప్రతిష్ఠ
అయిదేళ్లూ సాగుతుంది మా పదవి నిష్ఠ
పదవీవ్రత దేశంలో సంపదలకు అడ్డదారి
కండువాలు జెండాలు మా పరపతి గుర్తులు
రాజకీయమంటేనూ సగం రాముడూ
మరో సగం కులమండీ సోదరీ సోదరులూ
గవర్నమెంట్ పని చేస్తే గిన్నెసు బుక్కూ
రాజధాని నిత్యం తేదీలేని చెక్కూ
నిధుల వరద కావాలి కావవే వరద
తలపెట్టిన పనులన్నీ నిజంగా గజాలు
గజమైనా నడవలేవు దానికుందో కారణం
సమస్యల మొండి మొసలి పట్టిందయా కాలు
అభివృద్ధికి కావాలి జరూరుగా గజేంద్ర మోక్షం
ప్రార్థిస్తాము శాయశక్తులా సంరక్షించు భద్రాత్మకా
యజ్ఞాలూ యాగాలకు రామలక్ష్మణుల రక్ష
నోటు బందీ చేసినాము, జిఎస్టీ రుద్దినాము
సరిహద్దు యుద్ధాల సందడి సృష్టించినాము
వ్యవసాయం కాటి సీను పసందుగా పండించినాము
వలస పోయే రైతన్నా.. రా ఓటేసి వెళ్లిపో
కుమిలిపోయే కూలమ్మ నీకు కానుకలే తెచ్చాము
నిరుద్యోగ గణాంకం శివమెత్తిన భూతం
ఉపాధి రహిత భారతం మీకు సమర్పితం!

**పాండవమ్ :**
ఆవిరైన ఉద్యోగాల కోసం యువత ఆక్రోశం
యువతరం కొలువలన్నీ రాజకీయ పార్టీలే చేశారు
ఏ పార్టీ చెప్పినా తెగదు ఆర్థికం పీట ముడి
ఉద్యోగం, ఉపాధి వట్టి మాటలతో గారడీ
వ్యవసాయం పడుకుంది ఉద్యోగం ఊరుకుంది
ఉపాధి గల్లంతు, బడి కూడా బందు
నీరు మీరు తేలేరు కన్నీరే తెచ్చారు
రేపు మీద ఆశ రేపు – మెలకువ మిగిలింది
రగులుతున్నది అసంతృప్త జన పాండవం
కోట్ల జనంలో పెరుగుతున్న నిరాశ
అవకాశం జమ్మి చెట్టు ఆయుధాల ఉనికిపట్టు
దించారా ఆయుధం అయ్యారా సాయుధం
మంత్రాంగం తంత్రాంగం ఎత్తాలిక డేరా
మా పన్నులతో మీరు సంపన్నులా
అడుగుతోంది జనం నాడి ఎందుకిలా?
గణతంత్రం సాక్షిగా ఇది తేలాల్సిన కథేరా!

– రామతీర్థ
98492 00385.





సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చొని మొరగదు. తుపాను ఒకడికి చిత్తం అనదు ఎరగదు. పర్వతం ఎవడికీ వొంగి సలాం చేయదు.
– శేషేంద్ర

# జర్నలిస్టు కవికి అనువాద పురస్కారం

అభినందన

**'గుండెల్లో చితికిన ప్రశ్న**
**గొంతుల్లో గాయపడ్డ పాట**
**కళ్లల్లోంచి**
**చూపుల మంచు ముక్కలు**
**ఎడారి జీవితంలో**

భావాల ఎండ మావులు' అంటూ ఒకానొక అసంకల్పితాన్ని అక్షరబద్ధం చేసినవాడు కృష్ణుడు. కవితా ప్రేమికులకు చిరపరిచితమైన పేరు 'ఉన్నట్లుండి', 'ఇంకెవరు', 'ఆకాశం కోల్పోయిన పక్షి' కవితా సంపుటుల ద్వారా కవితా విను వీధుల్లో తనదైన ముద్ర వేసినవాడు. చాలా కాలంగా ఆయన కవిత్వాన్ని ఆస్వాదిస్తున్న నాకు ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఇండియా గేట్' శీర్షికన వ్యాసాలు రాస్తున్న కృష్ణారావు, కవిగా ప్రసిద్ధి చెందిన కృష్ణుడు ఒకరేననే విషయం చాలా ఆలస్యంగా తెలిసింది. ఢిల్లీ నుంచి కేంద్ర స్థాయి రాజకీయాల్ని సునిశితంగా విమర్శిస్తూ వ్యాసాలు రాసే కృష్ణారావు అంటే చాలా అభిమానం నాకు. దాదాపుగా ప్రతి బుధవారం ఆయన వ్యాసం కోసం ఒక విధమైన ఎదురుచూపే! ఢిల్లీ రాజకీయాల్ని నిస్పక్షపాతంగా ఎండగట్టడం, అక్కడ నిరంతరం జరిగే పరిణామాల్ని ఎప్పటికప్పుడు తెలుగు వారికి అందించడం కృష్ణారావు నిత్యకృత్యం. కవి కృష్ణుడి పట్ల, జర్నలిస్టు కృష్ణారావు పట్ల వేర్వేరుగా అభిమానాన్ని పెంచుకున్న నాకు ఆ ఇద్దరూ ఒక్కరే అనే విషయం చాలా ఆనందాన్ని కలిగించింది.

**'శరీరమంతా కవిత్వం**
**పేగుల తీగలపై రణన్నినాదం'**
**'అతడు అనేక వచనం**
**కాగితాల గుబాళింపులో**
**స్నేహితాల సౌరభాల్లో**
**గుండెపొరల్లో**
**పదిలమైన స్నేహకావ్యం' –**

నిజమే! కృష్ణుడి కవిత్వం పేగుల తీగలపై రణన్నినాదం. అతనితో స్నేహం 'గుండెపొరల్లో పదిలమైన స్నేహ కావ్యం. వ్యాసం రాసేటప్పుడు రాజకీయాక్షరాల్ని తన కలం నుంచి విదిలించే కృష్ణారావు... కవిగా అత్యంత మృదువైన పదునైన కవితాక్షరాల్ని మన ముందు పరుస్తాడు. ఆ అక్షరాల్లోంచే తన నిరసన గళాన్ని విప్పుతాడు.


**'ఇండియా గేట్ వద్ద**
**నీళ్లల్లో కేరింతలు కొడుతున్న**
**బాల్యానికేం తెలుసు**
**సమీపంలోనే**
**తమ స్వప్నాల్ని భగ్నం చేసే**
**కుట్రలు జరుగుతున్నాయని**
**ప్రాణాల్ని ఊపిర్లు చేసి**
**గాలి బుడగలు నింపి**
**పసికళ్లలో ఆనందం చూసే**
**అభాగ్యురాలికేం తెలుసు**
**ఒక్క చెమటచుక్క రాల్చకుండా**
**కోట్లతో ఆకాశ హర్మ్యాలు కట్టుకోవచ్చుని'**

ఇవి కవి ఆశల్ని, ఆకాంక్షల్ని అద్దం పట్టే వాక్యాలు. కృష్ణారావు కవిగా, జర్నలిస్టుగా మాత్రమే ప్రసిద్ధుడు కాదు.


కృష్ణారావు


పద్మా సచ్‌దేవ్

అనువాద రంగంలో ఆయన విశేషమైన కృషి చేశాడు. కేంద్ర సాహిత్య అకాడమీ 2018 సంవత్సరానికి గాను అనువాద విభాగంలో అవార్డు ప్రకటించింది. పద్మాసచ్‌దేవ్, డోగ్రీలో వెలువరించిన కవితా సంపుటి ఆంగ్లానువాదం నుంచి కృష్ణారావు తెలుగులో 'గుప్పెడు సూర్యుడు.. మరికొన్ని కవితలు' పేరుతో కవితా సంపుటి వెలువరించారు. ఈ సంపుటి ఇప్పుడు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డును అందుకోనున్నది.




డోగ్రీ మాతృభాషగా కలిగిన పద్మా సచ్‌దేవ్ ప్రముఖ కవయిత్రి, నవలా రచయిత్రి. డోగ్రీలోనేకాక హిందీలో కూడా ఆమె రచనలు చేశారు. ఆమె డోగ్రీలో రాసిన కవితలను శివనాథ్, కరణ్‌సింగ్, సురేంద్రసింగ్, ఇక్బాల్ మసూర్, మృణాల్ పాండే వంటి ప్రముఖ రచయితలు ఆంగ్లంలోకి అనువదించారు. ఆ అనువాదాల సంకలనాన్ని ఇంగ్లీషులో ఏ హాండ్‌ఫుల్ ఆఫ్‌సన్‌అండ్ అదర్ పోయెమ్స్ పేరుతో కేంద్ర సాహిత్య అకాడమి ప్రచురించగా.. ఆ సంకలనం తెలుగు అనువాదాలను కృష్ణారావు చేశారు. తెలుగు జర్నలిస్ట్ భాషలోనూ, సాహిత్య భాషలోనూ నిష్ణాతులైన కృష్ణారావు ఈ సంకలనాన్ని తెలుగు జీవితాలకు దగ్గరగా అనువాదం చేశారు.

పద్మాసచ్‌దేవ్ ఆంగ్ల కవితా సంపుటికి ముందుమాట రాస్తూ కరణ్‌సింగ్– 'ప్రముఖ సంస్కృత పండితుడు పండిట్ జయదేవ్ శర్మ కుమార్తె పద్మ. దేశ విభజన సమయంలో ఆమె ఆయనను పోగొట్టుకున్నారు. ఆ తర్వాత ఎంతోకాలం ఆమె తీవ్రవేదనకు దు:ఖానికి గురయ్యారు. ఆమె కవితలు ఈ ఆంతరంగిక సంఘర్షణకు, వేదనకు అద్దం పడతాయి. డోగ్రీలో పద్మ తొలి మహిళా కవయిత్రి. ఆమె కవితలు భారతీయ స్త్రీల సంతోషాలు, దు:ఖాలు, అంతర్‌దృష్టి, పరితాపాన్ని లోతుగా ప్రతిఫలిస్తాయి. స్త్రీలు ఎదుర్కొంటున్న సామాజిక అన్యాయాల గురించి బాగా తెలిసిన పద్మాసచ్‌దేవ్ కవితల్లో పాత్రలు తమ హుందాతనాన్ని నింపుకుంటాయి' అంటారు.

కృష్ణారావు అనువాదం ఈ హుందాతనానికి ఏ మాత్రం లోటు లేకుండా సాగింది. ఈ కవితా సంపుటిలోని 64 కవితల్ని ఆరు భాగాలుగా విభజించి; తపన గీతికలు, ఈ రోజుల్లో నేను నిరీక్షించను, నేలపరిమళం, ధూపంలా మండుతూ, వేదనా పేటిక, సంతృప్తి గీతికలు అని పేర్లుంచడం ద్వారా ఆయా భాగాల్లో కవయిత్రి ఏమి చెబుతున్నదనేది మనకు స్పష్టమవుతుంది.

**ఒక స్త్రీ వేదనను 'క్రొవ్వొత్తి' కవితలో**
**'ఆమె కేశాలు**
**గాలిలో ప్రవాహంలా ఎగురుతున్నాయి**
**ఆమె దేహమంతా గాయపడింది**
**భద్రంగా దాచిన మైనంతో కొట్టుకు పోతోంది**
**ఆమె పాదాల కింద ముద్దలా పడిపోతోంది.**
**ఇంకా ఆమె కాంతిని ప్రసరిస్తోంది.**

తన శవంపై తాను నాట్యం కూడా చేస్తోంది.' అంటూ కరుగుతున్న కొవ్వొత్తిలో స్త్రీ మానసిక స్థితిని కవయిత్రి వర్ణించారు.

**బాధలనుంచి విముక్తియైన స్త్రీ**
**'నాకిపుడు స్వేచ్ఛ ఉంది**
**నిన్ను విదిలించుకున్నాను'**
**'ఏదో ఒక పక్షి నా గ్రామానికి**
**దారిచూపుతుందనే విశ్వాసం నాకుంది'**
**'ఇతరులు కనిపెట్టిన దారులపై నడవడం**

ప్రతిష్ఠకు భంగకరం' అంటూ తన కాళ్ళపై తాను నిలబడాలనే ఆకాంక్షను స్వేచ్ఛలోని ఆనందాన్ని ఈ కవితతో వ్యక్తం చేశారు కవయిత్రి.

ఆంగ్లంలోంచి తెలుగులోకి అనువాదం చేసేటప్పుడు ఎక్కడా ఇది పరభాషా కవిత అనే భావం కలగనీయకుండా తెనిగించారు కృష్ణారావు. వేదనా పేటిక, చితివాసన, మజిలీ శిబిరం, జనావాసం, రజనీ గంధ సువాసనలు, నేల పరిమళం వంటి పదబంధాలతో తెలుగుదనం చిక్కగా నింపాడు.

'పూర్ణ చంద్రుడిలా మెరిసే నా నగరాన్ని నా నగరం మని చేసిన వారి ముఖాలపై నీ దీపస్తంభాన్ని విసిరి కొట్టు' అనడంలో భావపరిపక్వత స్పష్టంగా కనిపిస్తుంది. వెన్నెల కాంతి – కవితలో..

**'ఎదురుగా వున్న రావిచెట్టు**
**గోడకు అతుక్కుపోయి**
**ఏడుస్తోంది**
**తన కన్నీళ్లతో ఆకులపై**
**దుమ్మును తుడుస్తుంది' అనడంలో ఒక విలక్షణమైన పదచిత్రం గోచరిస్తోంది.**
**'నన్ను బాధించకు**
**నేను మనిషిని**

ఆత్మను కాను' అన్న వాక్యాలతో మనిషి తన కుటుంబపు సాలెగూళ్ల మధ్య చిక్కుబడిన దృశ్యం, అందులోంచి బయటకు రావాలనే ప్రయత్నం కనిపిస్తోంది.

'గుప్పెడు సూర్యుడు.. మరికొన్ని కవితలు' కవితా సంపుటి ద్వారా కేంద్రసాహిత్య అకాడమి అనువాద పురస్కారం లభించడం కవిగా, జర్నలిస్టుగా మాత్రమే గాక గొప్ప అనువాదకుడుగా కూడా కృష్ణారావు ఉన్నత స్థితికి చేరుకున్నాడని మనం భావించవచ్చు.

– బండ్ల మాధవరావు
88976 23332

# పిడికిళ్లు బిగించిన అక్షరాలు

పుస్తకం


**కొం**దరు ఉద్యమాల్లోకి ఆదర్శం కోసం వస్తారు. మరికొందరు ఎగుడుదిగుడు జీవితం పోరాటాల వైపుకి తరిమితే అవసరం కోసం వస్తారు. బహుశా, సాహిత్యం కూడా అంతేనేమో! కొందరు ఆదర్శం కోసం, హాబీగా కవిత్వం రాస్తారు. మరికొందరు లోపల ఉన్న లావాని దాచుకోలేక బయటకి కక్కేస్తూ రాయకుండా ఉండలేని స్థితిలో రాస్తారు. తంగిరాల సోనీ రెండో కోవకి చెందుతాడు.

**ఎవరీ తంగిరాల సోనీ?**

కులం కార్చిచ్చులో దగ్ధమై ఈదేశ కుల సమాజాన్ని బోనులో నిలబెట్టిన అంటరాని ప్రేమికుడు కంచికచర్ల కోటేసు చితాభస్మం నుంచి ఓ ఫీనిక్స్ పైకి లేచింది. కోటేసుని అలుముకున్న దావానలాన్ని వెంటేసుకుని ఊరూరా తిరిగి అందరి మెదడు కొసకి నిప్పంటించి పోయిన బైరాగి కలేకూరి నిదురించిన సమాధి నుంచి ఓ ప్రశ్న మొలకెత్తింది... ఆ ప్రశ్న పేరే తంగిరాల సోని. బడిలో ఐదో క్లాసు వరకే చదువుకుని.. తర్వాత దాని మీద ప్రేమ చావక విడతలు విడతలుగా చదువుని కొనసాగించిన సోనీ కంటే గొప్ప చదువరి మనకాలంలో కనబడడు. కనబడిన పుస్తకమల్లా చదువుతూ చివరికి తానే ఓ ద్యమకారుడిగా, కవిగా, ఆలోచనాపరుడిగా ఆవిర్భవించిన సోనీ సాహితీ ప్రస్థానం మనల్ని గగుర్పాటుకు గురిచేస్తుంది. సోనీ బహుజన సాహిత్యోద్యమానికి కొత్త చిగురై సరికొత్త ఆశను వాగ్దానం చేస్తున్నాడు... నల్ల మనుషుల పొలికేక సోనీ అక్షరం!

తంగిరాల సోనీ కవితా సంపుటి 'బ్లాక్ వాయిస్'లో సుమారు 40 కవితలున్నాయి. ఇవన్నీ దళిత సమస్య తాలూకు వివిధ కోణాలను తనదైన దృష్టితో చిత్రించినవే! గత నాలుగైదు సంవత్సరాలలో దళితులపైన, ఆదివాసీలపైన, స్త్రీలపైన జరిగిన దాడులకు సోనీ వెంటనే స్పందిస్తూ కవిత్వం, వ్యాసాలు రాశాడు. వెలివాడల నుడికారాలు సోనీ కవితల నిండా అప్రయత్నంగానే పరుచుకున్నట్టు ఉంటాయి. కుల సమాజంలో పెత్తందారీ కులాల వారు దళితులపై సాగించే రకరకాల హింస, పీడన, వివక్ష తాలూకు వివిధ రూపాలు, వారి శ్రమ నిత్యం దోపిడీకి గురవ్వడం, దళిత స్త్రీలపై పెత్తందారీ కులాల వారు సాగించే లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలు మొదలైన అంశాలపైన కొత్త గొంతుతో సోనీ కవిత్వం వినిపిస్తుంది.

ఇప్పుడు నయా బ్రాహ్మణవాద కొత్తరకం ఎత్తుగడ అయిన 'దేశభక్తి'లో దాగున్న అప్రజాస్వామిక అణచివేత విధానాలు, తినే తిండిపైన, మాట పైన సాగుతున్న నిర్బంధం, 'పరువు' పేరున పెచ్చరిల్లుతున్న కుల దురహంకార హత్యలతో పాటు అంతరంగికంగా ఉద్యమాన్ని తమ సొంత ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టి 'అపనమ్మకాలు వండుతూ ఇస్తర్లు వేసే' దళిత దళారీల నైజం గురించి కూడా సోనీ తన కవిత్వంలో నిర్మొహమాటంగా ఎండగట్టాడు. అసలు కవిత్వం ఎందుకు రాయాలో, కవిత్వం నిర్వహించాల్సిన పాత్ర ఏమిటో సోనీకి స్పష్టత ఉంది అనడానికి ఈ కవిత మంచి ఉదాహరణ.




**'ఎగరేసిన ఆత్మగౌరవ ధిక్కార పతాకమై**
**కవిత్వం ఎగరాలి**
**ముళ్ళబాటను పువ్వుల వనంలా మార్చే**
**కవిత్వం రాయాలి**
**చీకటి బతుకుల్లో మగ్గుతున్న మనుషులకు**
**కవిత్వం వెలుగునివ్వాలి**
**ఆయుధం లేకుండా శత్రువు ముందు నుంచొని**
**పిడికిళ్ళు బిగించి పోరాడే వీరుడేరా కవి!'**

అంటూ తన కవిత్వ ఉద్దేశం చెప్పాడు సోనీ. అసమ సమాజం పట్ల ఉండే కసి, ధిక్కారం తన కవిత్వ చిరునామా అని చాలా స్పష్టంగా ప్రకటిస్తాడు. అందుకే –

**'అక్షరాల్లో పొగరుండాలి**
**చూరుకింద కారుతున్న నీటి శబ్దం తెలియాలి'** అని అంటాడు.

కుల వివక్ష అనేది అనుభవంలో ఎలా ఉంటుందో సోనీ ఇలా చిత్రిస్తాడు.

**'తలకాయల్ని తరగడం**
**ముక్కుల్లో డ్రిల్లింగ్గ మిషన్‌తో రంధ్రం వేయడం**
**తల్లిదండ్రులు, అన్నదమ్ముల ఎదురుగా**
**మానభంగాలు చేయడం**
**పొట్టను చీల్చి పిండాల్ని త్రిశూలాలతో పైకెత్తడం'**

ఇది చదువుతున్నప్పుడు మద్దూరి నగేష్ బాబు 'మీరేమిట్లు' కవిత గుర్తుకొస్తుంది.

మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్ బాబు లాగా సోనీ బ్రాహ్మణ వాద ప్రతీకల పైన దాడి చేస్తాడు 'గోదావరి' కవితలో. అయితే ఇదే శీర్షికతో నగేష్ బాబు రాసిన దీర్ఘ కవితలో మనువాద తాత్వికతను బోనులో నిలబెడితే సోనీ కవిత మనువాదానికి తోడైన పెట్టుబడిదారీ తనాన్ని, దాని దోపిడీ స్వభావాన్ని సరికొత్తగా చిత్రిస్తుంది.

**'నెత్తురు రుచి మరిగినదానా**
**మా శవాలతో హారతులు తీసుకుంటున్నదానా**
**నిన్ను నిలువునా దోచేస్తున్న వాళ్ళని**
**నువ్వు ఎప్పుడు బలితీసుకుంటావే గోదావరి'**

అలాగే బిడ్డల పెంపకం కోసం ఆరుగాలం ఎండలో, వానలో మరమనిషిలా పనిచేస్తూ తనకేమీ మిగిల్చుకోని దళిత శ్రామిక తల్లిని సోనీ 'కట్టెల మోపు'తో పోల్చడం ఈ సంపుటిలో చూస్తాం.

**'వారంలో ఒక్కసారి అయినా సరిగ్గా**
**బువ్వతిందో లేదో కానీ...**
**పనికి వంగిందంటే**
**యంత్రమైనా వంగి దండం పెట్టాల్సిందే అమ్మకు'**

అని దళిత తల్లికి యంత్రాలు సైతం సలాము చేస్తాయంటాడు.

ఎవరు పిడికిలి బిగించినా సంకెళ్ళు తెంచడానికే, ఎవరు స్వరం పెంచినా సరికొత్త శకాన్ని నిర్మించడానికేనన్న ఎరుక ఉన్న కవి సోనీకి తనకేం కావాలో తెల్సు. అందుకే తన కవిత్వంలో సంకెళ్ళు లేని సరికొత్త కాలాన్ని కలగంటాడు

**'నెత్తుటి మడుగులు లేని**
**గుడిసెలు తగలబెట్టని**
**పిడికెడు బువ్వకోసం దిక్కులు చూడని**
**బతుకు కావాలి**
**అన్నలపై, తమ్ములపై**
**కుల పైశాచికత్వ కోరలు చాచని**
**సంవత్సరం కావాలి'** అంటాడు

కవితైనా, వ్యాసమైనా ఒక గొప్ప 'ఈజ్' తో రాస్తాడు సోనీ. అదే సోనీ రాతల్లోని ప్రత్యేకత. రాసే అంశంతో పాటు భాషలోనూ, భావ వ్యక్తీకరణలోనూ తనదైన దూకుడుతో రాస్తున్న సోనీ కవిత తనలాగే ఉత్సాహంగా, ఫ్రెష్ గా ఉంటుంది. సోనీ 'అర్ధరాత్రి', 'అమ్మ' 'జోరువాన' వంటి కవితల్లో కథనాత్మకత ఉండి అవి చదివేవాళ్ళని ఆకట్టుకోవడమే కాక దళిత వాడని స్వయంగా చూసిన అనుభూతిని కలిగిస్తాయి. ఓ పక్క తన ఈడు కుర్రోళ్ళు రంగు రంగుల కలలు కంటుంటే ఈ అబ్బాయి సమాజపు ద్వంద్వ విలువల్ని, తాయిలాల్ని ఎగిరి తంతానంటాడు చూడండి!

**'నెర్రెలిచ్చిన బతుకు గోడల్ని**
**ఎవడు పగలగొడతాడో**
**ప్రభుత్వ ఎక్స్ గ్రేషియాలను**
**ఎడం కాలితో తన్ని**
**కాండ్రించి ఉమ్మేస్తారో'**

వారే ఈ కాలం వీరులు.. వారే బాబాసాహెబ్ అంబేద్కర్ కలలను సాకారం చేస్తారు. వారి గొంతు నలుపు. వారిలో ప్రథముడు తంగిరాల సోనీ. సోనీ 'బ్లాక్ వాయిస్' బహుజన ఉద్యమ సాహిత్యంలో ఓ సరికొత్త ఉత్సాహాన్నీ, ఉరకలెత్తే యువ నెత్తురుని నింపి దాన్ని బలోపేతం చేస్తుంది.

– ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి

నివాళి

**జ**నవరి 25వ తేదీన కన్నుమూసిన ప్రఖ్యాత హిందీ రచయిత్రి కృష్ణా సోబతీ... ఆధునిక హిందీ నవలాకారుల్లో మొదటి తరానికి చెందినవారు. జ్ఞానపీఠం అధిరోహించిన హిందీ సాహిత్యకారుల్లో 11వ వారు. ఆమె 1925, ఫిబ్రవరి 18న ప్రస్తుత పాకిస్తాన్‌లో లాహోర్‌కు 40 కి.మీ. దూరంలో ఉన్న గుజరాత్ నగరంలో జన్మించారు. ఢిల్లీ, సిమ్లాలలో విద్యాభ్యాసం చేశారు. ఆమె కుటుంబ సభ్యులు బ్రిటిష్ ప్రభుత్వంలో కీలక పదవులు నిర్వహించారు. సోబతీ ఉన్నత విద్య లాహోర్‌లోని ఫతేచంద్ కళాశాలలో ప్రారంభమైంది. దేశవిభజన తర్వాత ఆమె భారతదేశానికి వచ్చి స్థిరపడ్డారు. సోబతీ భర్త డోగ్రీ రచయిత అయిన శివనాథ్. జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న హిందీ సాహితీమూర్తుల్లో సోబతీ రెండో మహిళ. 1982లో మహాదేవీ వర్మ జ్ఞానపీఠ గౌరవం అందుకున్నారు. కవిత్వం జోలికి పోకుండా కథ–నవలా రచనతోనే జ్ఞానపీఠం అధిరోహించిన మొట్టమొదటి హిందీ రచయిత్రి కృష్ణా సోబతీ. 94 ఏళ్ల వయసులో కన్నుమూసిన ఆమెది ఏడు దశాబ్దాల సుదీర్ఘ సాహిత్య ప్రస్థానం.



# ఆమె సృజనశీలి.. ధైర్యశాలి

కృష్ణా సోబతీ... హిందీ కథ, నవలా రంగంలో ఒక కొత్త ఒరవడిని సృష్టించి, నవ్య రచనా శైలితో ప్రయోగాత్మక కథలు– నవలలు రాశారు. కథా రచనతో తన సాహిత్య ప్రయాణం ప్రారంభించారు. టిబెటన్ బౌద్ధమత ప్రచారకుని గురించి ఆమె రాసిన మొట్టమొదటి కథ 'లామా' 1944లో ప్రచురితమైంది. దేశ విభజనవల్ల ఏర్పడిన విషాదకర పరిస్థితులకు దర్పణంగా రాసిన కథ 'సిక్కా బదల్ గయా' (నాణెం మారిపోయింది) ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. 'డార్ సే బిఛుడీ' (కొమ్మను విడిచిన), 'యారోం కే యార్' (మిత్రులకు మిత్రులు), 'తీన్ పహాడ్' (మూడు కొండలు), 'మిత్రో మర్జాని', 'సూరజ్ ముఖీ అంధేరే కే' (అంధకారపు పొద్దుతిరుగుడు పూలు), 'జిందగీనామా' (జీవితగ్రంథం), 'దిలో– దానిశ్' (హ దయమెరిగిన), 'సమయ్ సరగమ్' (కాలపు సంగీతం), 'ఏయ్ లడకీ' (ఓ అమ్మాయీ!) 'గుజరాత్ పాకిస్థాన్ సే గుజరాత్ హిందుస్థాన్' (పాకిస్థాన్ గుజరాత్ నుంచి భారత్ గుజరాత్‌కు) మొదలైన నవలలు రచించారు. 'నసీఫా' (స్వచ్ఛమైన), 'సిక్కా బదల్ గయా' (నాణెం మారిపోయింది), 'బాదలోం కే ఘేరే' (మేఘాల ఆవహింపు), 'మేరీ మా కహా' (మా అమ్మెక్కడ) మొదలైన కథాసంపుటాలు వెలువరించారు. ఆమె రచనలపైన హిందీ, ఉర్దూ, పంజాబీ సంస్కృతుల ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. అయితే, ఆమె ఒక ప్రాంతానికి మాత్రమే చెందిన రచయిత్రి కాదు. ఆమె రచనలు భాష, ప్రాంతీయతల్ని అధిగమించి అద్భుతమైన రచనా ప్రక్రియకు మారుపేరుగా నిలిచాయి. ప్రతి రచనద్వారా ఆమె తన భావాత్మక శక్తి, కళాత్మక ఉత్తేజంతో పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేయటంతోపాటు అనేక సామాజిక– నైతిక అంశాల్ని, విమర్శనాత్మక దృక్పథాన్ని సాహితీ ప్రపంచం ముందుంచారు.

కృష్ణా సోబతీ నవలల్లో ప్రసిద్ధమైనది 'జిందగీనామా'. ఈ నవలకు 1980లో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. మానవ సమాజాన్ని కులమతాలుగా విభజించటాన్ని ఈ నవల్లో రచయిత్రి వ్యతిరేకించారు. ఈ నవల్లోని వందలాది పాత్రలు ఎంతో కాలంగా పంజాబ్‌లో ఉంటూ తమపై తరచూ విరుచుకుపడే సైన్యాల్ని ఎదిరించి పోరాడి, పంటలు పండించుకుంటూ బతుకుతున్నవాళ్ళు, బతకాలనే తాపత్రయంతో బతుకులు చేజార్చుకుంటున్నవారే! భూముల్ని కబళించేందుకు వేసే ఎత్తుగడలు– చేసే ప్రయత్నాలు, శ్రమ దోపిడీ, మనుషులు– మనుషుల మధ్య విభేదాలు సృష్టించటం ఈ నవల్లో విశాలమైన కాన్వాసుపై దర్శనమిస్తాయి. స్త్రీ పాత్రలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడిన నవల ఇది. దేశవిభజన నాటి పరిస్థితులకు దర్పణంగా, సామాజిక చరిత్రగానేకాక ఈ నవలను రచయిత్రి స్వీయచరిత్రగా భావించవచ్చు. 'మిత్రో మర్జానీ' సోబతీ మరో ప్రముఖ నవల. స్త్రీకి కూడా శారీరకమైన కోరికలు ఉంటాయని, వాటిని భర్తద్వారా తీర్చుకోవాలనుకోవటం సిగ్గుపడాల్సిన విషయమేమీ కాదని స్పష్టం చేస్తుంది ఈ నవలలో. 'ఏయ్ లడకీ' (ఓ అమ్మాయీ!) అనే నవల్లో తల్లీ కూతుళ్ళ అభిప్రాయాల వైరుధ్యాలు పెరిగి పెరిగి చివరకు తల్లి మరణంతోనే ఇరువురికీ స్వేచ్ఛ, శాంతి లభిస్తాయి. 'సూరజ్ ముఖీ అంధేరే కే' (అంధకారపు పొద్దుతిరుగుడు పూలు) నవల్లో రచయిత్రి మనిషి మానసిక కుంగుబాటుని, ఎంతో ప్రయాసతో దానిని తాత్కాలికంగా ఉపశమింపజేసుకోవటాన్ని అద్భుతంగా చిత్రించారు. ఆమె తుది నవల 'గుజరాత్ పాకిస్థాన్ సే గుజరాత్ హిందుస్థాన్'కు కూడా దేశవిభజన సృష్టించిన అల్లకల్లోలమే కేంద్ర బిందువు. నవల ప్రారంభంలో, విభజన సమయంలో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని కట్టుబట్టలతో పారిపోతున్న దృశ్యాన్ని వర్ణించే ఫంక్తులు పరిస్థితి తీవ్రతకు నిదర్శనం! 'పరుగెత్తండి– పరుగెత్తండి, పారిపోండి... పారిపోండి, ముసలివాళ్ళని, జబ్బుతో ఉన్నవాళ్ళని, పరుగెత్తలేనివాళ్ళని వదిలెయ్యండి. వాళ్ళు బతికే ఆశ ఎలాగో లేదు. ఆలోచించే వ్యవధి లేదు, ముందుకు పోవటమే తప్ప వెనక్కి తిరిగి చూసే సమయం కాదిది. పదండి త్వరగా, ఏ క్షణాన దాడి జరుగుతుందో చెప్పలేం....' ఈ నవల శైలి చాలా విశిష్టంగా ఉంటుంది. మధ్య మధ్యలో కవితాత్మక శైలి తారసపడుతుంది.

ఆమె రచనల్లోని స్త్రీ పాత్రలు చైతన్యానికి చిరునామాలు, ధైర్యానికి దిక్సూచీలు, ఆత్మగౌరవానికి ఆనవాళ్ళు. ఆ పాత్రలు కష్టనష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటాయి. తమకు జరిగే అన్యాయాలకు తలవంచకుండా ప్రశ్నిస్తాయి. సుదీర్ఘ కాలం అలుపెరుగని సాహిత్య సేద్యం కొనసాగించిన కృష్ణా సోబతి తన ఉత్కృష్ట రచనలకు గాను ఎన్నో గౌరవాల్ని, ఎన్నెన్నో పురస్కారాల్ని అందుకున్నారు. సాహిత్య అకాడెమి పురస్కారం (1980), సాహిత్య శిరోమణి పురస్కారం (1981), హిందీ అకాడెమీ పురస్కారం (1982), కథా చూడామణి పురస్కారం (1999), సాహిత్య అకాడెమి ఫెలోషిప్ (1996), శలాకా సమ్మాన్ (2000 – 2001), వ్యాస సమ్మాన్ (2008) మొదలైనవి ఆమె సాహిత్య ప్రతిభకు దక్కిన గౌరవాలు. 2010లో భారత ప్రభుత్వం ఇవ్వజూపిన 'పద్మభూషణ్' బిరుదును ఆమె తిరస్కరించారు. 'ప్రభుత్వం ఇచ్చే అవార్డులు రచయిత భావాలపై ప్రభావాన్ని చూపుతాయి. నేను ఇలాంటివాటికి దూరంగా ఉండటం మంచిదనుకుంటున్నాను' అని పేర్కొన్నారు. దాద్రిలో జరిగిన దాడిపై ప్రభుత్వ వైఖరికి స్పందనగా, రచయితల వాక్స్వాతంత్ర్యానికి సమర్థనగా, హిందీ రచయితలను కించపరుస్తూ ఒక కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆమె తాను గతంలో స్వీకరించిన సాహిత్య అకాడెమి అవార్డును, సాహిత్య అకాడెమీ ఫెలోషిప్‌ను 2015లో తిరిగి ఇచ్చేశారు. ఆమె అసాధారణ రచయిత్రి. గుండెధైర్యం, సామాజిక చైతన్యం మెండుగా ప్రకాశించిన సృజనశీలి.

– డాక్టర్ వెన్నా వల్లభరావు
94903 37978

# ఎదిరించి.. పోరాడి.. గెలిచి!



ఉత్తరాఖండ్ తహసీల్‌లోని ఓ చిన్నగ్రామం ఖాతీ. రెండేళ్లక్రితం అంటే 2017లో అక్కడ ఓ వంతెన నిర్మాణం జరుగుతుంది. చాలామంది కార్మికులు ఈ పనిలో ఉన్నారు. నేపాల్ నుంచి కూడా కొంతమంది కార్మికులు వచ్చారు. వారిలోని ఓ కుటుంబంలో పదేళ్ల బాలిక ఉంది. తల్లిదండ్రులతో కలసి రోజూ ఆ పనిచేసే చోటికి వచ్చేది. తల్లిదండ్రులు రోజంతా అక్కడ పనిచేస్తుండేవారు. ఆ పాప మాత్రం అటూ ఇటూ తిరుగుతూ ఆడుకుంటూ ఉండేది. విజయ్ బహదూర్ అనే వ్యక్తి నేపాల్‌నుంచి అక్కడ పనిచేయడానికి వచ్చాడు. అతని కన్ను ఆ బాలికపై పడింది. ఓ రోజు బహదూర్ ఆ బాలికపై అత్యాచారం చేశాడు. ఇదంతా 2017 ఏప్రిల్‌లో జరిగింది. ఈ కేసులో 2018లో ఆ బాలికకు కొంత న్యాయం జరిగింది. అది కూడా అంత సులువుగా జరిగిపోలేదు. మొదట్లో ఈ కేసును అణచివేసేందుకు చాలా కుట్రలే జరిగాయి. అలాంటి సమయంలో ఇందిరా దానూ చూపు ఈ కేసుపై పడింది. ఆమె నిర్భయ సెల్‌లోని ఓ న్యాయవాది.

ఇందిరాకు 32 ఏళ్లు. నేపాల్‌కు చెందిన ఈ బాలికకు న్యాయం జరిగేందుకు ఇందిరా చాలా కష్టపడింది. తన కుటుంబాన్ని సైతం లెక్కచేయకుండా ఎదిరించి పోరాడి, ఆ బాలికకు న్యాయం జరిగేలా చేసింది. ఇందిరా తండ్రి అక్కడ జరుగుతున్న వంతెన నిర్మాణం కాంట్రాక్టర్. దాంతో ఆమెకు కుటుంబ సభ్యులు సహకరించలేదు. 'అత్యాచారం జరిగిన తర్వాత బాలిక ఆరోగ్యం మరింత విషమించింది. బాలిక తల్లిదండ్రులు బాగేశ్వర్ హాస్పటల్‌కు తీసుకెళ్లారు. అత్యాచారం వంటి భయంకరమైన ఘటన జరిగిన తర్వాత కూడా హాస్పటల్ వారు బాలికకు నొప్పి నివారణ మందులు ఇచ్చి పంపించేశారు. ఎవరూ ఈ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. పోలీసులు కూడా ఈ కేసును పట్టించుకోలేదు. ఖాతీ చాలా చిన్న గ్రామం కావడంతో ఆ ప్రాంతంలో ఫోన్ సౌకర్యమూలేదు. ఘటన జరిగి ఓ నెల అయిపోయింది. ఎలాంటి న్యాయం జరగలేదు. ఆ నోట ఈ నోట పడి కేసు నా వరకూ వచ్చింది' అంటూ చెప్పుకొచ్చారు ఇందిరా. ఆ బాలిక తల్లిదండ్రులను బాగేశ్వర్‌లోని తన ఆఫీస్‌కు రప్పించుకుంది ఇందిరా. ఆ బాలికతో మాట్లాడి, అన్ని విషయాలను తెలుసుకుంది.

**పోలీసులు దిగొచ్చారు!**

ఆ పాప మాటలు విన్న తర్వాత ఆమె చలించిపోయింది. వెంటనే పోలీసుల దగ్గరికి వెళ్లింది. కప్కోట్ థానేలో కేసుపై ఫిర్యాదు చేసింది. అయితే, 'బాధితులు, నిందితులు ఇద్దరూ నేపాల్‌కి చెందినవారు. ఇది వేరే దేశానికి సంబంధించింది. ఇక్కడ ఏం చేయలేం' అన్నట్లు మాట్లాడారు అక్కడి పోలీసులు. ఇది నేపాల్ కేసని చెప్పి ఫైల్ చేయకుండా వదిలేశారు. రెండు రోజులు బాధితులను పోలీస్‌స్టేషన్ బయటే కూర్చోబెట్టారు. ఎఫ్ఐఆర్ రాయలేదు. 'సమాధానం చెప్పండి. నేను ఫైల్ తీసుకుని ఎంత దూరమైనా వెళతాను' అన్న ఆమె మాటలకు పోలీసులు దిగొచ్చారు. అప్పటికప్పుడు ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు. మెడికల్ టెస్టులు చేయించారు. 'భారతీయ శిక్షా స్మృతి ప్రకారం బాధితులు, నిందితులు ఏ దేశం వారైనా ఎలాంటి తేడా ఉండదు. ఎఫ్ఐఆర్ ఫైల్ చేయొచ్చు. పోలీస్ చెప్పింది నిజం కాదు' అంటున్నారు ఇందిరా.

**ఆత్మస్థయిర్యాన్ని నింపింది!**

అప్పటికే బాధిత కుటుంబం చాలా భయపడింది. ఇందిరాను కేసు రిటర్న్ తీసుకోమని కోరారు. అలాంటి సమయంలో ఇందిరా వాళ్లకు నచ్చజెప్పింది. వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపింది. ఎవరూ మనల్ని ఏం చేయలేరు. న్యాయం కోసం ఎంతవరకైనా నేను పోరాడతానని చెప్పింది. ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత నిందితుడు పరారయ్యాడు. తర్వాత పోలీసులు అతన్ని పట్టుకుని, జైల్లో వేశారు. ఇందిరా లక్ష్యం అతనికి శిక్షపడేలా చేయడం. ఎన్ని కష్టాలొచ్చిన ఆమె మాత్రం వెనకడుగు వేయలేదు. మే 2018లో జిల్లాకోర్టు నిందితునికి పన్నెండేళ్ల జైలు శిక్ష, బాధిత బాలికకు రూ.ఐదు లక్షలు పరిహారం ఇవ్వాలని తీర్పునిచ్చింది. అయితే, అప్పటికే ఆ బాధిత బాలిక కుటుంబం నేపాల్‌కి వెళ్లిపోయింది. వారిని సంప్రదించడానికి ఎటువంటి కమ్యూనికేషన్ లేదు. ఏ నెంబర్‌కు చేసినా స్విచ్ఆఫ్ వచ్చేదని ఇందిరా అంటున్నారు. 'వాళ్లు భయపడి నేపాల్ వెళ్లిపోయినట్లున్నారు. వారి నెంబర్లన్నీ స్విచ్ఆఫ్ వస్తున్నాయి. నేను థానేలో దరఖాస్తు పెట్టాను. బాధిత బాలిక కుటుంబానికి వచ్చిన పరిహారాన్ని వాళ్లు ఎక్కడున్నారో తెలుసుకుని, వారికి చేరేలా నేపాల్ పోలీసులతో మాట్లాడాను' అంటున్నారామె. ఈ పోరాటంలో ఆ బాధిత బాలికకు కొంతైనా న్యాయం జరిగిందంటే అది కేవలం ఇందిరా వల్లే. ఇందిరా తన కుటుంబానికి వ్యతిరేకంగా వెళ్లి ఆ బాలికకోసం పోరాడింది. ఆ పరిహారాన్ని వారికి అందించడానికి కూడా ప్రయత్నిస్తుంది. ఇందిరా ధైర్యం, ఆత్మవిశ్వాసంతోనే ఇంతటి విజయాన్ని అందుకుంది. అందరూ తనలా ఆలోచిస్తే ఎంతోమంది బాధిత మహిళలకు న్యాయం జరుగుతుంది.



# మనసు దోచే మైసూర్ సిల్క్ చీరలు



సిల్క్ చీరలంటే అందరికీ ఇష్టమే. ఇంట్లో ఎన్ని చీరలున్నా.. సిల్క్‌చీర కనిపిస్తే.. మనసు అటు లాగుతుంది. వీటికున్న ప్రత్యేకత అలాంటిది. ఆ ప్రత్యేకతకు తగ్గట్టే.. ఇప్పుడు కొత్త కొత్త డిజైన్లతో సిల్క్ శారీలు మార్కెట్లోకొస్తున్నాయి. అందులో మైసూర్ ఆర్ట్ సిల్క్ శారీస్ ఇప్పుడు లేటెస్ట్ ట్రెండ్. ఆకర్షణీయమైన డిజైన్లతో, రంగుల్లో చూడగానే అందర్నీ ఇట్టే ఆకర్షించే ఈ చీరలు.. అందంతోపాటు.. నిండుగానూ ఉంటాయి.

## మీకోసం

**దానిమ్మ రసంలో స్పూను బాదం నూనె కలుపుకుని ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుంటే ముఖంపై ముడతలు తగ్గుతాయి.**



## జీవన సౌరభం

**జీవితం ఎంత క్లిష్టంగానైనా కనపడవచ్చు కాని, మనం చేయాల్సింది చెయ్యాలి. సాధించే అవకాశం దానిలోనే ఉంటుంది.**


# బైకులకు సరికొత్త హంగులు

బైక్‌పై ఏదైనా పెద్ద సిటీలో ఓ కొత్త అడ్రస్‌కు వెళ్లాలి. అలాంటప్పుడు మన ఫోన్‌లో జీపీఎస్ ఆన్ చేసుకున్నాం. కానీ ప్రతి వీధి మలుపు వద్దా బైక్ ఆపి ఫోన్ తీసి చూసుకోవాలంటే కష్టం కదా. అలాంటప్పుడు మన బైక్ హ్యాండిల్‌కే ఫోన్‌ను అమర్చుకుని, చూస్తూ వెళ్లగలిగేందుకు తోడ్పడేలా హ్యాండిల్ బార్ మౌంట్‌లు ఇప్పుడు మార్కెట్‌లో లభిస్తున్నాయి. ఫోన్లు మాత్రమే కాకుండా స్పీడో మీటర్లు, జీపీఎస్ డివైజ్‌లు, ఇతర పరికరాలను అమర్చుకునేలా అందుబాటులోకి వచ్చాయి. వీటిలో కేవలం టైట్ గ్రిప్ ద్వారా పట్టుకునేవే గాకుండా గట్టిగా అతుక్కునేలా మ్యాగ్నెట్ (అయస్కాంతం) ఉండే తరహావి కూడా అందుబాటులో ఉన్నాయి. మోడల్, నాణ్యత, సదుపాయాలకు అనుగుణంగా వీటి ధర ఉంటుంది. అలాగే, ఎక్కడికైనా బయటికి వెళ్లేటప్పుడు సెల్ ఫోన్‌లో బ్యాటరీ డౌన్ అయితే వెంటనే చార్జింగ్ పెట్టుకునేందుకు బైక్ మొబైల్ చార్జర్లు అందుబాటులోకి వచ్చాయి. మొదట్లో కార్లలో మాత్రమే ఉన్న సదుపాయం ఇప్పుడు బైక్‌లకు వచ్చేసింది. బైక్ హ్యాండిల్‌కు బిగించి, బైక్ బ్యాటరీకి అనుసంధానం చేసి వీటిని వాడుకోవచ్చు.

**డిజైనర్ రేర్ వ్యూ మిర్రర్స్ :** అన్ని బైకులకు రేర్ వ్యూ మిర్రర్లు ఉంటాయి. వెనుక నుంచి వచ్చే వాహనాలను గమనించేందుకు తోడ్పడే ఈ మిర్రర్లలో విభిన్నమైన, ఆకర్షణీయమైన డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో మీ బైక్‌కు తగిన విధంగా సరిపోయే వాటిని ఎన్నుకుని అమర్చుకోవచ్చు. వీటి వల్ల బైకు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. వీటితోపాటు హ్యాండిల్ గ్రిప్ రేర్ వ్యూ మిర్రర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా బైకుల్లో రేర్ వ్యూ మిర్రర్లు హ్యాండిల్ బార్ మధ్య భాగంలో అమర్చి.. హ్యాండిల్ బార్ గ్రిప్‌పై వరకు ఉంటాయి. దీనివల్ల ట్రాఫిక్‌లో బైక్ నడిపేటప్పుడు రేర్ వ్యూ మిర్రర్లు ఎవరికైనా తగులుతాయేమో అన్నట్లుగా అనిపిస్తుంటుంది. ఈ ఇబ్బందిని తొలగించడంతోపాటు కాస్త విభిన్నంగా ఉండేలా హ్యాండిల్ బార్ గ్రిప్ వద్ద అమర్చేలా రేర్ వ్యూ మిర్రర్లు లభిస్తున్నాయి. కావాలనుకుంటే రెండు వైపులా లేకుంటే ఒక వైపు ఈ మిర్రర్‌ను అమర్చుకోవచ్చు. ★



# ఈ పప్పులతో.. ఆరోగ్యానికి మేలెంతో..!



శనగలు, మినుములు, రాజ్మా, కందులు, పెసర్ల వంటివి తరచుగా తింటూనే ఉంటాం. ఇలాంటి పప్పుల్లో, చిక్కుడుజాతి గింజల్లో పీచు, ప్రోటీన్లు దండిగా ఉంటాయి. అందువల్ల ఇవి త్వరగా కడుపునిండిన భావన కలిగిస్తాయి. వెంటనే ఆకలి కాకుండా చూస్తాయి. నెమ్మదిగా జీర్ణమవుతూ రక్తంలోకి చక్కెర వెంటనే విడుదల కాకుండా చేస్తాయి. అంతేకాదు శరీరానికి బలాన్ని ఇవ్వటంతో పాటు జబ్బులను నివారించుకునే శక్తినీ అందిస్తాయి.

- కాబూలీ శనగల్లో ఉండే పీచు రక్తంలో చక్కెర మోతాదులు స్థిరంగా ఉండేందుకు తోడ్పడుతుంది. అందువల్ల కాబూలీ శనగలను తరచుగా తీసుకుంటే మధుమేహం ముప్పు తగ్గటానికి తోడ్పడతాయి. ఇవి చెడ్డ కొలెస్ట్రాల్‌ను (ఎల్‌డీఎల్), ట్రైగ్లిజరైడ్లను తగ్గిస్తాయి. ఫలితంగా గుండెజబ్బులూ దూరంగా ఉంటాయి. అయితే వీటిని తక్కువ మోతాదులోనే తీసుకోవాలి. అప్పుడే ఎక్కువ లాభాలు.
- పప్పులైన కందులు, పెసర్ల వంటివి క్యాన్సర్ల బారినపడకుండా కాపాడతాయి. తరచుగా పప్పులు తినే మహిళలకు రొమ్ము క్యాన్సర్ ముప్పు తక్కువగా ఉంటున్నట్టు అధ్యయనకారులు చెబుతారు. అంతేకాక ప్రోస్టేట్, మలద్వార క్యాన్సర్ల బారినపడకుండా కాపాడుతున్నట్లూ వెల్లడైంది. వీటికి రక్తంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించే గుణమూ ఉంది.
- రాజ్మాలో విషయ గ్రహణ శక్తిని పెంపొందించే ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు రాజ్మాలో అధికంగా ఉంటాయి. అలాగే క్యాన్సర్‌ను నివారించే యాంటీఆక్సిడెంట్లూ, అల్జీమర్స్ బారినపడకుండా చూసే థైమీన్ కూడా దండిగానే ఉంటాయి.
- ఆరోగ్యానికి మేలు చేసే ఇనుము, క్యాల్షియం, మాలిబ్డినమ్ వంటివి ఉలవల్లో దండిగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్ గుణాలుగల ఫాలీఫెనాల్స్ కూడా ఎక్కువే. ఇవి క్యాన్సర్ల నివారణకు ఉపయోగపడతాయి. యాంటీబోడీలు, స్వీయరోగనిరోధక చర్యల్లో కనిపించే హీమగ్లుటినిన్ కూడా వీటిలో కనిపిస్తుంది. ఉలవలు కొలెస్ట్రాల్, కడుపు ఉబ్బరం తగ్గటానికీ తోడ్పడతాయి.
- సోయాబీన్స్‌లో మొత్తం తొమ్మిది అమైనో ఆమ్లాలూ ఉంటాయి. ఇవి కండరాల నిర్మాణానికి బాగా తోడ్పడతాయి. ప్రస్తుతం వీటితో తయారుచేసిన పాలు, టోఫూ వంటివీ అందుబాటులో ఉంటున్నాయి. అయితే సోయాబీన్స్ ఉత్పత్తులను పరిమితంగానే తినాలి.

★

# ACTIVE AND PASSIVE VOICE

## పదో తరగతి, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం



పి. అనంత్ ఎం.ఎ, బీఈడి
ఇంగ్లీష్ ఉపాధ్యాయులు, తెనాలి.
సెల్ : 9297359222

### ACTIVE AND PASSIVE VOICE

English Grammarలో verb యొక్క రూపాన్ని Voice అంటారు.

దీని ప్రకారం రెండు రూపాల verbs ఉన్నాయి.

అవి 1. Active form of verb మరియు

2. Passive form of verb.

వాటిని Active voice మరియు Passive voice అంటారు.

కేవలం Transitive Verbs (A Verb that has an object) ఉన్న Sentences ను మాత్రమే Passive Voice లోకి Transform చేయగలం.

ఒక Sentence ను Active Voice మరియు Passive Voice లో రాసినప్పుడు వాటి Structure లో మాత్రమే మార్పు ఉంటుంది కాని అర్థంలో ఎటువంటి మార్పు ఉండదు.

### ACTIVE VOICE:

Active Form of Verb ను English Grammar లో ఉన్న 12 Tenses లోను ఉపయోగిస్తారు.

Active Voiceలో ఉన్న Sentence నందు Subject Active గా ఉండి ఆ sentence నందలి పనిని చేస్తుంది.

దీనిని Sentence లో Subject యొక్క ప్రాముఖ్యతను తెలియజేయుటకు వాడెదరు

E.g. The fan **is rotating.**

Chandu **has already read** that book.

Abhi **finished** his work yesterday.

Lavanya **sings** songs so sweetly.

| Active Voice (Subjective case) | | Passive Voice (Objective case) |
|---|---|---|
| I | ⟶ | by me |
| We | ⟶ | by us |
| You | ⟶ | by you |
| He | ⟶ | by him |
| She | ⟶ | by her |
| It | ⟶ | by it |
| They | ⟶ | by them. |

### PASSIVE VOICE

Passive Form of Verb ను English Grammar లో ఉన్న 8 Tenses లో మాత్రమే ఉపయోగిస్తారు.

Passive Voiceలో ఉన్న Sentence లో Subject Passive గా ఉండి ఆ sentence నందలి పనిని Object చేస్తుంది.

దీనిని Sentence లో Verb యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడానికి వాడతారు. ఆ పనిని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వరు.

దీనిని ఈ కింద తెలిపిన 4 Tenses లో వాడరు. అవి

**1. Future continuous**

**2. Present perfect continuous**

**3. Past perfect continuous tense**


**4. Future perfect Continuous tense.**

**E.g.** The fan **is repaired** by my friend.

The work **was finished** by Abhi yesterday.

Songs **are sung** by Lavanya so sweetly.

The book **has already been read** by Chandu.




### RULES TO TRANSFORM FROM ACTIVE TO PASSIVE:

1. మొదట ఇచ్చిన Sentenceలో **Subject, Verb** మరియు **Object** లను గుర్తించాలి.

2. Active Voice Sentence యొక్క **Object** ను Passive Voice Sentence యొక్క **Subject** గా రాయాలి.

3. Active Voice Sentence యొక్క **Subject** ను Passive Voice Sentence యొక్క **Object** గా Preposition by ని ఉంచి రాయాలి.

4. Active Form of Verb ను Passive form of Verb గా మార్చాలి. Active Form of Verb ను బట్టి Passive From of Verb లో తగిన BE Formను చేర్చి Verb యొక్క మూడవ రూపమును(V3) వాడవలెను.

5. **Is/am/are** ను Present Verb **(V1)** వచ్చినప్పుడు

**was/were** ను Past Verb **(V2)** వచ్చినప్పుడు

**been** ను Past Participle **(V3)** వచ్చినప్పుడు

**being** ను Present Participle **(V1+ing)** వచ్చినప్పుడు

be ని Modal Verb వచ్చినప్పుడు BE FORMS గా వాడవలెను.

6. ఇవ్వబడిన Sentence లో రెండు Objects లు ఉన్నట్లయితే ఒక Object ను Verbకు మరియు by కి మధ్యన ఉంచాలి.

7. ఇవ్వబడిన Sentence లో రెండు Complement ఉన్నట్లయితే, దానిని Sentence చివర రాయాలి.

#### Examples

1. The villagers **saved** many passengers.

A: Many passengers were saved by the villagers.

2. Mr. Basha **teaches** US English.

A: We are taught English by Mr. Basha.

3. S.P.Balu **is singing** a nice song.

A: A nice song is being sung by S.P.Balu.

4. Roberage **established** Chitrabani.

A: Chitrabani was established by Roberage.

5. The officer **has checked** all the records.

A: All the records have been checked by the officer.

6. They are **helping** the poor.

A: The poor are being helped by them.

7. He **broke** the glass.

A: The glass was broken by him.

8. Abhi **wrote** a letter to Chandana.

A: A letter was written to Chandana by Abhi.

#### Formula of Active Voice Passive Voice

| Tense | Active Voice | Passive Voice |
|---|---|---|
| Simple Present Tense | Sub + $V^1$ + Obj | Obj + am/is/are + $V^3$ + by + Obj.Pronoun |
| Simple Past Tense | Sub + $V^2$ + Obj | Obj + was/were + $V^3$ + by + Obj.Pronoun |
| Simple Future Tense | Sub + shall/will + $V^1$ + Obj | Obj + shall/will + be + $V^3$ + by + Obj.Pronoun |
| Present Continous Tense | Sub + am/is/are + $V^1$ + ing + Obj | Obj + am/is/are + being + $V^3$ + by + Obj.Pronoun |
| Past Continous Tense | Sub + was/were + $V^1$ + ing + Obj | Obj + was/were + being + $V^3$ + by + Obj.Pronoun |
| Future Continous Tense | Sub + shall/will + be + $V^1$ + ing + Obj | Obj + shall/will + being + $V^3$ + by + Obj.Pronoun |
| Present Perfect Tense | Sub + have/has + $V^3$ + Obj | Obj + have/has + been + $V^3$ + by + Obj.Pronoun |
| Past Perfect Tense | Sub + had + $V^3$ + Obj | Obj + had + been + $V^3$ + by + Obj.Pronoun |
| Future Perfect Tense | Sub + shall/will + have + $V^3$ + Obj | Obj + shall/will + have + been + $V^3$ + by + Obj.Pronoun |

### IMPERATIVE SENTENCE:

1. Imperative Sentence Model లో Verb మరియు Object ఉన్నట్లయితే, Passive Sentence ను Let తో ప్రారంభించాలి.

2. Active Voice Sentence యొక్క Object ను Passive Voice Sentence యొక్క Subject గా రాయాలి.

3. Active Form of Verb ను Passive form of Verb గా మార్చునప్పుడు be ని be form గా చేర్చి Verb యొక్క మూడో రూపాన్ని (V3) గా వాడవలెను.

**Close** the door

A: Let the door be closed.

**Clean** the room.

A: Let the room be cleaned.

1. Imperative Sentence Model లో Verb మరియు Complement ఉన్నట్లయితే, Passive Sentence ను బట్టి

**You are ordered…….**

**You are requested…………**

**You are advised……..**

**you are asked ……** తో ప్రారంభించాలి.

**Get out.**

A: you are ordered to get out.

**Read well.**

A: You are advised to read well.

**Please come fast.**

A: You are requested to come fast.

### INTERROGATIVE SENTENCE:

**Where did you put my pen?**

A: Where was my pen put by you?

**Has he invited you to dinner?**

A: Have you been invited to dinner by him?

**Who wrote this poem?**

A: By whom was this poem written?

### SOME OTHER MODELS:

**I know him.**

A: He is known to me.

**Water fills a tub.**

A: A tub is filled with water.

**Blood covered his face.**

A: His face was covered with blood.

**Apple tastes sweet.**

A: Apple is sweet when it is tasted.

**I recommended that you applied for this position.**

A: It was recommended that you applied for this position. ★

## గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

# వ్యవసాయం - సవాళ్లు



ఎస్.ఎం.సువర్ణకుమార్
డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 94411 69869

## ఇండియన్ ఎకానమి

**భా**రతదేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. అయినా వ్యవసాయానికి తగినంత ప్రధాన్యత దక్కడంలేదు. దేశంలో దాదాపు 60 శాతం మంది వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలపై జీవనాధారం సాగిస్తున్నారు. గత కొంత కాలంగా స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయరంగ వాటా తగ్గిపోతూ వస్తుంది. దేశ జీడీపీలో సేద్యరంగ వాటా తగ్గడం రైతుల ఆదాయాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది.

భారతదేశంలో హరిత విప్లవం యొక్క ప్రభావం వల్ల వరి, గోధుమ పంటల దిగుబడులు ఊహాతీతంగా పెరిగాయి. ఏడు దశాబ్దాల క్రితం 45 కోట్ల జనాభా గల భారతదేశం విదేశీ ఓడల్లో తరలివచ్చే తిండి గింజల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండేది. కాగా నేడు ఆహార ధాన్యాల స్వయం సమృద్ధి సాధించి ఎగుమతులు చేసే స్థితికి చేరుకుంది.

స్వాతంత్ర్యానంతరం దేశం యొక్క సాంవత్సరిక జనాభా వృద్ధి రేటు సగటున 2.1 శాతంగా నమోదుకాగా తలసరి వ్యవసాయ భూమి లభ్యత తగ్గిపోయింది. ఈ పరిస్థితి వ్యవసాయ రంగంపై జనాభా ఒత్తిడి పెరగడానికి కారణమయ్యింది. సేద్య రంగంపై ఆధారపడిన వారి శాతం 1951లో 90 శాతం ఉండగా అది 2011 నాటికి 48 శాతానికి పడిపోవడం గమనార్హం. సేద్యాదాయం ఏటికేడాది పడిపోవడం దేశాన్ని కుంగదీస్తుంది. 1991లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల వల్ల అన్ని రంగాల్లోనూ ఆదాయం పెరిగింది. కానీ వ్యవసాయ పరిస్థితిలో మార్పులేదు. దేశ వ్యవసాయ రంగంలో ఈ కింది లక్షణాలు గమనించవచ్చు.

1. దేశ వ్యవసాయరంగం ప్రధానంగా రుతుపవనాలపై ఆధారపడివుంది. రుతుపవనాలు సక్రమంగా, సరైన కాలంలో వస్తే ఉత్పత్తి మెరుగుగా ఉంటుంది. సేద్యపు వసతులు తగినంతగా అభివృద్ధి చెందక పోవడం వల్ల రుతుపవనాలపై ఆధారపడి వ్యవసాయం చేయాల్సి వస్తుంది.

2. దేశంలోని భౌతిక, ఆర్థిక, సాంఘిక అంశాల కారణంగా భూకమతాలు చిన్నవిగా ఉంటున్నాయి. చిన్న కమతాల్లో ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించడానికి అనువుగా ఉండటంలేదు. అధిక రసాయన ఎరువులు, పంట భద్రతా చర్యల కారణంగా పంటల ఉత్పాదకత కొద్దిమేర పెరిగినప్పటికీ అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే ఈ పెరుగుదల తక్కువగానే ఉంది.

3. భారతదేశ వ్యవసాయ రంగంలో ఆహార ధాన్యాల సాగు ప్రధానమైంది. వరి, గోధుమ వంటి ఆహార పంటలను మొత్తం సాగు భూమిలో 75 శాతం భూమిలో సాగు చేస్తుండగా కేవలం 25 శాతం భూమిలో వాణిజ్య పంటలు సాగు అవుతున్నాయి. అనగా మన దేశ వ్యవసాయరంగం వాణిజ్య రూపును సంతరించుకోలేదు. అమెరికా జనాభాలో కేవలం రెండు శాతం రైతులు వ్యవసాయాన్ని సువిశాల కమతాల్లో నిర్వహిస్తూ దేశీయ అవసరాలతో పాటు ఆహార కొరతనూ ఎదుర్కొంటోంది. అంతేకాకుండా వివిధ దేశాలకు ఎగుమతులు కూడా చేయగలుగుతున్నారు.

4. దేశవ్యాప్తంగా కేవలం 50 శాతం కన్నా తక్కువ భూమిలోనే ఒకటికన్నా ఎక్కువ పంటలు పండిస్తున్నారు. 30 శాతానికి పైగా సాగు భూమిలో తృణ ధాన్యాల వంటి సాంప్రదాయ పంటలే పండిస్తున్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందుబాటులోకి పూర్తిగా రాలేదనడానికి నిదర్శనమిది.

5. వ్యవసాయరంగంలో అనేక సమస్యలున్నప్పటికీ ప్రధానంగా దిగుబడి కొరవడటం, గిట్టుబాటు ధర రాకపోవడం వంటి కారణాల వల్ల అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

దేశంలో ఇప్పటికీ 65 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే నివశిస్తున్నారు. కాబట్టి అభివృద్ధి ఫలాలు అందరికీ అందుబాటులోకి రావాలంటే ప్రధానంగా వ్యవసాయాభివృద్ధిపై దృష్టి సారించాలి.

1. రైతులకు గిట్టుబాటు వ్యవసాయాన్ని అందించడమే ప్రాతిపదిక కావాలి. మరోవైపు వ్యవసాయ ఉత్పత్తుల ధరలు అదుపులో ఉంచే విధంగా చర్యలు చేపట్టాలి. ఉత్పాదక ఖర్చులను తగ్గించి దిగుబడులు పెంచే ఆధునిక వ్యవసాయం వైపు దృష్టి కేంద్రీకరించాలి. యాంత్రీకరణపై దృష్టి సారించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా అమలు పరిచే సేద్యపు ఖర్చులను గణనీయంగా తగ్గించడంతోపాటు దిగుబడిని మరింతగా పెంచవచ్చు. యాంత్రీకరణ ఖర్చుతో కూడుకున్న పని అయినప్పటికీ యంత్రాలపై పెట్టిన ఖర్చును తక్కువ కాలంలోనే తిరిగి పొందవచ్చు. యాంత్రీకరణ ప్రభావం వల్ల వ్యవసాయరంగంలో ఉపాధి దెబ్బతింటుందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే యంత్రాల ప్రవేశంతో నికరంగా ఉపాధి కొంత మేరకు తగ్గినా ఉత్పత్తులకు విలువ జోడింపు, వాటి సరఫరా మార్కెటింగ్ వంటి రంగాల్లో శ్రామికుల అవసరం పెరుగుతుంది. సేద్యపు భూమిని పంటకు అనుగుణంగా తయారీ, నాట్లు వేయడం, కలుపుతీయడం, సస్యరక్షణ, పంటకోత, నూర్పిడి, ధాన్యం ఆరబోత, నిల్వ వంటి ప్రక్రియలను యాంత్రీకరణ సహాయంతో సమర్థవంతంగా నిర్వహించవచ్చు. దేశంలో చిన్న కమతాలు ఎక్కువే కాబట్టి భారీ యంత్రాల స్థానే చిన్న, మధ్య స్థాయి యంత్రాలను అందుబాటులో ఉంచవచ్చు.

2. దేశ వ్యవసాయాభివృద్ధికి ఆహార శుద్ధి రంగంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలి. దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగా ప్రాసెస్డ్ ఉత్పత్తుల వినియోగం బాగా పెరుగుతుంది. దేశంలో ఉన్న వ్యవసాయ మండలిలో ఉష్ణ మండల పంటలు, సమశీతోష్ణ రకపు పంటలు ఒకే సమయంలో పండే అవకాశముంది. ప్రపంచవ్యాప్తంగా ఈ విధమైన భౌగోళిక అనుకూలత ఉన్న కొద్ది దేశాల్లో భారత్ ఒకటి. నేల స్వభావాన్ని బట్టి పంటలను సాగుచేయవచ్చు. దేశ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న పండ్లు, కూరగాయల్లో 30 నుంచి 40 శాతం వృథా అవుతున్నాయి.



ఈ రంగంలో రైతులకు అవగాహన తక్కువగానే ఉంది. ఇజ్రాయిల్ వంటి దేశాల్లో మూడు శాతం మాత్రమే పంటల వృథా ఉంది. మన దేశంలో ఏటా లక్షల కోట్ల రూపాయల విలువైన పంట వృథా అయిపోతుంది. ఆహార శుద్ధి రంగం వల్ల పంట ఉత్పత్తులకు అదనపు విలువ చేకూరుతుంది. పంట వినియోగదారునికి చేరే క్రమంలో ప్రతి దశలోనూ ఉత్పత్తికి కొంత విలువ చేకూరుతుంది. ఆహార శుద్ధి రంగ అభివృద్ధి వల్ల ఉపాధి అవకాశాలు వెల్లువెత్తుతాయి. ఎగుమతుల వల్ల విదేశీ మారక ద్రవ్యమూ లభిస్తుంది. ప్రధానంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా రంగం ఆహార శుద్ధికి కీలకమైనది. ఉపాధి లభ్యమవడం వల్ల నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆహార శుద్ధి రంగంలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించాలి.

3. ఆధునిక రిమోట్‌సెన్సింగ్, వాతావరణ సూచికల ఆధారంగా పంట నష్టం జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ ఎక్కువ సంఖ్యలో పంట కోత ప్రయోగాలు చేపట్టాలి. పంట కోత ప్రయోగాల డేటా అందిన మూడు నెలల్లోపు బీమా సొమ్ము రైతులకు చెల్లించాలనే నియామకాన్ని కచ్చితంగా అమలు చేయాలి.

4. గడచిన నాలుగేళ్లలో 11 రాష్ట్రాల్లో సుమారు రెండు లక్షల కోట్ల రూపాయల మేర వ్యవసాయిక రుణాలను మాఫీ చేశారు. అయినా వ్యవసాయ రంగంలో ఎటువంటి పురోగతి కానరావడంలేదు. సంస్థాగత రుణాలనే రుణమాఫీ చేస్తున్నారు. ప్రధానంగా పెద్ద రైతులకు సంస్థాగత రుణాలు అందుబాటులో ఉంటున్నాయి. చిన్న, కౌలు రైతులు ప్రధానంగా వడ్డీ వ్యాపారుల నుంచి వ్యవసాయం కోసం రుణాలు అధిక వడ్డీకి తీసుకుంటున్నారు. రుణమాఫీ వల్ల చిన్న రైతులకు ఆశించిన లబ్ధి చేకూరడంలేదు. అంతేగాక క్రమం తప్పక కిస్తులను చెల్లించే రైతాంగాన్ని రుణమాఫీ విధానం నిరుత్సాహపరుస్తుంది. అదే విధంగా రుణమాఫీ వల్ల బ్యాంకులపై అధిక ఆర్థిక భారం పడుతోంది. ఆర్థిక సర్వే కూడా ఇదే విషయాన్ని ఎత్తి చూపింది. దేశ రైతాంగానికి తాత్కాలిక ఉపశమనాన్ని ఇచ్చే రుణమాఫీ పథకాలకు స్వస్తి పలికి, కనీస ఆదాయాన్ని నేరుగా అందించే పథకాలను ప్రవేశపెట్టడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చవచ్చు. రైతాంగానికి ఇతరాత్రా ఆదాయ మార్గాలను పెంచడంతో పాటు వ్యవసాయ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించేందుకు చర్యలు చేపట్టాలి. ★

### వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్

**ఆం**ధ్రప్రదేశ్‌లో వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

**పోస్టుల వివరాలు**

**జూనియర్ లెక్చరర్లు :** 237 (ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌లో).

**సబ్జెక్టుల వారీ ఖాళీలు:** ఇంగ్లీష్-19, తెలుగు-18, హిందీ-17, ఉర్దూ-4, సంస్కృతం-3, ఒరియా-2, మ్యాథమెటిక్స్-16, ఫిజిక్స్-19, కెమిస్ట్రీ-21, బోటనీ-19, జువాలజీ-20, కామర్స్-18, ఎకనామిక్స్-25, సివిక్స్-18, హిస్టరీ-18.

**అర్హత :** సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ (ఎంఏ/ ఎంఎస్సీ/ ఎంకాం/ బీఎస్సీ ఆనర్స్/ బీఏ ఆనర్స్/బీకాం ఆనర్స్) లేదా తత్సమాన పీజీ ఉత్తీర్ణత.

**వయసు :** జులై 1, 2018 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

**ఎంపిక:** స్క్రీనింగ్ టెస్ట్/ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ ఎగ్జామినేషన్, ఓరల్ టెస్ట్ (ఇంటర్వ్యూ) ఆధారంగా.

**మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ :** 2019, జులైలో.

**దరఖాస్తు విధానం :** ఆన్‌లైన్‌లో.

**దరఖాస్తు, ప్రాసెసింగ్ ఫీజు :** రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.

**దరఖాస్తుకు చివరితేదీ :** ఫిబ్రవరి 8, 2019.

**ఫీజు చెల్లించుటకు చివరితేదీ :** ఫిబ్రవరి 7, 2019.

**పూర్తి వివరాలు :** వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.

**వెబ్‌సైట్:** https://psc.ap.gov.in




### వివిధ పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్

**వి**విధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

**పోస్టుల వివరాలు...**

### ఉద్యోగాలు

**1. ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు :** 43

**అర్హత :** బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ (బీఎఫ్ఎస్సీ) ఉత్తీర్ణత.

**ఫీజు చెల్లించుటకు చివరితేదీ :** ఫిబ్రవరి 7, 2019.

**దరఖాస్తుకు చివరితేదీ :** ఫిబ్రవరి 8, 2019.

**2. అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు :** 10

**అర్హత :** ఫిషరీస్ టెక్నాలజీలో పీజీ డిప్లొమా లేదా డిప్లొమా, నేవిగేషన్ పాలిటెక్నిక్ లేదా ఇన్‌ల్యాండ్/మెరైన్ ఫిషరీస్ క్లాసెస్ కోర్సు సర్టిఫికెట్ లేదా జువాలజీ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ లేదా బీఎఫ్ఎస్సీ లేదా బీఎస్సీ (ఎఫ్‌జెడ్‌సీ), బీఎస్సీ (ఫిషరీస్) ఉత్తీర్ణత.

**ఫీజు చెల్లించుటకు చివరితేదీ :** ఫిబ్రవరి 7, 2019.

**దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 8, 2019.

**3. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్లు:** 5

**అర్హత:** ఎలక్ట్రానిక్స్ లేదా టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణత.

**ఫీజు చెల్లించుటకు చివరితేదీ :** ఫిబ్రవరి11, 2019.

**దరఖాస్తుకు చివరితేదీ :** ఫిబ్రవరి 12, 2019.

**పూర్తి వివరాలు :** వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.

**వెబ్‌సైట్ :** https://psc.ap.gov.in

## 8, 9న గండికోట ఉత్సవాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిల్లా గండికోట ఉత్సవాలను ఈ నెల 8, 9వ తేదీల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరికిరణ్ అన్నారు. ఆదివారం కడప కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గండికోట ఉత్సవాలు-2019కి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, ఫన్ బాస్కెట్‌బాల్, బెలూన్ వాక్, కర్ర సాము వంటి పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. 6న రాజంపేట, 7న కడప, 8న ప్రొద్దుటూరు, జమ్మలమడుగులో శోభ యాత్ర కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కోటేశ్వరరావు, ట్రైనీ కలెక్టర్ గోపాల కష్ణ, జెసి-2 శివారెడ్డి, డిఆర్ఒ రఘునాథ్ పాల్గొన్నారు.



శతాబ్ది ఉత్సవాలలో భరతనాట్యం చేస్తున్న కళాకారులు

## ఘనంగా సంగీత, నృత్య శతాబ్ది ఉత్సవాలు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

విజయనగరంలోని మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చెన్నైకి చెందిన వసుంధర థామస్, రాజమండ్రి ప్రభుత్వ నృత్య కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌వి ప్రసన్నకుమారి భరతనాట్యం వీక్షకులను ఆకట్టుకుంది. సినీ నటుడు, ప్రముఖ రచయిత తనికెళ్ల భరణి ఈ కార్యక్రమంలో అలరించారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కళాశాల స్థాపకులు, 4వ విజయరామగజపతిరాజు విగ్రహాన్ని, కచేరీ మందిరాన్ని ఆయన వారసులు, స్థానిక ఎంపి పూసపాటి అశోక్‌గజపతిరాజు ఆవిష్కరించారు. ప్రారంభ సభలో మంత్రి గంటా శ్రీనివాసవరావు మాట్లాడుతూ రాష్ట్రానికి విజయనగరం జిల్లా సాంస్కృతిక రాజధాని అన్నారు. భవిష్యత్తులో కనీసం నెలకొక రాష్ట్ర స్థాయి సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించేలా క్యాలెండర్ రూపొందించి, వాటి నిర్వహణకు ఒక ప్రత్యేక బృందాన్ని నియమిస్తామని తెలిపారు. మన రాష్ట్రానికి ప్రతిష్టాత్మకంగా నిలిచిన కూచిపూడి నృత్యాన్ని విశ్వవ్యాప్తంగా విస్తరించే విధంగా కళాకారులను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. అమరావతిలో సంగీత, నృత్య కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. అంతకుముందు కళాశాలలో ఓపెన్ ఆడిటోరియంను ప్రారంభించారు. రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు మాట్లాడుతూ ఈ కళాశాలలో విద్యనభ్యసించిన వారెందరో దేశ విదేశాల్లో పేరుప్రఖ్యాతలు గడించారన్నారు. నాటి వైభవాన్ని నిలబెట్టే విధంగా కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే మీసాల గీత అధ్యక్షతన జరిగిన సభలో కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్, జాయింట్ కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. హరికథను ప్రదర్శించిన హరికథ చూడామని కోట సచ్చితానందశాస్త్రి భాగవతార్‌కు సభలో రూ.లక్ష నగదు పురస్కారాన్ని మంత్రులు అందజేశారు.

# నిరసనలు...తోపులాటలు

- స్పృహ తప్పిన వైసిపి ఎమ్మెల్యే చెవిరెడ్డి
- ఉయ్యూరులో వృద్ధురాలు మృతి
- రెండో రోజు పసుపు-కుంకుమ, పింఛన్ల పంపిణీ సభల తీరు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న పసుపు-కుంకుమ, పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రెండోరోజైన ఆదివారమూ నిరసనలు, తోపులాటలు చోటు చేసుకున్నాయి. చిత్తూరు జిల్లా తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం అగ్రహారంలో సభకు వచ్చిన వైసిపి ఎమ్మెల్యే చెవిరెడ్డికి వ్యతిరేకంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమని, ప్రజాప్రతినిధిగా తాను ఈ కార్యక్రమానికి వచ్చానని చెప్పినా వినిపించుకోలేదు. దీంతో, వారి తీరును నిరసిస్తూ ఎమ్మెల్యే బైఠాయించారు. అయినా, టిడిపి వారు వెనక్కి తగ్గకుండా ఎమ్మెల్యేను చుట్టుముట్టడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. కొందరు అక్కడే ఉన్న పసుపు, కుంకుమ ప్యాకెట్లను ఎమ్మెల్యేపైకి విసిరారు. ఈ సందర్భంగా చోటు చేసుకున్న తోపులాటలో ఎమ్మెల్యే స్పృహతప్పి కింద పడిపోవడంతో పోలీసులు హుటాహుటిన తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే ఆరోగ్యం పరిస్థితి నిలకడగా ఉందని, ఎలాంటి పాణాప్రాయమూ లేదని వైద్యులు తెలిపారు. చంద్రగిరి టిడిపి ఇన్‌ఛార్జి పులివర్తి నానిని అరెస్టు చేయాలంటూ వైసిపి కార్యకర్తలు ధర్నాకు దిగారు.

అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామంలో మంత్రి పరిటాల సునీతను మహిళలు నిలదీశారు. మహిళా సంఘాలకు రుణాలు మాఫీ చేయకుండా, పసుపు-కుంకుమ పేరుతో మోసం చేసేందుకు వచ్చారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపూర్ణంగా రుణమాఫీ చేశాకే తమ గ్రామంలో అడుగుపెట్టాలంటూ రోడ్డుపై బైఠాయించారు. ఈ నేపథ్యంలో మంత్రి మూడు గంటలు ఆలస్యంగా భారీ పోలీసు బలగాలు, సొంత బలగాలతో వచ్చారు. ఆమె కాన్వాయ్‌పై కొందరు గ్రామస్తులు చెప్పులు, చీపుర్లు విసిరారు. పోలీసులు అతి కష్టం మీద వారిని నిలువరించారు. ఒడిసి మండలం

మామిళ్లకుంటపల్లి పంచాయతీ కేంద్రంలో పింఛన్ల పంపిణీ సభలో తోపులాట చోటు చేసుకుంది. వృద్ధాప్య పింఛను తీసుకోవడానికి వచ్చిన మామిళ్లకుంట్లపల్లికి చెందిన ఎద్దుల లక్ష్మీనరసమ్మ కుడికాలు విరిగిపోయింది.

పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం ఏలూరుపాడులో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో పింఛను తీసుకోవడానికి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీరవాసరం మండలంలో పింఛను కోసం లబ్ధిదారులు పడిగాపులు కాశారు. పింఛను తీసుకున్న వారికి మాత్రమే భోజనాలను అందజేయడంతో మహిళలు, వృద్ధులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం లోలుగులో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ప్రభుత్వ విప్ కూన రవికుమార్‌ను అడ్డుకున్నారు. టిడిపి జెడ్‌పిటిసి సభ్యుడు లోలుగు శ్రీరాములునాయుడును విస్మరించి, గ్రామంలో వేరే గ్రూపును ప్రోత్సహించడాన్ని నిరసించారు. విప్ కార్యక్రమానికి హాజరు కాగానే అక్కడున్న కుర్చీలు, బెంచీలను విసిరేసి ఆయనను చుట్టుముట్టారు. కార్యక్రమాన్ని సుమారు గంటన్నర పాటు అడ్డుకున్నారు. చివరకు ఇద్దరు లబ్ధిదారులకు పింఛను, ఒక మహిళకు పసుపు-కుంకుమ చెక్కును అందజేసి విప్ వెనుదిరిగారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పలుచోట్ల పసుపు, కుంకుమ చెక్కుల కోసం ఉదయం తొమ్మిది గంటల నుంచే శిబిరం వద్దకు లబ్ధిదారులు చేరుకున్నారు. రెండు గంటల వరకు కార్యక్రమాన్ని ప్రారంభించకపోవడంతో వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు. విశాఖ జిల్లా డుంబ్రిగుడ మండలం సొవ్వ పంచాయతీ పింఛన్ల పంపిణీ సభలో వైసిపి, సిపిఎం నాయకులు వెలుగు అధికారులను నిలదీశారు. 2009 నుంచి 2013 వరకు కట్టిన అభయహస్తం డబ్బులు ఇప్పటికీ చెల్లించలేదని, పింఛన్లు మంజూరు కాలేదని తెలిపారు. అన్ని గ్రూపులకూ పసుపు-కుంకుమ డబ్బులు ఇవ్వాలని, వీటిపై అధికారులు సమాధానం చెప్పాలని నిలదీశారు. డుంబ్రిగుడలో ఎటువంటి సౌకర్యాలూ కల్పించకపోవడంతో పంచాయతీ పరిధిలోని గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు ఎండలో ఇబ్బందులు పడ్డారు. ప్రకాశం జిల్లా గుడ్లూరులో పింఛన్ల కోసం వృద్ధులు ఉదయాన్నే వచ్చినా అధికారులు మాత్రం సకాలంలో రాలేదు. దీంతో, మధ్యాహ్నం రెండు గంటల వరకు వృద్ధులు నిరీక్షించాల్సి వచ్చింది. దోర్నాల మేజర్ పంచాయతీలో డ్వాక్రా మహిళలు నీడ, తాగునీరు, కూర్చోవడానికి కుర్చీలు లేక ఇబ్బందులు పడ్డారు.


చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

## జయరాం హత్య కేసులో కొత్త ట్విస్టు


### విష ప్రయోగంగా నిర్ధారణ..!

ప్రజాశక్తి-నందిగామ

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిగురుపాటి జయరాం హత్య కేసులో పోలీసులకు కొత్త ట్విస్టు ఎదురైంది. జయరాం హత్యకు బలమైన కుట్ర జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఫోరెనిక్స్ ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్టు ప్రకారం కుక్కలకు చేసే ఇంజక్షన్‌తో విషప్రయోగం చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి త్రిపాఠి వివరించారు. పోస్టుమార్టానికి 24 గంటల ముందే హత్య జరిగినట్లు వైద్యులు తేల్చారని తెలిపారు. జనవరి 31వ తేదీ మధ్యాహ్నం జయరాం హత్యకు గురైనట్లు తేలిందన్నారు. ఈ హత్యపై శిఖా చౌదరితో పాటు కొందరు మహిళలను ప్రశ్నించామన్నారు. హత్య తర్వాత జయరాం మృతదేహాన్ని కారులో తీసుకొచ్చి నందిగామ మండలం ఐతవరం శివారులో వదిలేసి వెళ్ళారని చెప్పారు. మృతదేహాన్ని తీసుకువచ్చిన కారు స్టీరింగ్‌పై వేలి ముద్రలు దొరకకుండా నిందితులు జాగ్రత్త పడ్డారన్నారు. కారు స్టీరింగ్ మీద ఉన్న వేలిముద్రలు, జయరాం వేలిముద్రలకు మ్యాచ్ అవ్వడం కేసులో కొత్త ట్విస్టుగా అభివర్ణించారు. జయరాం హత్యకు హైదరాబాదులో కుట్ర జరిగిందన్నారు. మృతదేహాన్ని తరలించేందుకు రెండు కార్లు వాడినట్లు అనుమానిస్తున్నామన్నారు. కేసు మిస్టరీని ఛేదించేందుకు 10 బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫోరెనిక్స్ ల్యాబ్ సమాచారం ప్రకారం కుక్కలకు చేసే ఇంజక్షన్‌తో విషప్రయోగం చేశారని, దీనికి శిఖా చౌదరి స్నేహితుడు రాకేష్ రెడ్డి పాల్పడినట్లు అనుమానాలున్నాయన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో విచారణ చేసి నిందితులను మీడియా ముందు ప్రవేశపెడతామని పేర్కొన్నారు. ఆర్థికపరమైన విషయంలోనే తేడాలు వచ్చి నిందితులు ఈ హత్యకు పాల్పడినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు పేర్కొన్నారు. హత్య జరిగి మూడు రోజులు దాటినప్పటికీ ఇంత వరకు నిందితులను పట్టుకోకపోవటం వెనుక పోలీసులకు ఏమైనా రాజకీయ ఒత్తిళ్లు ఎదురవుతున్నాయా అనేది ప్రశ్నార్థకరంగా మారింది.

## మాజీ ఎమ్మెల్యే రాఘవరావు మృతి

ప్రజాశక్తి-మేదరమెట్ల


రాఘవరావు (ఫైల్)

పమిడిపాడు గ్రామానికి చెందిన మాజీ శాసనసభ్యులు జాగర్లమూడి రాఘవరావు (65) ఆదివారం ఉదయం మృతిచెందారు. ఆయన కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రాఘవరావు సీనియర్ నేత కరణం బలరామకృష్ణమూర్తి శిష్యుడు. సొసైటీ అధ్యక్షులుగా, పమిడిపాడు గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. 1989లో అద్దంకి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. తదుపరి రెండుసార్లు అదే నియోజక వర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. రాఘవరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్సీ కరణం బలరామకృష్ణమూర్తి, వైసిపి మాజీ ఎంపి వైవి సుబ్బారెడ్డి, అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి బాచిన చెంచుగరటయ్య సంతాపం తెలిపారు.



పాటల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

## పాటకు జీవం సాహిత్యం

### 'సైరా మా బళ్లారి' పాటల పుస్తకావిష్కరణ సభలో వక్తలు

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

ఏ పాటకైనా సాహిత్యమే జీవం, అది సమాజంలో ప్రజల్ని చైతన్య పరుస్తుందని కవి, విమర్శకులు, సాహిత్య ప్రస్థానం సంపాదకవర్గ సభ్యులు కెంగార మోహన్ అన్నారు. ఆదివారం కర్నూలు పింగళిసూరన తెలుగుతోట (ఫంక్షన్ హాల్)లో రచయిత జంధ్యాల రఘుబాబు రచించిన పాటల పుస్తకం 'సైరా మా బళ్లారి' ఆవిష్కరణ సభ జరిగింది. విశ్రాంత ఉపాధ్యాయులు కోటేశ్వరప్ప పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఎంపి బసవరాజు అధ్యక్షతన జరిగిన సభలో పుస్తకాన్ని సమీక్షించిన కెంగార మోహన్ మాట్లాడారు. ఈ పాటల్లో రచయిత పర్యావరణ ప్రేమికుడుగా, మార్క్సిస్ట్‌గా, అంబేద్కరిస్టుగా కనిపిస్తాడన్నారు. లలిత కళాసమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడారు. ఆకాశవాణి కర్నూలు స్టేషన్ సంచాలకులు రొక్కం కామేశ్వరరావు మాట్లాడుతూ పాటకు సరైన బాణీ ప్రధానమని, సంగీతాత్మకమైన సరళ పదాలు అనివార్యమన్నారు. అనంతరం రఘుబాబు రాసిన పాటల్ని గాయకులు పాడి వినిపించారు. రచయిత జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ సమాజంలోని అసమానతల్ని కవితలు, కథలతోనే కాక పాటలతో అందించాలన్న సంకల్పంతో ఈ ప్రయత్నం చేశానన్నారు. కార్యక్రమంలో సాహితీస్రవంతి జిల్లా నాయకులు గౌరెడ్డి హరిశ్చంద్రా రెడ్డి, కవులు పాల్గొన్నారు.

# 'కిరీటాలు' మాయంపై విచారణ

- అర్చకులు, సిబ్బందిని ప్రశ్నించిన అధికారులు
- రెండు రోజుల్లో నిందితులను పట్టుకుంటాం : ఈవో

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి శ్రీగోవిందరాజుస్వామి ఆలయం తిరుమల శ్రీవారి ఆలయం తర్వాత ప్రసిద్ధిగాంచినది. ఆలయంలో గర్భాలయానికి పక్కనే లక్ష్మీ, వెంకటాచలం, పద్మావతి దేవిలతో కూడిన ఉప ఆలయం ఉంది. ఆ ఆలయంలోని దేవతా మూర్తుల మూడు కిరీటాలు శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాయి. ఈ విషయాన్ని సాయంత్రం గుర్తించిన సంబంధిత ఆలయ సూపరింటెండెంట్, డిప్యూటీ ఈవో వరలక్ష్మీ దృష్టికి తీసుకెళ్లారు. స్థానికంగా అర్చకులను విచారించిన అనంతరం 1300 గ్రాముల బరువుగల (మూడు కిరీటాలు) నగలు మాయమైనట్లు నిర్ధారించుకుని ఈస్టు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అర్బన్ ఎస్పి అన్బురాజన్ ఆధ్వర్యంలో ఫింగర్‌ప్రింట్స్ నిపుణులు ఆలయానికి చేరుకుని ఆలయంలో వెలుపల, లోపల క్షుణంగా పరిశీలించారు. ముందుగా ఆలయంలోని 12 సిసి కెమెరాల పుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. టిటిడి విజిలెన్స్ సివి అండ్ ఎస్‌వో గోపినాథ్‌జెట్టి, వారి సిబ్బందితో కలిసి జెఈవో పోలా భాస్కర్ రాత్రి 9 గంటల నుంచి ఆలయం తలుపులు మూసివేసి విచారణ చేపట్టారు. ఆలయంలో పని చేస్తున్న అర్చకులను, సిబ్బందిని, ముగ్గురు మహిళా స్వీపర్లను విచారించారు. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో అర్చకులను విచారించిన అర్బన్ ఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ 1300 గ్రాముల బరువున్న మూడు బంగారు కిరీటాలు చోరీకి గురైనట్లు నిర్ధారణ అయిందని, అందుకు సంబంధించి విచారణను వేగవంతం చేస్తున్నామన్నారు. టిటిడి సివిఎస్‌వో గోపినాథ్‌జెట్టి మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 12 సిసి కెమెరాల్లో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉన్న పుటేజీలను పరిశీలించామని, అందులో అనుమానీతులను పిలిపించి విచారించామన్నారు. సాయంత్రం టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆలయాన్ని సంద ర్శించి, విచారణ గురించి అడిగి తెలుసుకున్నారు. రెండురోజుల్లో నిందితులను పట్టుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు సివిఎస్‌వో శివకుమార్ రెడ్డి, సిఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏప్ ఏసిఏవో బాలాజీ, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈవో వర లక్ష్మీ, టిటిడి అధికారులు, తిరుపతి పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.


గోవిందరాజుస్వామి ఆలయంలో పరిసరాలను పరిశీలిస్తున్న టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్


ఉత్సవాలను పరిశీలిస్తున్న పురావస్తు శాఖ కమిషనర్ వాణిమోహన్, జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం

## కొండపల్లి ఖిల్లా ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

విజయవాడ సమీపంలోని చారిత్రాత్మక కొండపల్లి ఖిల్లా విశిష్టతను చాటుతూ ఆదివారం కొండపల్లి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కొండపల్లి ఖిల్లా ఉత్సవాల్లో భాగంగా కృష్ణానది పవిత్ర సంగమం (ఫెర్రీ) వద్ద ఏర్పాటు చేసిన హెలికాప్టర్ రైడింగ్‌ను కూడా మంత్రి ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా ఖిల్లాపై అడ్వంచర్ స్పోర్ట్స్ నిర్వహించారు. పలు రాష్ట్రాల నుండి క్రీడాకారులు రాక్ బెల్లింగ్, రోప్ క్లైంబింగ్‌లలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఖిల్లాను విద్యుద్దీపాలతో అలంకరించారు. ట్రెక్కింగ్, ఒంటెల సవారీ, జోయ్ రైడ్స్, పెయింటింగ్ ప్రదర్శనలతోపాటు సంగీత నృత్య కళా ప్రదర్శనలు, జబర్దస్త్ నటుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా మంత్రి దేవినేని మాట్లాడుతూ 11వ శతాబ్ద కాలం నుండే కొండపల్లి ఖిల్లా చారిత్రక వైభవాన్ని సంతరించుకుందని, ఈ ఖిల్లా ప్రాశస్త్యం ప్రపంచానికి చాటిచెప్పేలా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెరమరుగవుతున్న ఖిల్లా వైభవానికి పునరుజ్జీవం తీసుకొచ్చేలా ప్రతి ఏటా ఇదే తరహాలో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. పురావస్తు శాఖ కమిషనర్ వాణిమోహన్, పలువురు అధికారులు ఈ ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం ఉండటంతో పోలీసు ఉన్నతాధికారులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

## వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్, పెదకాకాని (గుంటూరు)

గుంటూరు జిల్లాలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాలలో ఇద్దరు రైతులు సహా ముగ్గురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తెన పల్లి రూరల్ మండలం గుడిపూడి - పెదమక్కెన వద్ద జరిగిన ప్రమాదంలో రాజుపాలెం మండలం ఆకులగణపవరానికి చెందిన చెన్నూరి చిన వెంకటేశ్వర్లు (58), పోలిశెట్టి శౌరీ (52) అక్కడికక్కడే మృతి చెందారు.సత్తెనపల్లి నుండి వస్తున్న లారీ వీరి బైక్‌ను ఢీకొనడంతో మృతి చెందారు. మరో ఘటనలో గుంటూరు నుండి విజయవాడ వైపు ద్విచక్ర వాహనంపైన వెళుతున్న బత్తుల ఫణి జాతీయరహదారిపై డివైడర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

## వైద్యానికి అరకొర నిధులే...

### ఐఎంఎ జాతీయ ఉపాధ్యక్షుడు గంగాధరరావు

ప్రజాశక్తి-గుడివాడ

కేంద్రం వైద్యా విధాన పరిషత్‌కు నామమాత్రపు నిధులు కేటాయించడం చూస్తే పేదలకు ఆరోగ్యం అందని ద్రాక్షగా మారిందని ఐఎంఎ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పొట్లూరి గంగాధరరావు విమర్శించారు. ఆదివారం కృష్ణా జిల్లా గుడివాడ ఐఎంఎ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగేళ్లుగా కేంద్రం వైద్యారంగానికి నిధుల కేటాయింపులు నామమాత్రంగానే ఉన్నాయని తెలిపారు. కేవలం అంకెల గారడీ మినహా ప్రజలకు ఉపయోగపడడంలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆరోగ్య భద్రతకు నిధులు కేటాయిండంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆయుష్మాన్ భారత్‌కు సరళీకృతమైన విధానం లేకపోవడం వల్లే అది కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు. ఓవైపు బడ్జెట్‌లో సరైన కేటాయింపులు లేకుండా మరో వైపు పేదలకు వైద్యాన్ని అందిస్తున్న వారిపై లేనిపోని చట్టాలను తీసుకురావడం శోచనీయమన్నారు. సమావేశంలో గుడివాడ ఏరియా అధ్యక్షులు డాక్టర్ సోమారి వెంకట్రావు, సభ్యులు డాక్టర్ వల్లూరిపల్లి సుబ్రమణేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి వర్గీకరణే ధ్యేయం : మంద కృష్ణ

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

ఎస్‌సి వర్గీకరణే తమ ధ్యేయమని ఎంఆర్‌పిఎస్ జాతీయ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ అన్నారు. స్థానిక ములుముడి బస్టాండ్ సమీప కూడలిలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల జిల్లా సమాయత్త సదస్సును నిర్వహించారు. సభకు ఎంఆర్‌పిఎస్ నగర ఇన్‌ఛార్జ్ బర్రె ప్రసాద్ మాదిగ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు ఎస్‌సి వర్గీకరణ అమలులో ఉండేదని గుర్తు చేశారు. అనంతరం రాష్ట్రం విడిపోవడంతో ఎస్‌సి వర్గీకరణను తీసివేశారని తెలిపారు. దీంతో తమ మాదిగ ప్రజలు అభివృద్ధిలో దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ అభివృద్ధిని అడ్డుకునేలా పాలన సాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు

# 9 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

### హాజరుకానున్న మంత్రులు

ప్రజాశక్తి - పెద్దాపురం (తూర్పుగోదావరి)

రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఈనెల 9, 10, 11 తేదీల్లో పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో నిర్వహిస్తున్నట్టు జెవివి రాష్ట్ర అధ్యక్షులు కె.త్రిమూర్తులురెడ్డి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం వరహాలయ్య పేటలోని యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం సైన్స్ సంబరాల నిర్వహణ సన్నాహక కమిటీ సమావేశం జరిగింది. అనంతరం త్రిమూర్తులురెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 9వ తేదీన ప్రారంభ సభకు ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఎంఎల్‌సి వి.బాలసుబ్రహ్మణ్యం హాజరవుతారని తెలిపారు. ఒక్కో జిల్లా నుంచి జిల్లా స్థాయి సైన్స్ సంబరాల్లో ఎంపికైన 8 మంది విజేతల చొప్పున అన్ని జిల్లాల విజేతలు హాజరవుతారని చెప్పారు. శాస్త్రవేత్తలతో విద్యార్థుల ముఖాముఖి, శాస్త్రస్థాయి పర్యటనలో భాగంగా మడ అడవుల సందర్శన, కళారూపాల ప్రదర్శన ఉంటాయన్నారు.

మూడు రోజులపాటు విజ్ఞానదాయక, చైతన్య పూరిత వాతావరణంలో ఈ సైన్స్ సంబరాలు నిర్వహిస్తామని చెప్పారు. జెవివి ఆధ్వర్యాన చేపట్టిన సాక్షరతా ఉద్యమం ద్వారా సంపూర్ణ అక్షరాస్యత, బాణామతి, చేతబడి వంటి మూఢనమ్మకాలపై చేపట్టిన ఉద్యమాలు, అవగాహనా కార్యక్రమాలు మేధావులు, విద్యావంతులనే కాక సామాన్య ప్రజలను సైతం ఆకట్టుకున్నాయని చెప్పారు. ఈసమావేశంలో జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ సిహెచ్.రవికుమార్, కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి జి.మురళీధరన్, రాష్ట్ర కార్యదర్శి కెవివి.సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కెఎంఎంఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర అధ్యక్షులు త్రిమూర్తులు రెడ్డి

# నిషేధిత గసగసాలు పంట ధ్వంసం

ప్రజాశక్తి-వేంపల్లి (కడప)

కేంద్ర ప్రభుత్వం నిషేధించిన గసగసాలు (ఒపిఎం సోపి) పంటను ఎక్సైజ్ అధికారులు ఆదివారం ధ్వంసం చేశారు. సాగు చేసిన వ్యక్తి, రైతులపై ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. వివరాలలోకి వెళ్తే కడప జిల్లా వేంపల్లి మండలం ఇడుపులపాయకు చెందిన రైతులు శ్రీ రాములు, హనుమంతు ఐదెకరాల పొలాన్ని గుత్తకు తీసుకుని చిత్తూరు జిల్లా బోయకొండకు చెందిన మునికష్ణనాయుడు గస గసాలు పంట సాగు చేశాడు. పక్కా సమాచారంతో ఎక్సైజ్ అసి స్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం పంటను పరిశీలించారు. సంబంధిత రైతులను అదుపు లోకి తీసుకున్నారు. పంటను ధ్వంసం చేశారు. పంట సాగు చేసిన మునికృష్ణనాయుడు పరారీలో ఉన్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో మొదటిసారి ఈ పంటను సాగు చేశారన్నారు. ముగ్గురి పైనా ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మునికష్ణ గతంలో అనంతపురం జిల్లా పుట్టపర్తి సమీపంలో ఈ పంటను సాగు చేసి ఎక్సయిజ్ అధికారులకు దొరికారు. గసగసాల కాడలు, కాయ గింజల నుంచి వచ్చే పాలు హెరాయిన్, కొకైన్ లాంటి డ్రగ్స్ తయారీకి ఉపయోగపడతాయని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, డ్రగ్స్ కంట్రోల్ యూనిట్ అధికారుల నుంచి అనుమతులు పొంది కొన్ని రాష్ట్రాల్లో ఈ పంటను సాగుచేస్తున్నారని పేర్కొన్నారు. గసగసాల పాలు లీటరు రూ.లక్షకు పైగా ఉంటుందని చెప్పారు.


పంటను ధ్వంసం చేయిస్తున్న అధికారులు

## పీకల్లోతు రుణభారంతో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్న ఇటలీ

**రోమ్:** నానాటికీ పెరుగుతున్న రుణభారంతో ఇటలీ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోందని ఆ దేశ జాతీయ గణాంకాల సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. గత ఏడాది చివరి త్రైమాసికంలో ఇటలీ ఆర్థిక వ్యవస్థ 0.2 శాతం మేర పతనమైందని, అంతకు ముందు త్రైమాసికంలో 0.1 శాతం మేర క్షీణించిందని వెల్లడించింది. పెన్షన్ సంస్కరణల నిలిపివేత, ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలన్న ప్రతిపాదనలతో ఇటీవల ఇటలీ ప్రభుత్వం ఆమోదించిన బడ్జెట్‌ను ఐరోపా కూటమి తిరస్కరించిన విషయం తెలిసిందే. ఇటలీ ప్రభుత్వ ప్రతిపాదనలు వ్యయకర్తన నిబంధనలకు విరుద్ధంగా వున్నాయంటూ ఐరోపా కూటమి ఈ ప్రతిపాదనలను తిరస్కరించింది. బడ్జెట్ ప్రతిపాదనలు ఇదే విధంగా అమలు చేస్తే ఇటలీ తన రుణాలను చెల్లించలేని స్థితికి చేరుకుంటుందని ఇయు కమిషనర్లు తమ తిరస్కరణకు వివరణ ఇచ్చుకున్నారు.

ఈజిప్టులో ప్రాచీన సమాధులు

**ఈజిప్టులో పురాతత్వ శాస్త్రవేత్తలు తాజాగా 50 పురాతన మమ్మీలను కనుగొన్నారు. ఇవి టాలిమిక్ శకానికి చెందినవిగా గుర్తించారు.**



## పోప్ చారిత్రాత్మక పర్యటన

### దుబాయ్‌లో తొలిసారి క్రైస్తవ మతగురువు

**దుబాయ్ :** క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ చరిత్రాత్మక పర్యటనకు బయల్దేరారు. యూఏఈలో ఆయన మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. దుబాయ్‌లో జరగనున్న ఇంటర్‌ఫెయిత్ కాన్ఫరెన్స్‌కు ఆయన హాజరు కానున్నారు. ఈ సదస్సుకు హాజరుకావాలని అబుదాబీ యువరాజు షేక్ మహమ్మద్ బిన్ జయేద్ అల్ నెహ్యాన్ ఆయనను ఆహ్వానించారు. పోప్ ఇప్పటికే వాటికన్ సిటీ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరారు. మంగళవారం అబూదాబీలోని జాయెద్ స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో పోప్ ప్రసంగించనున్నారు. ఈ సదస్సుకు దాదాపు లక్షా 35 వేల మంది హాజరయ్యే అవకాశముంది. 'సోదరభావం, సహనశీలతలకు నిదర్శనంగా ఉండేందుకు ప్రయత్నిస్తోంది. వివిధ సంస్కృతులు కలిసే ప్రదేశం' అని పోప్ దుబాయ్‌కు కితాబిచ్చారు. తన పర్యటనలో భాగంగా కైరోకు చెందిన ఇస్లాం మతగురువు అల్-అజహర్ ఇమామ్‌తో కూడా భేటీ కానున్నారు. యెమన్‌లో జరుగుతున్న యుద్ధాన్ని పోప్ పలుమార్లు ఖండించారు. ఈ యుద్ధంలో భాగంగా సౌదీతోపాటు యూఏఈ కూడా యెమన్‌పై దాడులు నిర్వహిస్తోంది. గత ఏడాది పోప్ మాట్లాడుతూ యెమన్‌లో మానవీయత దిగజారకుండా కాపాడుకోవాలని అంతర్జాతీయ సమాజాన్ని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో పోప్ ఇక్కడికి రానుండటం విశేషం. యుఏఈలో దాదాపు 10 లక్షల మంది రోమన్ కేథలిక్‌లు ఉన్నారు.



## బోల్సనారోకు వ్యతిరేకంగా మూలవాసుల ప్రదర్శనలు

**బ్రసీలియా:** దేశాధ్యక్షుడు జయిర్ బోల్సనారోకు వ్యతిరేకంగా దేశీయ మూలవాసులు దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించారు. బోల్సనారో సర్కారు తమ భూ హక్కులపై చేస్తున్న దాడులను నిరసిస్తూ దేశవ్యాప్తంగా వున్న 22 రాష్ట్రాలలో మూలవాసులకు చెందిన నేషనల్ ఇండిజీనియస్ మూవ్‌మెంట్, ఆర్టిక్యులేషన్ ఆఫ ఇండిజీనియస్ పీపుల్స్ ఆఫ్ బ్రెజిల్ (ఎపిఐబి) ఆధ్వర్యంలో ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి. రాజధాని బ్రసీలియాలో నిరసనకారులు పర్యావరణ మంత్రిత్వశాఖ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన ప్రదర్శనలో వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని, అడవుల నిర్మూలనకు వెంటనే తెరదించాలని డిమాండ్ చేశారు.

**టైలింగ్స్ డామ్ బాధితుల నిరసన**

2015-19 మధ్య కాలంలో మినాస్ గెరాయిస్ ప్రాంతంలో రెండు డ్యామ్‌లు కుప్పకూలిన ఘటనల్లో బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ వేలాది మంది బ్రెజిలియన్లు వరుసగా ఐదో రోజు ఆదివారం కూడా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ డ్యామ్‌లు కూలిపోవటం వెనుక మైనింగ్ కంపెనీల ప్రమేయం వుందని వారు ఆరోపించారు. మూవ్‌మెంట్ ఆఫ్ పీపుల్ అఫెక్టెడ్ బై డ్యామ్స్ (ఎంఎబి) సంస్థ తరపున 2015లో సమార్కో డ్యామ్ ప్రమాదం జరిగి ఒక గ్రామం మొత్తాన్ని ముంచి వేసిన ఘటనలో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బ్రసీలియన్ అటార్నీ జనరల్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇతర సామాజిక ఉద్యమ సంస్థలతో కలిసి మినాస్ గెరాయిస్ రాష్ట్రంలోని అనేక పట్టణాలలో ఎబెబి నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. గత నెల 25న బ్రుమాడినో పట్టణం సమీపంలో వున్న టైలింగ్స్ డ్యామ్ కూలిపోవటంతో 115 మందికి పైగా ప్రజలు మరణించగా మరో 238 మంది జాడ తెలియకుండా పోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మరో 108 మంది నిర్వాసితులుగా మారారు. బ్రుమాడినో ప్రమాద బాధితుల కుటుంబాలతో పాటు నాలుగేళ్ల క్రితం జరిగిన సమార్కో డ్యామ్ ప్రమాద బాధిత కుటుంబాలతో కలిసి ఎంఎబి సభ్యులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ప్రమాదాలకు బాధ్యులైన మైనింగ్ సంస్థల యాజామాన్యాలను శిక్షించాలని వీరు గత మంగళవారం నుండి నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

# పార్లమెంటరీ ఎన్నికలకు సిద్ధం

### మదురో వెల్లడి


**కారకాస్:** కోర్టు రూలింగ్‌తో నిస్తేజంగా పడి వున్న పార్లమెంటుకు తిరిగి జవసత్వాలు కల్పించేందుకు త్వరలో పార్లమెంటరీ ఎన్నికలు జరిపించాలని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో పిలుపునిచ్చారు. బొలివేరియన్ విప్లవ 20వ వార్షికోత్సవ సందర్భంగా శనివారం నాడిక్కడ జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, యుద్ధాలు ఆపండి, సైనిక జోక్యాన్ని ఆపండి, వెనిజులాలో విప్లవం కొనసాగుతుంది. అమెరికా ఎన్ని కుట్రలు చేసినా మమ్మల్ని అధికారం నుంచి తొలగించలేరు అని స్పష్టంగా పేర్కొన్నారు. అమెరికా కుట్రలను వెనిజులా ప్రజలు పదే పదే తిప్పికొడుతున్నారు. ఇక ముందు కూడా తిప్పికొడతారు అని మదురో ఉద్ఘాటించారు. ఈ విషయంలో వెనిజులా ప్రజలు, సైన్యం, పాలనా యంత్రాంగం అంతా ఓ సంఘటిత శక్తిగా నిలిచిందన్నారు. ప్రతిపక్షం తన చర్యలతో ఇప్పటి వరకూ దేశానికి చేసిన నష్టం చాలు, యాంకీల జోక్యాన్ని సహించేది లేదని మదురో హెచ్చరించారు. అమెరికా కుట్రలు ఎన్నిసార్లు విఫలమైనా, వారికి (అమెరికాకు) బుద్ధి రాదు. ఇక్కడి మితవాద ప్రతిపక్షానికి అంతకన్నా బుద్ధి రాదు అని ఆయన విమర్శించారు. కష్ట సమయంలో అండగా నిలిచిన లాటిన్ అమెరికాలోని మెక్సికో, ఉరుగ్వే, బొలీవియా ప్రభుత్వాలకు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. ఐరాస లోని 191 సభ్యదేశాలలో అత్యధికభాగం మదురో ప్రభుత్వాన్నే చట్టబద్ధమైన ప్రభుత్వంగా తాము గుర్తిస్తున్నామని స్పష్టం చేశాయి. అయినా, అమెరికా తీరు మారలేదు. వెనిజులాపై ఆర్థిక ఆంక్షలను విధించింది. వెనిజులా జాతీయ చమురు సంస్థలపైన ఆంక్షలు పెట్టింది.గైడోకు మద్దతుగా సైనిక జోక్యానికి అది ప్రయత్నిస్తున్నది. గైడోను అధ్యక్షుడిగా గుర్తించాలని తనపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంఛెజ్ తెలిపారు. జనవరి 22న జరిగిన సమావేశంలో గైడో ప్లాన్ ప్రస్తావన లేకుండా అమెరికా వెనిజులాలో తాను చేపట్టే చర్యలకు మద్దతు ఇవ్వాలంటూ ఒత్తిడి తెచ్చిందని, ఆ మరుసటి రోజే అమెరికా అసలు పన్నాగం బయటపడిందని స్పెయిన్ ప్రధాని చెప్పారు.



ఇరాన్ అధ్యక్షుడు రోహనీతో మదురో

### యావత్తు ఓఎస్ తరపున మీరెలా మాట్లాడతారు ?

**అల్మార్గోను ప్రశ్నించిన కారికోమ్**



**కారకాస్:** వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడిగా జువాన్ గైడోను అధికారికంగా గుర్తిస్తున్నట్లు అమెరికా దేశాల సంస్థ (ఒఎఎస్) తరపున లూయిస్ అల్మార్గో ఎలా ప్రకటిస్తారని కరిబియన్‌కమ్యూనిటీ (కారికోమ్) ప్రశ్నించింది. ఒఎఎస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నంతమాత్రాన తన వైఖరినే యావత్ ఓఎఎస్ వైఖరిగా ఎలా ప్రకటిస్తారని కారికోమ్ నిలదీసింది. కారికోమ్‌లో భాగస్వామి అయిన సెయింట్ కిట్స్ ప్రధాని తిమోతి హారిస్ ఈ మేరకు అల్మార్గోకు లేఖ రాశారు. గత నెల 24న ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో కారికోమ్ సభ్యదేశాలయిన ఆంటిగ్వా, బార్బుడా, బార్బడోస్, బెలిజ్, డొమ్నికా, జమైకా, మాంట్ సెరాట్, సెయింట్ లూషియా, సెయింట్ విన్సెంట్, గ్రెనెడిన్స్, ట్రినిడాడ్, టొబాగో దేశాల అధినేతలతో పాటు గ్రెనెడా, సురినామ్ దేశాల విదేశాంగ మంత్రులు పాల్గొన్నారు. అల్మార్గో చేసిన ఏకపక్ష ప్రకటన సరికాదని, ఆయనకు ఓఎఎస్ సభ్యదేశాలలో పూర్తి మద్దతు లేదని వారు స్పష్టం చేశారు. తమ తరపున ఈ ప్రకటన చేయలేదని బహిరంగంగా ప్రకటించాలని వారు అల్మార్గోను డిమాండ్ చేశారు. పూర్తి అధికారం లేకుండా సంస్థ పేరిట అల్మార్గో బహిరంగ నిర్ణయాలు ప్రకటించటం ఇదే తొలిసారి కాదని వారు తమ లేఖలో ఆక్షేపించారు.



## సోమాలియాలో వైమానిక దాడులు జరిపింది మేమే: అమెరికా సైన్యం

**వాషింగ్టన్:** గత శుక్రవారం సోమాలియాలో వైమానిక దాడులు జరిపింది తామేనని అమెరికాకు చెందిన ఆఫ్రికామ్ (యుఎస్ ఆఫ్రికా కమాండ్) ఒక ప్రకటనలో వెల్లడించింది. సోమాలియాలో అల్‌షబాబ్ ఉగ్రవాద సంస్థను నిర్వీర్యం చేసేందుకు ఫెడరల్ ప్రభుత్వం చేస్తున్న కృషికి మద్దతుగా సోమాలియాలోని లోయర్ షెబెల్ ప్రాంతంలో వున్న గండార్షే పట్టణంలో అల్‌షబాబ్ మిలిటెంట్లను టార్గెట్ చేసి వైమానిక దాడులు చేశామని ఆఫ్రికామ్ తన ప్రకటనలో వివరించింది. ఈ దాడిని చేసింది తామేనన్న ఆఫ్రికామ్ ఈ దాడిలో ఒక్క పౌరుడు కూడా మరణించటం లేదా గాయపడటం జరగలేదని తమ పరిశీలనలో నిర్ధారణ అయినట్లు వెల్లడించింది.

## ఆస్ట్రేలియాలో భారీ వరదలు

**సిడ్నీ:** ఆస్ట్రేలియా ఈశాన్య ప్రాంతంలోని క్వీన్స్‌లాండ్‌లో కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కార్లు కొట్టుకుపోయాయి. అపార పంట నష్టం జరిగింది. ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. తీర ప్రాంత పట్టణమైన టౌన్స్‌విల్లే తీవ్రంగా దెబ్బతిన్నది. 20వేల ఇళ్లు జలదిగ్బంధనలో చిక్కుకున్నాయి. కుంభ వృష్టి మరో 24 గంటలవరకు కొనసాగే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించడంతో ప్రజలు మరింత అప్రమత్తంగా వుండాలని క్వీన్స్‌లాండ్ ప్రధాని అనస్టాషియా పలాస్జక్ హెచ్చరించారు. వరద ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు ఇసుక బస్తాలను ఉపయోగిస్తున్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## విద్యుదాఘాతంతో నలుగురు మృతి

కుమారుడు, కాబోయే పెళ్లికొడుకు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మృతుల కుటుంబసభ్యుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం పాతరౌతుపేటకు చెందిన కొమ్ము వెంకన్న(48) కుమారుడు శ్రీనివాసరావు వివాహం మార్చి 13న జరపాలని నిశ్చయించారు. ఈ నేపథ్యంలో కొత్త రౌతుపేటకు చెందిన తన బావ ఆబోతుల రాములు (54)తో కలిసి అరటి గెలలను తెచ్చేందుకు వెంకన్న తన పొలానికి వెళ్లారు. అరటి గెలలను కోస్తుండగా కొమ్మలు వారికి విద్యుత్తు వైర్లకు తగిలాయి. దీంతో, విద్యుదాఘాతానికి గురై వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వీరు ఎంతకీ రాకపోవడంతో రాములు భార్య పుణ్యవతి (45), అదే గ్రామానికి చెందిన బంగారమ్మ (46)తో కలిసి పొలానికి వెళ్లింది. నేలపై పడి ఉన్న వీరిద్దరినీ చూసి వారిని పట్టుకోవడంతో వారు కూడా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. వీరిని వెతుకుతూ పొలానికి వెళ్లిన శ్రీనివాసరావు కూడా విద్యాదాఘాతానికి గురయ్యాడు. దీన్ని గమనించిన సమీపంలోని కోళ్లఫారం యజమాని చిరంజీవి వెంటనే విద్యుత్తు నిలుపుదల చేయడంతో శ్రీనివాసరావు ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డాడు. ఇక్కడి నుంచి ఈ వైర్లను తొలగించాలని విద్యుత్తు శాఖాధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోలేదని మృతుల కుటుంబసభ్యులు వాపోయారు.

## సవాలుగా పెండింగ్ కేసులు

ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. రాజ్యాంగ బద్ధమైన విధులు సక్రమంగా నిర్వర్తించడమేతప్ప న్యాయవ్యవస్థలో వ్యక్తిగత అభిప్రాయాలు ఉండకూడదని అన్నారు. ఎనిమిది నెలల్లో హైకోర్టు తాత్కాలిక భవనాన్ని నిర్మించి రాజ్యాంగ బద్ధమైన విధిని ముఖ్యమంత్రి నిర్వర్తించారన్నారు. ఏపీలో హైకోర్టుభవనం ఏపీ ప్రజల సంస్కృతి, ఆనందానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ అమరావతిలో నల్సార్ యూనివర్శిటీ ఏర్పాటుకు సహకరించాలని చీఫ్ జస్టిస్‌కు అమరావతి నిర్మాణంలో హైకోర్టు భవనం ఓ ప్రధాన ఘట్టమన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎన్‌వి రమణ, ఎల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎపి హైకోర్టు నిర్మాణం చారిత్రాత్మకమన్నారు. భూములిచ్చిన రైతులను తరతరాలు గుర్తుంచుకుంటాయన్నారు. జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ అమరావతికి హైకోర్టు రావడంతో ఏపీ ప్రజలకు మరింత చేరువలో న్యాయం ఉంటుందన్నారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ సి. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో హైకోర్టు ఉండాలనే ప్రజల కోరిక నెరవేరిందన్నారు. తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ ప్రజలకు హైకోర్టు అందుబాటులోకి రావడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాఖండ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ రమేష్‌రంగనాథన్, రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి .పి.వెంకట్రామిరెడ్డి, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు రిజిస్ట్రార్ జస్టిస్ సి.హెచ్ మానవేంద్రరాయ్, స్పీకర్ కోడెల శివప్రసాద్, రాష్ట్ర న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ పునేఠా, పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులపై నిర్బంధం

**మొదటి పేజీ తరువాయి**

మోహరించి, అక్కడకు వచ్చిన కొద్ది మంది ఉపాధ్యాయుల్ని అరెస్ట్ చేశారు. అయితే అనూహ్యంగా ఉపాధ్యాయులు స్థానిక మార్కెట్ సెంటర్ నుండి పాదయాత్ర ప్రారంభించారు. అప్పటికే అర కిలోమీటరు వరకూ ముందుకు సాగిన పాదయాత్రను పోలీసులు మార్గం మధ్యలో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి, ఉపాధ్యాయులు రోడ్డుపైనే బైఠాయించారు. వారిని బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి అరెస్ట్ చేశారు. పోలీసు కళ్యాణ మండపంలో నిర్బంధంలో వున్న ఉపాధ్యాయులతో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా నిరసనలను అణచివేస్తుందన్నారు. సిపిఎస్ రద్దుకు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే తీర్మానం చేయాలని, దానికి సంబంధించిన జీవోలనూ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 7న అసెంబ్లీ ముట్టడి నిర్వహిస్తున్నామని, అప్పటికీ స్పందించకపోతే అన్ని సంఘాలనూ కలుపుకొని సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల బృందం ఈ విషయంపై నిలదీస్తామని ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి చెప్పారు. మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణ రావు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేయని పక్షంలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల కుటుంబాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతాయని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర సహాధ్యక్షులు శ్రీదేవి, ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ పద్మావతి తదితరులను అరెస్టు చేశారు. నిర్బంధించిన ఉపాధ్యాయుల్ని సాయంత్రానికి విడుదల చేశారు.

**ఏలూరు నుంచి పాదయాత్ర...**

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహాపాద యాత్ర ప్రారంభమైంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో వేలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రారంభ సభకు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్‌సాబ్జీ అధ్యక్షత వహించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే సిపిఎస్ రద్దుకు తీర్మానం చేయాలని, ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రను పిడిఎఫ్ ఎంఎల్‌సి రాము సూర్యారావు ప్రారంభించి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. పాదయాత్రకు పశ్చిమ గోదావరి జిల్లా జెఎసి ఛైర్మన్ ఆర్ఎస్.హరనాధ్, జెఎసి సెక్రటరీ జనరల్ సిహెచ్.శ్రీనివాస్, సిపిఎం అప్‌ల్యాండ్ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ సంఘీభావం తెలిపారు. పాదయాత్రకు రాష్ట్ర కార్యదర్శులు గొంటి గిరిధర్, డి.రాము, కష్ణ సుందర్రావు, జి.ప్రభాకర్ వర్మ, పివి.నరసింహా రావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ కె.విజయగౌరి, ఎస్‌టిఎఫ్ఐ కార్యదర్శి అరుణ కుమారి తదితరులు నాయకత్వం వహించారు.

# అరెస్ట్ అప్రజాస్వామికం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ పాదయాత్ర చేసిన ఉపాధ్యాయుల్ని గుంటూరులో అరెస్టు చేయడాన్ని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి. మధు, రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈ చర్య అప్రజాస్వామ్యమని, ప్రజాస్వామిక హక్కులను భంగం కలిగించడమేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో లక్షలాది ఉపాధ్యాయ, ఉద్యోగుల భవిష్యత్తుతో ముడిపడిన సిపిఎస్ విధానంపట్ల ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ఇంతకు ముందు ఎన్ని ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదనీ, అందుకే ఏలూరు, గుంటూరు నుండి ఉద్యోగులు పాదయాత్ర ప్రారంభించారని పేర్కొన్నారు. గుంటూరులో ప్రారంభమైన పాదయాత్రను పోలీసులు అడ్డుకుని 1000 మందికి పైగా ఉపాధ్యాయుల్ని అరెస్ట్ చేయడం దుర్మార్గమని తెలిపారు. అన్ని వర్గాల వారికి వరాలు ఇస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న చంద్రబాబు సిపిఎస్ రద్దు విషయాన్ని పెడచెవిన పెట్టడం, ఉద్యోగులపట్ల ప్రభుత్వానికున్న వైఖరికి అద్దం పడుతోందని తెలిపారు. తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**సిఐటియు ఖండన**

ఉపాధ్యాయుల అరెస్టులను సిఐటియు రాష్ట్రకమిటీ ఖండించింది. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ నర్సింగరావు, ఎమ్ ఎ గఫూర్ విడుదల చేసిన ప్రకటనలో ఉపాధ్యాయల సమస్యలను పరిష్కరించకుండా అరెస్టులు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

## అధికార పార్టీ సేవలో ఫెసిలిటేటర్లు !

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ప్రభుత్వ వ్యవహార శైలి సొమ్ము ఒకరిది..సోకు మరొకరిది అన్న చందంగా తయారైంది. ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన ఫెసిలిటేటర్లను ప్రభుత్వ కార్యక్రమాలకు, ఆ ముసుగులో నిర్వహిస్తున్న అధికార పార్టీ కార్యక్రమాలకు ప్రజలను సమీకరించే పనిలో వినియోగిస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలవుతోన్న వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు దాదాపు ఏడాది క్రితం ఫెసిలిటేటర్లను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 వేల మంది ఫెసిలిటేటర్లను నియమించినట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు. వీరికి డైలీ వేజెస్ కింద కార్పొరేషన్ నుంచే వేతనాలు చెల్లిస్తున్నారు. ఎస్సీ నిరుద్యోగ యువతనే ఫెసిలిటేటర్స్‌గా ఎంచుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్ పథకాలపై ఆ సామాజిక తరగతి ప్రజల్లో అవగాహన కల్పించడం వీరి ముఖ్య విధి. రుణాలకు దరఖాస్తు చేసే లబ్దిదారులకు వివిధ అవకాశాల గురించి వివరించడం, దరఖాస్తులు పూరించడంలో సహకరించడం, రుణ మంజూరు కోసం బ్యాంకర్లతో సంప్రదింపులు వంటి సేవలందించాల్సి వుంటుంది. ఆయా ప్రాంతాల్లో ఏవైనా కార్పొరేషన్ సమావేశాలు నిర్వహిస్తుంటే వాటికి లబ్దిదారులను సమీకరిస్తూ అటు బ్యాంకర్లకు, ఇటు లబ్ధిదారులకు, కార్పొరేషన్‌కు అనుసంధాన కర్తలుగా వీరు వ్యవహరిస్తుంటారు. కానీ ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో వీరి బాధ్యతలు అధికార పార్టీకి సేవలందించడానికే పరిమితం చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. దరఖాస్తుదారులను తరచుగా కలుస్తూ అధికార టిడిపికి సానుభూతి పరులుగా మార్చాలనే ఎత్తుగడతో వీరిపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రభుత్వ పెద్దలు వీరికి స్పష్టమైన అంతరంగిక ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. దీంతో పాటు ప్రభుత్వం ముసుగులో నిర్వహించే పార్టీ సమావేశాలు 13 జిల్లాల్లో ఎక్కడ నిర్వహించినా ఎస్సీలను సమీకరించడం, వాటికి తరలించే బాధ్యత కూడా వీరిదే.

**ఆర్థిక శాఖ అనుమతుల్లేవు !**

అయితే వీరి నియామకాలకు, వేతనాలకు ఆర్థిక శాఖ నుంచి అనుమతులు లేవు. అయినప్పటికీ ఫెసిలిటేటర్లకు గుట్టుచప్పుడు కాకుండా వేతనాలు చెల్లిస్తున్నారని అధికారులు సైతం విమర్శిస్తున్నారు. ఈ పేరుతో కార్పొరేషన్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారని ఒక సీనియర్ అధికారి వ్యాఖ్యానించడం గమనార్హం.

## కొత్త పెన్షన్ పథకంపై సందేహాలెన్నో!

**న్యూఢిల్లీ :** కేంద్ర తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్‌గోయెల్ ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన శ్రమ్‌యోగి మంధన్ యోజన పెన్షన్ పథకం అమలుపై పలువురు నిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. రు.15 వేల లోపు నెలసరి ఆదాయం వున్న అసంఘటితరంగ కార్మికులకు 60 ఏళ్ల వయస్సు నుండి రు.3 వేల నెలసరి పెన్షన్ అందచేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఇందుకు లబ్దిదారులు నమమాత్రపు నెలసరి చందా చెల్లించాల్సి వుంటుందని వివరించారు. ప్రస్తుతం అమలులో వున్న వివిధ స్వచ్ఛంద పథకాల మాదిరిగానే ఈ పథకంలో కూడా లబ్దిదారుల చందాకు సమానమైన మొత్తాన్ని ప్రభుత్వం ప్రతి నెలా వారి పెన్షన్ ఖాతాలో జమ చేస్తుంది. రానున్న ఐదేళ్ల కాలంలో దాదాపు పది కోట్ల మందికి పైగా ఉద్యోగులు, కార్మికులు ఈ కొత్త పథకంలో చేరతారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అయితే దీనిని బడ్జెట్‌లో ప్రకటించినట్లు 'ప్రపంచంలోనే అత్యంత భారీ పెన్షన్ పథకం' అని చెప్పటానికి వీలు లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గతంలో ఇదే విధంగా అమలులోకి తెచ్చిన కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాలు లబ్దిదారులను ఆకర్షించటంలో విఫలమైన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో రు.500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ పథకం ఈ ఏడాది నుండి అమలులోకి వస్తుందని ప్రకటించింది. గత పదేళ్ల ద్రవ్యోల్బణాన్ని లెక్కలోకి తీసుకుని లెక్కిస్తే ప్రభుత్వం చెబుతున్న రు.3 వేల నెలసరి పెన్షన్ విలువ లబ్దిదారుడు ఉద్యోగ విరమణ చేసే నాటికి రు. 500లుగా లెక్క తేలుతుందని ఢిల్లీకి చెందిన పరిశోధకుడు కింజల్ సంపత్ చెబుతున్నారు. ప్రస్తుతం అమలులో వున్న అటల్ పెన్షన్ యోజన (ఎపివై)తో పాటే ఈ కొత్త పథకం కూడా అమలులోకి వస్తుంది. గత యుపిఎ ప్రభుత్వం ప్రారంభించిన స్వావలంబన్ పథకం తరహాలో ఎపివై పథకాన్ని మోడీ సర్కారు 2015 జూన్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. తరువాతికాలంలో స్వావలంబన్ పథకాన్ని రద్దు చేసి, దాని చందాదారులను ఎపివైకి బదిలీ చేశారు. ఈ రెండు పథకాలూ ఇప్పటి వరకూ కేవలం 1.09 కోట్ల మందిని మాత్రమే ఆకర్షించగలిగాయని పెన్షన్ నిధుల నియంత్రణ, అభివృద్ధి వ్యవస్థ (పిఎఫ్ఆర్‌డిఎ) లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఇది ఈ పథకాలకు నిర్దేశించిన లక్ష్యాలకు చాలా దూరంలో వుంది. గత ఏడాది ఆగస్టు నాటికి అందుబాటులో వున్న సమాచారం ప్రకారం ఈ పథకాల చందాదారుల్లో 40 శాతం మంది మహిళలు వున్నట్లు తెలుస్తోంది. కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాలలో లబ్దిదారులు చెల్లించేది అత్యధిక మొత్తంగా తేలుతుండటంతో అవి చందాదారులను ఆకర్షించటంలో ఘోరంగా విఫలమవుతున్నాయని హక్కుల గ్రూపులు చెబుతున్నాయి. బొలీవియా, లెసోతో, బోట్స్‌వానా వంటి అభివృద్ధి చెందని దేశాలలో సైతం పేదలకు ఉద్దేశించిన పెన్షన్ పథకాలకు ఎటువంటి నిబంధనాలు లేవని ఈ గ్రూపులు గుర్తు చేస్తున్నాయి.

**మొదటి పేజీ తరువాయి**

## కొల్‌కతాలో హైడ్రామా

ఈ విషయం తెలియగానే పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి నాటకీయంగా స్పందించారు హుటాహుటిన కమిషనర్ నివాసానికి వెళ్లారు. డిజిపి, కొల్‌కతా నగర మేయర్ ఫిర్హాద్ హకీం హుటాహుటిన పోలీసు కమిషనర్ నివాసానికి వెళ్లారు. వీరంతా అక్కడే ఒక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన మమత అక్కడి నుండి మెట్రోఛానల్ పోలీస్ స్టేషన్‌క్ చేరుకుని ధర్నాకు దిగారు. రాత్రి 12 గంటల ప్రాంతంలో కూడా మమత ఆందోళన కొనసాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో కోల్‌కత్తాలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

**సుప్రీంకు సిబిఐ..?**

తమ విచారణ ప్రక్రియను బెంగాల్ పోలీసులు అడ్డుకోవడంతో పాటు, సిబ్బందిని అదుపులోకి తీసుకోవడంపై సుప్రీంకోర్టుకు వెళ్ళాలని సిబిఐ అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు సోమవారం వారు రిట్‌పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన సిబిఐ తాత్కాలిక డైరక్టర్ నాగేశ్వరరావు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకే తాము ఈ కేసును దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. బెంగల్ ప్రభుత్వం ఇదే కేసులో ఏర్పాటు చేసిన సిట్‌కు రాజీవ్‌కుమార్ నేతృత్వం వహిస్తున్నారని, అన్ని ఆధారాలు ఆయన వద్దే ఉన్నాయని, అయితే, తమ విచారణకు సహకరించడం లేదని చెప్పారు. ఆధారాలను ధ్వంసం చేయడమో, మాయం చేయడమో జరిగినట్లు తాము భావిస్తున్నామని చెప్పారు.

**బిజెపియేతర పార్టీలను కలిపినందుకే...**

. బిజెపియేతర పార్టీలను కలపడానికి తాము ప్రయత్నిస్తున్నందునే కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపునక దిగిందని మమతాబెనర్జీ అన్నారు. ఇది సమైక్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రపంచంలోనే రాజీవ్ కుమార్ (కొల్‌కతా పోలీసు కమిషనర్) అత్యుత్తమ వ్యక్తి అని తానిప్పటికీ చెబుతున్నానని మమత వెనుకేసుకొచ్చారు. 'మా బలగాలను రక్షించుకోవాల్సిన బాధ్యత మాదే! నోటీసులివ్వకుండా కొల్‌కత్తా కమిషనర్ నివాసానికి వచ్చారు. సిబిఐ వాళ్లను అరెస్టు చేసేవాళ్లం. కానీ వదిలేశాం' అని మమత అన్నారు. సమాఖ్య స్ఫూర్తిని రక్షించుకునేందుకు తాను ధర్నా చేపడతానని, ఈ రోజు (ఆదివారం) నుంచే మెట్రో ఛానల్ వద్ద బైఠాయిస్తానని తెలిపారు. సోమవారం జరగాల్సిన అసెంబ్లీ సమావేశాలు తాను ఎక్కడుంటే అక్కడే నిర్వహిస్తానని చెప్పారు.

**పలువురి సంఘీభావం**

మమతా బెనర్జీకి పలు పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. అఖిలేష్ యాదవ్, మాయావతి, శరద్‌పవార్, కేజ్రీవాల్, తేజస్వీ యాదవ్ తదితరులు ఆమెకు ఫోన్ చసి మద్దతు తెలిపారు.

**ప్రజల దృష్టి మళ్ళించేందుకే నాటకం : సూర్యకాంతమిశ్రా**

పశ్చిమబెంగాల్‌లలో ఆదివారం జయప్రదంగా జరిగిన వామపక్ష ర్యాలీ నుండి ప్రజల దృష్టిని మళ్ళించటానికే సిబిఐ కోల్‌కతా పోలీస్ కమీషనర్‌ను హఠాత్తుగా ప్రశ్నించటానికి పూనుకున్నదని, ఆ సందర్భంగా సిబిఐ, కోల్‌కతా పోలీసుల మధ్య ఘర్షణ జరగటం, అర్ధరాత్రి మమత ధర్నా కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాలు ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ఆడుతున్న నాటకంలో భాగమని సిపిఐ(ఎం) పశ్చిమబెంగాల్ రాష్ట్ర కార్యదర్శి సూర్యకాంతమిశ్రా విమర్శించారు. చిట్‌ఫండ్ కుంభకోణంపై సిబిఐ విచారణ ప్రారంభమై చాలా కాలం అయిందని,సమయంలో సిబిఐ దాడులకు పూనుకోవటం ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్నదేనని ఆయన చెప్పారు.

## ఎస్వీయూ ఉపకులపతిగా ఆచార్య రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా ఆచార్య వివిఎన్ రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన శ్రీకృషదేవరాయ విశ్వ విద్యాలయం లో ఆంగ్ల విభాగం నందు ఆచార్యులుగా పనిచేసి, పదవీ విరమణ పొందారు. అనంతరం ఆయన కర్నూలులోని రాయలసీమ వర్శిటీలో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ఆయన ఇప్పటివరకు 21 మంది పరిశోధక విద్యార్థులకు పిహెచ్‌డి డిగ్రీలను ప్రదానం చేయడంలో మార్గదర్శకత్వం వహించారు. పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లలో పరిశోధనా పత్రాలను ప్రచురించారు.

**యాత్ర**

విజయనగరం జిల్లా గర్భాంలోని ఫ్యాక్టరీ వరకు యాత్ర నిర్వహిస్తున్న ఆంధ్రా ఫెర్రో ఎల్లాయిస్ కార్మికులు, సిఐటియు నాయకులు



## ఆంధ్రా ఫెర్రోఎల్లాయిస్ కార్మికుల ఆకలి యాత్ర

### ఎమ్మెల్యే కిమిడి మృణాళిని ఇల్లు ముట్టడి

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఆంధ్రా ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమ కార్మికులు ఆదివారం ఆకలి యాత్ర నిర్వహించారు. మూడు నెలలపాటు పని చేయించుకుని జీతాలు చెల్లించకుండా పరారైన యాజమాన్యాన్ని తక్షణమే రప్పించి తమకు జీతాలు, బోనస్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం గర్భాంలోని ఫ్యాక్టరీ వద్దకు ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకే సుమారు 400 మంది కార్మికులు చేరుకున్నారు. అక్కడి నుంచి పాదయాత్రగా ఎమ్మెల్యే కిమిడి మృణాళిని ఇంటికి మండుటెండను సైతం లెక్క చేయకుండా బయలుదేరారు. చిన్నబంటుపల్లి, పెద్దబంటుపల్లి, లగిడాం, తాటిగూడ, గరివిడి మీదుగా చీపురుపల్లిలోని ఎమ్మెల్యే ఇంటివరకూ 20 కిలోమీటర్లు మేర వీరి ఆకలియాత్ర సాగింది. అనంతరం ఎమ్మెల్యే కిమిడి మృణాళిని ఇంటి ముందు బైఠాయించారు. కార్మికులు వస్తున్న విషయం ముందుగానే తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడ నుంచి జారుకున్నారు. దీంతో, ఆగ్రహించిన కార్మికులు ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించి నినాదాలు చేశారు. పరారీలో ఉన్న యాజమాన్యాన్ని ప్రభుత్వం వెంటనే రప్పించాలని డిమాండ్ చేశారు. కొంత సమయం తర్వాత అక్కడకు వచ్చిన ఎమ్మెల్యే కుమారుడు నాగార్జునబాబు కార్మికులతో మాట్లాడాడు. వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని రెండు రోజుల్లో రప్పించి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.



## శ్రీవారి సన్నిధిలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

ప్రజాశక్తి తిరుమల

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న జస్టిస్ రంజన్ గొగోయ్, న్యాయమూర్తి ఎన్.వి.రమణలకు టిటిడి కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జెఈవో కెఎస్ శ్రీనివాసరాజు స్వాగతం పలికారు. శ్రీవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగ నాయకుల మండపంలో ప్రధాన న్యాయమూర్తికి వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, టిటిడి సివిఎస్వో గోపినాథ్‌జెట్టి, తిరుపతి అర్బన్ ఎస్పీ అన్బురాజన్ తదితరులు ఉన్నారు.

# త్వరలో సీట్ల సర్దుబాటు

- నెల్లూరు సభలో వామపక్ష నేతలు పి.మధు, కె.రామకృష్ణ



నెల్లూరులో అభివాదం చేస్తున్న సిపిఎం, సిపిఐ, జనసేన నాయకులు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

త్వరలో వామపక్షాలు, జనసేన కలిసి సీట్ల సర్దుబాట్లు చేసుకుంటాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు అన్నారు. ఆదివారం రాత్రి నెల్లూరులో నర్తకి సెంటర్‌లో జరిగిన నెల్లూరు నగర సమగ్రాభివృద్ధి కోసం జరిగిన బహిరంగ సభలో సిపిఎం, సిపిఐ, జనసేన నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రభుత్వ సొమ్ముతో చంద్రబాబునాయుడు సోకు చేస్తున్నారని, నాలుగున్నర సంవత్సరాలుగా గుర్తుకు రాని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు చంద్రబాబుకు ఇప్పుడే గుర్తొచ్చారా అని ప్రశ్నించారు. పసుపు-కుంకుమ కార్యక్రమాన్ని ఎన్నికల కోసం బాబు చేసే జిమ్మిక్కుగా అభివర్ణించారు. పేదలను గాలికొదిలేసిన బాబు ఇప్పుడు రాయితీల పేరుతో ఓట్లు దండుకునే పనిచేస్తున్నారన్నారు వైసిపి ప్రతిపక్షంగా వ్యవహరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. టిడిపి, వైసిపిగుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టేందుకు వామపక్షాలు, జనసేన కలిసి ప్రజల ముందుకొస్తున్నాయన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కెసిఆర్ పథకాలను కాపీ కొడుతున్నాయని విమర్శించారు. రాఫెల్ కుంభకోణంలో అనిల్ అంబానికీ రూ.30వేల కోట్లు లబ్ధి చేకూర్చేవిధంగా మోడీ సాయపడ్డారని తెలిపారు. రైతులకు రూ.6వేలు ఇస్తామని కేంద్రం ప్రకటించిందన్నారు. ఇదేమైనా భిక్షమా అని అన్నారు. ప్రజల పక్షాన ప్రజల కోసం మాట్లాడే నాయకులు రేపు అసెంబ్లీలో ఉండాలంటే వామపక్షాలు, జనసేన అభ్యర్థులను గెలిపించాల్సి ఉందన్నారు. ఈ సభకు సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు మూలం రమేష్, ఎస్‌కె మునీర్ అధ్యక్షత వహించారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు చంద్ర రాజగోపాల్, సిహెచ్ ప్రభాకర్, జనసేన నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, పి.టోనీ బాబు, తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షికులను ఆకర్షించాయి.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్నకెఎస్.చలం

## నేటికీ దారిద్ర్యరేఖకు దిగువనే దళితులు

### యుపిఎస్‌సి మాజీ చైర్మన్ కెఎస్.చలం

ప్రజాశక్తి-విశాఖపట్నం

నవ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా ఎస్‌సి, ఎస్‌టిల్లో 74 శాతం దారిద్ర్యరేఖకు దిగువన మగ్గుతున్నారని, విద్య అందుబాటులో లేని దళితులు 63 శాతం అక్షరానికి దూరంగా ఉన్నారని యుపిఎస్‌సి మాజీ చైర్మన్ కెఎస్.చలం అన్నారు. అంతకుముందు దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యాన ఆదివారం దళిత మేనిఫెస్టోను ఆయన విడుదల చేశారు. 17వ సార్వత్రిక ఎన్నికలు-దళిత మేనిఫెస్టోపై విశాఖ ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో వివిధ దళిత సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలం మాట్లాడుతూ, ఎస్‌సి, ఎస్‌టిలకు నాణ్యమైన విద్య ఉపాధి, ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో తగిన వాటా పురోగతికి భరోసా కల్పించేలా దళిత మేనిఫెస్టోతో వచ్చే రాజకీయ విలువలు గల పార్టీలను మాత్రమే దళిత పేటల్లోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల వేళ అంబేద్కర్ విగ్రహాలను దండలతో ముంచేవారు అవసరం లేదని, ఆయన ఆశయాన్ని ఆచరించే రాజకీయాలు దేశానికి అవసరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక, కర్షకులను విస్మరించిన పాలకులు

- సిపిఎం, సిపిఐ, జనసేనలను బలపరచండి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సభకు హాజరైన సిపిఎం, సిపిఐ, జనసేన కార్యకర్తలు, ప్రజలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు (కర్నూలు)

'కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ప్రాంత రైతాంగానికి రావాల్సిన ఎల్లెల్సీ నీటి వాటాను రప్పించడంలో పాలకులు పూర్తిగా విఫలం చెందారు. ఆర్‌డిఎస్ ద్వారా 4 టిఎంసిల నీటిని రాబట్టడంలో కూడా విఫలీకృతం అయ్యారు. ఈ ప్రాంత రైతాంగానికి మేలు జరగాలంటే వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులు నిర్మించాలని, కర్ణాటక ప్రాంతంలో తుంగభద్ర దిగువ కాలువ జల చౌర్యాన్ని అరికట్టాలి. ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని' సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ. గఫూరు డిమాండ్ చేశారు. ఆదివారం ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్లో సిపిఎం, సిపిఐ, జనసేన ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. అంతకుముందు ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ గ్రౌండ్ నుంచి సోమప్ప సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి అంబేద్కర్, సిపిఐ తాలూకా కార్యదర్శి పంపన్న గౌడ్, జనసేన నాయకులు ముత్తు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో గఫూర్ మాట్లాడారు. నోట్ల రద్దు, జిఎస్‌టి వల్ల 40 లక్షల ఉద్యోగాలు కోల్పోయారని తెలిపారు. ప్రధాని మోడీ సామాన్యులను, రైతులను, కార్మికులను విస్మరించి పెట్టుబడిదారులకు తొత్తుగా మారారని విమర్శించారు. నిరుద్యోగాన్ని, కరువును, వలసలను విస్మరించిన పాలకులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

వైసిపి నేత జగన్ ముఖ్యమంత్రి పీఠమే లక్ష్యంగా పని చేస్తున్నారని, ఆయనకు ప్రజాప్రయోజనాలు ఏనాడూ పట్టలేదని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీలను బలపరచాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమ అభివృద్ధిని విస్మరించారని, పట్టిసీమతో రాయలసీమకు ఒరింగిదేమీ లేదని అన్నారు. జనసేన జిల్లా కన్వీనర్ హర్షద్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను చంద్రబాబు విస్మరించారన్నారు. సిపిఎం పశ్చిమ ప్రాంత జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, జనసేన జిల్లా కన్వీనర్ హర్షద్, తాలూకా నాయకులు మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, బందే నవాజ్, ఎపి మహిళా సమాఖ్య నాయకులు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారు : రామకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

ప్రధాని మోడీ ఏ ముఖం పెట్టుకొని గుంటూరుకు వస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. కేంద్రం చివరి తాత్కాలిక బడ్జెట్‌లో కూడా ఏపీకి అన్యాయం జరిగిందన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయింపులు లేవని విమర్శించారు. రాజధాని శంకుస్థాపన రోజున మోడీ పిడికిడి మట్టి, ఖాళీ కుండలు చూపించి వెళ్లారని దుయ్యబట్టారు. ఈ నెల 10న రాష్ట్రానికి వస్తున్న మోడీకి ఖాళీకుండలతో నిరసన చేపట్టాలన్నారు. ఎన్నికల కోసమే చంద్రబాబు డ్వాక్రా సభ్యులకు రూ.పది వేలు, పింఛన్‌దారులకు ఇంకో రూ.వెయ్యి అదనంగా ఇస్తున్నారన్నారు. రాజధాని పేరుతో రైతుల వద్ద సేకరించిన రూ.పది వేల కోట్ల భూములను సింగపూర్ కంపెనీకి చంద్రబాబు ఇచ్చారని దుయ్యబట్టారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావుపై పలు విమర్శలు గుప్పించారు.

## వివాదాస్పదంగా ఇళ్ల స్థలాల పంపిణీ

### తన స్థలమని రైతు గొడవ - ప్రభుత్వ స్థలంగా కోర్టు ఆదేశాలు

### మనస్తాపంతో రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - మహానంది (కర్నూలు)

కర్నూలు జిల్లా మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదివారం చేపట్టిన ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. తహశీల్దార్ సుబ్బరాయుడు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుక్కాపురం గ్రామంలో మొత్తం 6 ఎకరాల స్థలం ప్రభుత్వ భూమిగా ఉన్నట్లు కోర్టు తేల్చింది. ఈ మేరకు తహశీల్దార్ మండలంలోని శ్రీనగరం గ్రామంలోని పేదలకు ఇందులో 29 సెంట్ల స్థలాన్ని ఇళ్ల స్థలాలకు కేటాయించారు. ఇదే స్థలంలో 1.5 ఎకరాలను బుక్కాపురం గ్రామానికి చెందిన రైతు రఘురామ్ ఈ స్థలాన్ని కొన్ని సంవత్సరాలుగా అనుభవిస్తున్నాడు. ఆదివారం ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమానికి ముందు రైతు అక్కడికి వచ్చి హల్‌చల్ చేశాడు. ఇది ప్రభుత్వ భూమి అని అధికారులు చెప్పినా వినకుండా గొడవకు దిగాడు. ఇది గమనించిన మహానంది ఎస్‌ఐ నాగతులసి ప్రసాద్ రైతుకు సర్ది చెప్పేందుకు ప్రయత్నించాడు. రైతు ఎస్‌ఐని, పోలీసులను దుర్భాషలాడారు. ఎస్‌ఐ రైతుపై చేయి చేసుకోవడంతో మనస్థాపం చెంది వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ఎస్‌ఐ రైతును నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## 15 నుంచి బస్సుయాత్ర : తులసిరెడ్డి

ప్రజాశక్తి-కడప ఏడురోడ్లు

రాబోయే ఎన్నికలు మరో స్వాతంత్ర్య సంగ్రామం లాంటివని పిసిసి ఉపాధ్యక్షులు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలు గాంధీ కుటుంబానికి, గాడ్సేవారసులకు మధ్య జరిగే మరో స్వాతంత్ర్య సంగ్రామంలాంటివని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలు, రాష్ట్రంలో విఫలమైన అధికార, ప్రతిపక్ష పార్టీల వైఖరిని ఎండగడుతూ ప్రజలకు వివరించేందుకు ఈ నెల 15 నుంచి ప్రజాయాత్ర పేరుతో బస్సుయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. యాత్ర అనంతపురం జిల్లా మడకశిర నుంచి ప్రారంభమై శ్రీకాకుళంలోని ఇచ్ఛాపురం వరకు 11 రోజులు పాటు కొనసాగుతుందన్నారు. యాత్రలో ఒక్కచోట ఎఐసిసి అధ్యక్షులు రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంక పాల్గొంటారని తెలిపారు.




**జవాబులు**

1.7.2
2.ఢిల్లీ
3.6.1
4.హైదరాబాద్
5.రాజీవ్ సక్సేనా, దీపక్ తల్వార్

## పేదలను మోసగిస్తున్న ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు



బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గుడివాడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మాటల గారడీ, వరాల జల్లులను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, రానున్న ఎన్నికల్లో ఆయా ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని సిపిఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కృష్ణాజిల్లా గుడివాడ ఎన్‌టిఆర్ స్టేడియం ఎదురుగా సిపిఎం, సిపిఐ, జనసేనల ఆధ్వర్యంలో బహిరంగ సభ సిపిఎం తూర్పు కృష్ణా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌సిపి.రెడ్డి అధ్యక్షతన జరిగింది. సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో అధికారంలోకి రావడానికి బిజెపి, టిడిపిలు తాయిలాలను ప్రకటించాయని, సంక్షేమం కావాలంటే తమ వల్లే సాధ్యమని నమ్మబలికి గెలిచాయని, కానీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాల్లో ఒక్కదాన్ని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. నిజాయితీపరుడని చెప్పుకుంటూ మోడీ నాలుగున్నరేళ్లలో దేశంలోనే అత్యంత అవినీతిపరుడిగా నిలిచారని తెలిపారు. పేదలకు భూములను పంచుతామన్న టిడిపి ఉన్న భూములను లాక్కుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షనేత జగన్ అసెంబ్లీకి వెళ్లి ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడకుండా పారిపోయాడన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ఏ పార్టీ అయినా డబ్బు పంపిణీ చేయకుండా ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేసి గెలవాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి నిత్యం పోరాడే సిపిఎం, సిపిఐ, జనసేన అభ్యర్థులను రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. తొలుత పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి పట్టణ పురవీధుల్లో భారీ ప్రజాప్రదర్శన నిర్వహించారు. సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, సిపిఎం తూర్పుకృష్ణా కార్యదర్శి ఆర్.రఘు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, సిపిఐ గుడివాడ, పామర్రు ఏరియా కార్యదర్శులు గూడపాటి ప్రకాష్‌బాబు, దగాని సంగీతరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మురాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిశోర్‌చంద్ర సూర్యనారాయణదేవ్

**ర్యాలీ**

## ఆర్టీసీ కార్మికుల మోటర్ సైకిల్ ర్యాలీ

### ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్



ప్రజాశక్తి - యంత్రాంగం

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జెఎసి నాయకులు ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఎనిమిది సంఘాలతో కూడిన జెఎసి ఆధ్వర్యంలో విజయవాడ పాత బస్‌స్టాండ్ నుంచి పిఎన్ బస్‌స్టేషన్ వరకు పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎస్‌డబ్ల్యుఎఫ్ కృష్ణా రీజియన్ కార్యదర్శి బిఆర్ రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు. ఆర్‌టిసి కార్మికులు పెద్దఎత్తున పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని నినదించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరిం చాలని ఉద్యోగ, కార్మిక జెఎసి ఆధ్వర్యంలో గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ నుండి బైక్ ర్యాలీ చేశారు. జెఎసి నాయకులు మాట్లాడుతూ 6న సమ్మె విజయవంతం చేసేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వ బెదిరింపులకు లొంగమని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండలో ఆర్టీసీ డిపో నుంచి కాంప్లెక్స్ వరకూ ఆర్‌టిసి కార్మికులు బైక్ ర్యాలీ చేశారు. ఆర్‌టిసి సమ్మె సన్నాహకాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. విశాఖలోని కూర్మన్నపాలెం డిపో పరిధిలో కూర్మన్నపాలెం, వడ్లపూడి, అగనంపూడిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం జిల్లా పొదిలి ఆర్టీసీ డిపోలో సమ్మె సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు పశ్చిమ ప్రకాశం కార్యదర్శి ఎం.రమేష్ ఈ ర్యాలీని జెండా ఊపి, ప్రారంభించారు.కర్నూలులో ఎపిఎస్‌ఆర్‌టిసి ఐక్యకూటమి ఆధ్వర్యంలో సమ్మెకు మద్దతుగా బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెండో కర్నూలు డిపో కార్యదర్శి మహేశ్వరరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, సుధాకర్, వేణుగోపాల్, రీజనల్ ప్రచార కార్యదర్శి వలి, వర్కింగ్ ప్రెసిడెంట్ షమివుల్లా, రామాంజనేయులు, శంకర్, ఈశ్వర్, ఎస్ఆర్‌కెరెడ్డి (ఎస్‌డబ్ల్యుఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-మైదుకూరు(కడప)

కడప జిల్లా మైదుకూరు మండలం వడ్డమానుబాట పరిధిలోని అడవుల్లో ఆదివారం టాస్క్ ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. 16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఐజి కాంతారావు, ఆపరేషన్స్ ఎస్‌పి రవిశంకర్ ఆదేశాల మేరకు తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ బాషా టీం కూంబింగ్ నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. అడవిలో స్మగ్లర్లు పోలీసులను చూసి పరారు కావడంతో రవాణాకు సిద్ధంగా ఉన్న దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో టిటిడి తిరుమల జెఈఓ కెఎస్ శ్రీనివాసరాజు ఆదివారం పరిశీలన చేపట్టారు. 17వ కంపార్ట్‌మెంట్‌లోని ఎల్ఇడి తెరలను పరిశీలించి యాత్రికులకు మరింత ఉపయోగకరమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎస్ఇ ఎలక్ట్రికల్స్ వేంకటేశ్వర్లు, ఆలయ డిప్యూటి ఈఓ హరీంద్రనాథ్, విఎస్వో మనోహర్, డిఇ సరస్వతి, డెప్యూటి ఇఇ రమాదేవి, ఇడిపి ఓఎస్డి భాస్కర్ , ఎవిఎస్వో గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు కిశోర్ చంద్రదేవ్ రాజీనామా

### బిజెపిని ఓడించడమే నా అజెండా

ప్రజాశక్తి- కురుపాం(విజయనగరం)

విజయనగరం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్‌చంద్ర సూర్యనారాయణదేవ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 45 ఏళ్ల తన రాజకీయ ప్రస్థానంలో కాంగ్రెస్‌తో ఉంటూ, ఎన్నో సేవలందించిన తాను నేడు రాజీనామా చేయడం బాధాకరమైనా, తప్పడం లేదని చెప్పారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేయడానికి కొన్ని శక్తులు పని చేస్తున్నాయని, అందుకే తాను బయటకు వస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ రూపొందించిన రాష్ట్ర విభజన చట్టంలో అనేక లోపాలున్నాయని తెలిపారు. కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయాల వల్ల రాష్ట్రంలో పార్టీకి భవిష్యత్తు కనిపించడం లేదన్నారు. నైతిక విలువలు కలిగిన వాడిని కాబట్టే ఇంతవరకు తాను ఏ పార్టీలోకీ వెళ్లలేదని పేర్కొన్నారు. నాలుగు నెలలుగా కాంగ్రెస్‌లో జరుగుతున్న పార్టీ వ్యతిరేక చర్యలను ఎత్తిచూపుతూ అధిష్టానానికి తెలియజేసినా, ఎటువంటి స్పందనా లేనందున మనస్తాపంతో పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, కాంగ్రెస్ జాతీయ ఆదివాసీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా వల్ల దేశంతో పాటు రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. బిజెపిని ఓడిస్తేనే దేశం అభివద్ధి చెందుతుందని, అందుకు తాను సర్వశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. అందుకు కలిసి వచ్చే పార్టీలతో ఈ నెల 6, 7 తేదీల్లో ఢిల్లీలో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. 'టిడిపిలో చేరుతారా?' అని విలేకర్లు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ, ఏ పార్టీలో చేరేదీ తర్వాత వెల్లడిస్తానని, బిజెపిని ఓడించడమే తన లక్ష్యమని చెప్పారు.

## ప్రతిభ పరీక్షకు 825 మంది హాజరు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విష్ణు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుముదవల్లిలో నాలెడ్జ్ సెంటర్ సేవలను వినియోగించుకుంటున్న విద్యార్థులకు ఆదివారం విష్ణు స్కూల్లో ప్రతిభ పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఆర్.సత్యమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం పరిసర ప్రాంతంలో ఉన్న 22 ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు 825 మంది ఈ పరీక్షకు హాజరయ్యారన్నారు. ఈ పరీక్ష గణితం, సైన్స్, సోషల్, కంప్యూటర్స్, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో నిర్వహించామన్నారు.

## ఓట్ల కోసమే తాయిలాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పసుపు, కుంకుమ, పించన్ల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమమా, టిడిపి కార్యక్రమమా అని సిపిఎం నాయకులు శుక్లబోయిన రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల సమీపిస్తుండడంతో హడావిడిగా పించన్లు, చెక్కులు పంపిణీ చేస్తున్నారన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో అధికారులకు ప్రాధాన్యతనివ్వకుండా పార్టీ నాయకులతో నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి ఆకుల దుర్గారావు, బిల్లిమిల్లి శాఖ కార్యదర్శి పూనేం అమ్ములు, మహాదేవపురం శాఖ కార్యదర్శి సోదేం దుర్గారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రాంబాబు, రైసు మిల్లు అండ్ బజారు జట్లు వర్కర్సు పాల్గొన్నారు.

## తప్పని పడిగాపులు

ప్రజాశక్తి - వీరవాసరం

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్‌లు తీసుకోవడానికి ఇంకా ఒక్క రోజు గడువు ఉండడంతో లబ్ధిదారులతో పింఛన్ల పంపిణీ ప్రాంతమంతా కిక్కిరిసి పోయింది. దీంతో కూర్చోవడానికి స్థలం లేకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. మైనర్ పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ సాఫీగా జరిగినప్పటికీ మేజర్ పంచాయతీల్లో మాత్రం లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. స్థానిక ఎంఎల్ఎ అంజిబాబు సాయంత్రం సభలకు హాజరవడంతో లబ్ధిదారులు మరిన్ని ఇబ్బందులు లబ్ధిదారులు ఎదుర్కొన్నారు. మేజర్ పంచాయతీల్లో మధ్యాహ్నం మూడు గంటలకు కేవలం ఆరవై శాతం మాత్రమే పెన్షన్ బట్వాడా చేయడంతో మిగిలిన లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. మండలంలో భోజనం ఏర్పాటులో గందరగోళ పరిస్థితి నెలకొంది. కేవలం పింఛను తీసుకున్న వారికి మాత్రమే భోజనం అందజేయడంతో టిడిపి నాయకులపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సిఐ రాజేష్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - చింతలపూడి

రెండు సంవత్సరాల పాటు సిఐగా సేవలందించిన పి.రాజేష్‌కు సెయింట్ పౌల్స్ సిఎస్ఐ లూథరన్ చర్చికు మంచి సాన్నిహిత్యం ఉందని ఆ చర్చి పాస్టర్ రెవరెండ్ పిజె వినోద్‌కుమార్ అన్నారు. పట్టణ సిఐగా పనిచేసిన రాజేష్ బదిలీపై వెళుతుండడంతో ఆయన సతీమణితో భోయగూడెంలోని సిఎస్ఐ చర్చిలో సంఘసభ్యులు, గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ చర్చి అభివృద్ధికి రాజేష్ చేసిన సేవలు మరువలేమన్నారు. ఆదివారం క్రమతప్పకుండా ప్రార్థనలో పాల్గొనేవారన్నారు. అనంతరం సిఐ పి.రాజేష్ మాట్లడూతూ మండలంలోని ప్రజల ప్రేమానురాగాలు మరువలేమన్నారు. తన కుటుంబాన్ని ఆప్యాయతతో ఆదరించిన సంఘాన్ని, సభ్యులను మరువలేమని ఇందుకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానన్నారు.

## చింతలపూడి ఎంఎసి మాజీ చైర్మన్ వీరేంద్రనాథ్ మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

ఎఎంసి మాజీ చైర్మన్ పి.వీరేంద్రనాథ్(70) ఆదివారం అనారోగ్యంతో మరణించారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని తన కొడుకు వద్ద ఉంటూ చికిత్స తీసుకుంటున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం మృతిచెందినట్లు మృతుని బంధువులు తెలిపారు. వీరేంద్రనాథ్ 2001 సంవత్సరంలో చింతలపూడి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. మతదేహన్ని స్వగ్రామానికి తీసుకొస్తున్నట్లు మృతుని బంధువులు తెలిపారు.

## 'దాతల సహకారం అవసరం'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి దాతల సహకరించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాటకశాల వెంకటరాజు అన్నారు. ఆదివారం మండలంలోని బయ్యనగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి వెయ్యి సిరంజీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతల సహకారం అవసరమన్నారు. ఆసుపత్రుల్లో చిన్న సమస్యలతో రోగులు మెరుగైన వైద్య సేవలు వినియోగించుకోలేక పోతున్నారన్నారు. దీంతో దాతలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

---

రికా నెం.2672/18/జి1/తే.17.12.18 కలెక్టరు వారి కార్యాలయం, శ్రీకాకుళం

ఫారం -VI (ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం [illegible] సెక్షన్11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 10, సబ్‌రూల్ (1)ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

[illegible] శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామము [illegible] కి.మీ.22.200 నుండి కి.మీ.29.100 వరకు [illegible] 2013వ సంవత్సరము 30వ చట్టం [illegible] సెక్షన్ 11(1) [illegible]

[illegible] సెక్షన్ 12 [illegible] యూనిట్-4, [illegible]

[illegible] సెక్షన్ 11(4) [illegible]

[illegible] సెక్షన్ 15 [illegible] 60 (అరువది) [illegible]

షెడ్యూలు

జిల్లా: శ్రీకాకుళం మండలం : సరుబుజ్జిలి గ్రామము: పురుషోత్తపురం

| వరుస సంఖ్య | సర్వే నం. సబ్ డివిజన్ | భూమి స్వభావము | మొత్తం విస్తీర్ణం ఎకరాలలో | భూసేకరణ విస్తీర్ణం ఎకరాలలో | అనుభవదారుని పేరు | హద్దులు: ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు మరియు కట్టడముల వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 220-1 | పల్లం | 0.93 | 0.46 | [illegible] | V.No.349 Venkatapuram | 1A | 2B1 | 1B2 | |
| 2 | 220-2 | పల్లం | 0.46 | 0.20 | [illegible] | 1B1 | 1A | 3B1 | 2B2 | |
| 3 | 220-3 | పల్లం | 0.47 | 0.19 | [illegible] | 2B1 | 1A | 4B1 | 3B2 | |
| 4 | 220-4 | పల్లం | 0.56 | 0.21 | [illegible] | 3B1 | 3B2 | 5B1 | 4B2 | |
| 5 | 220-5 | పల్లం | 0.31 | 0.14 | [illegible] | 4B1 | 1A | 5B1 | 4B2 | |
| 6 | 220-6 | పల్లం | 0.44 | 0.22 | [illegible] | 5B1 | 1A | 7B1 | 6B2 | |
| 7 | 220-7 | పల్లం | 0.48 | 0.20 | [illegible] | 6B1 | 1A | 221/1C1 | 7B2 | |
| 8 | 221-1 | పల్లం | 1.36 | 0.46 | [illegible] | 220/7B1 | 1A | 2B | 1C2 | |
| 9 | 221-2 | పల్లం | 0.17 | 0.17 | [illegible] | 1C1 | 1A | 3B, 6A | 6B2 | |
| 10 | 221-3 | పల్లం | 0.26 | 0.26 | [illegible] | 2B | 1A | 4B1 | 6A | |
| 11 | 221-4 | పల్లం | 0.40 | 0.28 | [illegible] | 3B | 1A | 5B1 | 4B2 | |
| 12 | 221-5 | పల్లం | 0.38 | 0.26 | [illegible] | 4B1 | 1A | 223/1C1 | 5B2 | |
| 13 | 221-6 | పల్లం | 0.35 | 0.11 | [illegible] | 2B | 3B | 4B1 | 6B | |
| 14 | 223-1 | పల్లం | 0.98 | 0.55 | [illegible] | 221/5B1 | 1A | 2B1 | 1C2 | |
| 15 | 223-2 | పల్లం | 1.01 | 0.58 | [illegible] | 1C1 | 1A | 3B1 | 2B2 | |
| 16 | 223-3 | పల్లం | 1.30 | 0.53 | [illegible] | 2B1 | 1A | 4B1 | 3B2 | |
| 17 | 223-4 | పల్లం | 0.33 | 0.11 | [illegible] | 3B1 | 1A | 5B1 | 4B2 | |
| 18 | 223-5 | పల్లం | 0.58 | 0.24 | [illegible] | 4B1 | 1A | 6B1 | 5B2 | |
| 19 | 223-6 | పల్లం | 0.27 | 0.12 | [illegible] | 5B1 | 1A | 224/1B1 | 6B2 | |
| 20 | 224-1 | పల్లం | 1.15 | 0.44 | [illegible] | 223/6B1 | 1A | 2B,3A | 1B2 | |
| 21 | 224-2 | పల్లం | 0.23 | 0.23 | [illegible] | 1B1 | 1A | 4B1 | 3A | |
| 22 | 224-3 | పల్లం | 0.44 | 0.04 | [illegible] | 1B1 | 2B | 4B1 | 3B | |
| 23 | 224-4 | పల్లం | 0.68 | 0.28 | [illegible] | 2B,3A | 1A | 5B1 | 4B2 | |
| 24 | 224-5 | పల్లం | 0.54 | 0.22 | [illegible] | 4B1 | 1A | 6B1 | 5B2 | |
| 25 | 224-6 | పల్లం | 0.49 | 0.22 | [illegible] | 5B1 | 1A | 7B1 | 6B2 | |
| 26 | 224-7 | పల్లం | 1.15 | 0.44 | [illegible] | 6B1 | 1A | 226/1B1 | 7B2 | |
| 27 | 226-1 | పల్లం | 1.59 | 0.49 | [illegible] | 224/7B1 | 1A | 2B1 | 1B2 | |
| 28 | 226-2 | పల్లం | 1.77 | 0.55 | [illegible] | 1B1 | 1A | 361 | 2B2 | |
| 29 | 226-3 | పల్లం | 1.36 | 0.49 | [illegible] | 2B1 | 1A | 233/2 | 3C2 | |
| 30 | 263-1 | పల్లం | 0.56 | 0.23 | [illegible] | 255/2 | 1A | 2B | 1C | |
| 31 | 263-2 | పల్లం | 1.15 | 0.44 | [illegible] | 1B | 2A | 3B | 262/1A | |
| 32 | 263-3 | పల్లం | 0.46 | 0.22 | [illegible] | 2B | 3A | 9B | 262/1A | |
| 33 | 263-9 | పల్లం | 1.23 | 0.61 | [illegible] | 3B | 9A | 10B | 9C | |
| 34 | 263-10 | పల్లం | 0.50 | 0.44 | [illegible] | 9B | 10A | 11B | 12B | |
| 35 | 263-11 | పల్లం | 0.24 | 0.17 | [illegible] | 10B | 11B | 266 | 12B | |
| 36 | 263-12 | పల్లం | 0.25 | 0.21 | [illegible] | 12A | 10B,11B | 266/2 | 262/7A | |
| 37 | 266-1 | పల్లం | 0.80 | 0.32 | [illegible] | 263/11B | 1A | 3B | 262/9A | |
| 38 | 266-3 | పల్లం | 0.14 | 0.09 | [illegible] | 1B | 13A | 4B | 262/9A | |
| 39 | 266-4 | పల్లం | 0.20 | 0.06 | [illegible] | 3B | 6A | 6B | 262/10A | |
| 40 | 266-5 | పల్లం | 0.49 | 0.02 | [illegible] | 4B | 6A | 8B | 262/10A | |
| 41 | 266-8 | పల్లం | 0.40 | 0.01 | [illegible] | 6B | 8A | 262 | 262 | |
| 42 | 262-1 | పల్లం | 0.72 | 0.06 | [illegible] | 263/2 | 263/2B | 263 | 1B | |
| 43 | 262-7 | పల్లం | 0.22 | 0.02 | [illegible] | 7B | 263/12B | 8A | 7B | |
| 44 | 262-8 | పల్లం | 0.26 | 0.05 | [illegible] | 7A | 263/12B | 9A | 8B | |
| 45 | 262-9 | పల్లం | 1.03 | 0.34 | [illegible] | 8A | 266/1B,3B | 10A | 9B | |
| 46 | 262-10 | పల్లం | 0.63 | 0.28 | [illegible] | 9A | 266/4B,6B | 11B | 10B | |
| 47 | 262-11 | పల్లం | 0.65 | 0.35 | [illegible] | 10A | 11A | 12B | 11C | |
| 48 | 262-12 | పల్లం | 0.73 | 0.36 | [illegible] | 11B | 12A | 269/1B | 12C | |
| 49 | 269-1 | పల్లం | 0.53 | 0.26 | [illegible] | 262 | 1A | 2B | 1C | |
| 50 | 269-2 | పల్లం | 0.55 | 0.24 | [illegible] | 1B | 2A | 3B | 2C | |
| 51 | 269-3 | పల్లం | 1.19 | 0.55 | [illegible] | 2B | 3A | 4B,8A | 3C | |
| 52 | 269-4 | పల్లం | 0.75 | 0.21 | [illegible] | 3B | 4A | 270/1B | 8A | |
| 53 | 269-8 | పల్లం | 0.52 | 0.32 | [illegible] | 3B | 4B | 270/2B | 8B | |
| 54 | 270-1 | పల్లం | 0.52 | 0.02 | [illegible] | 269/4B | 1A | 2B | 2B | |
| 55 | 270-3 | పల్లం | 0.92 | 0.08 | [illegible] | 2B | 3A | 7B | 2B,8B | |
| 56 | 270-2 | పల్లం | 0.28 | 0.21 | [illegible] | 269/8A | 1B | 3B,8B | 2C | |
| 57 | 270-7 | పల్లం | 0.42 | 0.07 | [illegible] | 3B | 7A | 8B | 8B | |
| 58 | 270-8 | పల్లం | 0.61 | 0.52 | [illegible] | 2B | 7B | 9B | 8C | |
| 59 | 270-9 | పల్లం | 0.68 | 0.55 | [illegible] | 8B | 9A | 10B | 323/2 | |
| 60 | 270-10 | పల్లం | 2.56 | 0.30 | [illegible] | 9B | 10A | 273/7A,2B | 323/2 | |
| 61 | 273-2 | పల్లం | 0.10 | 0.06 | [illegible] | 270/10B | 2A | 6A | 7A | |
| 62 | 273-5 | పల్లం | 0.03 | 0.01 | [illegible] | 2B | 5A | 5A | 6A | |
| 63 | 273-6 | పల్లం | 0.03 | 0.01 | [illegible] | 2B | 5B | 6B | 7A | |
| 64 | 273-7 | పల్లం | 0.28 | 0.11 | [illegible] | 270/10B | 7B | 7B | 323/2 | |
| 65 | 325-4 | పల్లం | 0.27 | 0.20 | [illegible] | 4A | 324/3 | 8 | 5B | [illegible] |
| 66 | 325-6 | పల్లం | 0.04 | 0.04 | [illegible] | 5B | 7 | 11 | 661 | [illegible] |
| 67 | 325-7 | పల్లం | 0.22 | 0.22 | [illegible] | 5B | 8 | 10 | 6,11 | [illegible] |
| 68 | 325-8 | పల్లం | 0.23 | 0.23 | [illegible] | 4B | 424/3 | 9 | 7 | [illegible] |
| 69 | 325-9 | మెట్ట | 0.13 | 0.13 | [illegible] | 8 | 324/3 | 324/3 | 10 | [illegible] |
| 70 | 325-10 | పల్లం | 0.26 | 0.26 | [illegible] | 7 | 9 | 327 | 12,13 | [illegible] |
| 71 | 325-11 | పల్లం | 0.12 | 0.12 | [illegible] | 6 | 7 | 12 | 661 | [illegible] |
| 72 | 325-12 | పల్లం | 0.14 | 0.14 | [illegible] | 11 | 10 | 13 | 661 | [illegible] |
| 73 | 325-13 | పల్లం | 0.23 | 0.23 | [illegible] | 12 | 10 | 326/1B | 661 | [illegible] |
| 74 | 326-1 | మెట్ట | 0.06 | 0.04 | [illegible] | 325/13 | 1A | 3B | 1C | [illegible] |
| 75 | 326-3 | మెట్ట | 0.09 | 0.02 | [illegible] | 1B | 3A | 4B | 3C, | [illegible] |
| 76 | 326-4 | మెట్ట | 0.22 | 0.06 | [illegible] | 3B | 4A | 5B | 4C | [illegible] |
| 77 | 326-5 | మెట్ట | 0.07 | 0.03 | [illegible] | 4B | 5A | 8B | 5C | [illegible] |
| 78 | 326-8 | మెట్ట | 0.06 | 0.02 | [illegible] | 5B | 8A | 9B | 8C | |
| 79 | 326-9 | మెట్ట | 0.11 | 0.05 | [illegible] | 8B | 9A | 11B | 9C | |
| 80 | 326-10 | మెట్ట | 0.14 | 0.01 | [illegible] | 9B | 9B | 11B | 10B | |
| 81 | 326-11 | పల్లం | 0.25 | 0.05 | [illegible] | 9B | 11A | 12B | 11C | [illegible] |
| 82 | 326-12 | పల్లం | 0.10 | 0.05 | [illegible] | 11B | 12A | 14B | 12C | |
| 83 | 326-15 | మెట్ట | 0.36 | 0.10 | [illegible] | 14B | 15A | 16B | 15C | |
| 84 | 326-16 | మెట్ట | 0.18 | 0.05 | [illegible] | 15B | 16A | 17B | 16C | [illegible] |
| 85 | 326-17 | మెట్ట | 0.40 | 0.10 | [illegible] | 16B | 17A | 18B | 17C | |
| 86 | 329-1 | మెట్ట | 0.57 | 0.15 | [illegible] | 326/18B | 1A | 2B | 663 | [illegible] |
| 87 | 329-2 | మెట్ట | 0.52 | 0.15 | [illegible] | 1B | 2A | 3B | 663 | |
| 88 | 329-3 | మెట్ట | 0.19 | 0.06 | [illegible] | 2B | 3A | 4B | 663 | [illegible] |
| 89 | 329-4 | మెట్ట | 0.23 | 0.08 | [illegible] | 3B | 4A | 5B | 663 | |
| 90 | 329-5 | మెట్ట | 0.27 | 0.10 | [illegible] | 4B | 5A | 6B | 663 | |
| 91 | 329-6 | మెట్ట | 0.31 | 0.11 | [illegible] | 5B | 6A | 7B | 663 | [illegible] |
| 92 | 329-7 | మెట్ట | 0.73 | 0.27 | [illegible] | 6B | 7A | 8B | 663 | [illegible] |
| 93 | 329-8 | మెట్ట | 0.09 | 0.06 | [illegible] | 7B | 8A | 9B | 663 | [illegible] |
| 94 | 329-9 | మెట్ట | 0.12 | 0.08 | [illegible] | 8B | 9A | 10B | 663 | [illegible] |
| 95 | 329-10 | మెట్ట | 0.26 | 0.06 | [illegible] | 9B | 10A | 13B | 663 | [illegible] |
| 96 | 329-13 | మెట్ట | 0.40 | 0.18 | [illegible] | 10B | 13A | 14B | 663 | [illegible] |
| 97 | 329-14 | మెట్ట | 0.34 | 0.09 | [illegible] | 13B | 14A | 335/25 | 663 | [illegible] |
| 98 | 330-22 | మెట్ట | 0.04 | 0.01 | [illegible] | 329 | 22B | 22B | 23A | [illegible] |
| 99 | 330-23 | మెట్ట | 0.04 | 0.03 | [illegible] | 329 | 22A | 22B | 24 | [illegible] |
| 100 | 330-24 | మెట్ట | 0.05 | 0.05 | [illegible] | 329 | 23A | 26B | 25 | |
| 101 | 330-25 | మెట్ట | 0.10 | 0.10 | [illegible] | 329 | 24 | 26B | 663 | [illegible] |
| 102 | 330-26 | మెట్ట | 0.04 | 0.02 | [illegible] | 24,25 | 26A | 27B | 663 | [illegible] |
| 103 | 330-27 | మెట్ట | 0.03 | 0.02 | [illegible] | 26B | 27A | 28B | 663 | |
| 104 | 330-28 | మెట్ట | 0.03 | 0.02 | [illegible] | 27B | 28A | 29B | 663 | |
| 105 | 330-29 | మెట్ట | 0.06 | 0.03 | [illegible] | 28B | 29A | 30B | 663 | |
| 106 | 330-30 | మెట్ట | 0.05 | 0.02 | [illegible] | 29B | 30A | 31B | 663 | [illegible] |
| 107 | 330-31 | మెట్ట | 0.05 | 0.03 | [illegible] | 30B | 31A | 331 | 663 | |
| 108 | 331-15 | మెట్ట | 0.09 | 0.05 | [illegible] | Vamsdhara River, 330 | 16A | 17B | RIVER | [illegible] |
| 109 | 331-17 | మెట్ట | 0.07 | 0.06 | [illegible] | 16B | 17A | 18B | RIVER | |
| 110 | 331-19 | మెట్ట | 0.09 | 0.05 | [illegible] | 17B | 18A | 19B | RIVER | [illegible] |
| 111 | 331-19 | మెట్ట | 0.15 | 0.08 | [illegible] | 18B | 19A | 20B | RIVER | [illegible] |
| 112 | 331-20 | మెట్ట | 0.07 | 0.04 | [illegible] | 19B | 20A | 21B | RIVER | |
| 113 | 331-21 | మెట్ట | 0.26 | 0.14 | [illegible] | 20B | 21A | 23B | RIVER | [illegible] |
| 114 | 331-23 | మెట్ట | 0.22 | 0.10 | [illegible] | 21B | 23A | 24B | RIVER | [illegible] |
| 115 | 331-24 | మెట్ట | 0.11 | 0.04 | [illegible] | 23B | 24A | 25B | RIVER | [illegible] |
| 116 | 331-25 | మెట్ట | 0.13 | 0.05 | [illegible] | 24B | 25A | 26B | RIVER | [illegible] |
| 117 | 331-26 | మెట్ట | 0.12 | 0.04 | [illegible] | 25B | 26A | 27B | RIVER | [illegible] |
| 118 | 331-27 | మెట్ట | 0.09 | 0.04 | [illegible] | 26B | 27A | 29B | RIVER | [illegible] |
| 119 | 331-29 | మెట్ట | 0.21 | 0.06 | [illegible] | 27B | 29A | 332 | RIVER | [illegible] |
| 120 | 332-2 | మెట్ట | 0.03 | 0.03 | [illegible] | 331 | 1B | 3B | 663 | [illegible] |
| 121 | 332-3 | మెట్ట | 0.06 | 0.04 | [illegible] | 1B,2 | 3A | 4B | 663 | [illegible] |
| 122 | 332-4 | మెట్ట | 0.07 | 0.04 | [illegible] | 3B | 4A | 5B | 663 | [illegible] |
| 123 | 332-5 | మెట్ట | 0.08 | 0.04 | [illegible] | 4B | 5A | 6B | 663 | [illegible] |
| 124 | 332-6 | మెట్ట | 0.08 | 0.04 | [illegible] | 5B | 6A | 11B | 663 | [illegible] |
| 125 | 332-11 | మెట్ట | 0.18 | 0.10 | [illegible] | 6B | 11A | 12B | 663 | [illegible] |
| 126 | 332-12 | మెట్ట | 0.28 | 0.16 | [illegible] | 11B | 12A | 13B | 663 | [illegible] |
| 127 | 332-13 | మెట్ట | 0.05 | 0.02 | [illegible] | 12B | 13A | 17B | 663 | |
| 128 | 332-17 | మెట్ట | 0.09 | 0.04 | [illegible] | 13B | 17A | 18B | 663 | [illegible] |
| 129 | 332-18 | మెట్ట | 0.05 | 0.03 | [illegible] | 17B | 18A | 19B | 663 | |
| 130 | 332-19 | మెట్ట | 0.09 | 0.05 | [illegible] | 18B | 19A | 28 | 663 | [illegible] |
| 131 | 332-28 | మెట్ట | 0.06 | 0.06 | [illegible] | 19B | 19A,27 | 29 | | [illegible] |
| 132 | 332-29 | మెట్ట | 0.04 | 0.04 | [illegible] | 28 | 27 | 30 | 663 | [illegible] |
| 133 | 332-30 | మెట్ట | 0.04 | 0.04 | [illegible] | 29 | 27 | 663 | 663 | [illegible] |
| 134 | 333-12 | మెట్ట | 0.06 | 0.02 | [illegible] | 663 | 12A | 13B | 663 | [illegible] |
| 135 | 333-13 | మెట్ట | 0.12 | 0.03 | [illegible] | 12B | 13A | 14B | 663 | [illegible] |
| 136 | 333-14 | మెట్ట | 0.12 | 0.04 | [illegible] | 13B | 14A | 15B | 663 | [illegible] |
| 137 | 333-15 | మెట్ట | 0.14 | 0.05 | [illegible] | 14B | 15A | 334/17B | 663 | [illegible] |
| 138 | 334-17 | మెట్ట | 0.12 | 0.03 | [illegible] | 333/15B | 17A | 18B | 663 | [illegible] |
| 139 | 334-18 | మెట్ట | 0.10 | 0.03 | [illegible] | 17B | 18A | 19B | 663 | [illegible] |
| 140 | 334-19 | మెట్ట | 0.12 | 0.03 | [illegible] | 18B | 19A | 20B | 663 | [illegible] |
| 141 | 334-20 | మెట్ట | 0.14 | 0.03 | [illegible] | 19B | 20A | 29B | 663 | [illegible] |
| 142 | 335-13 | మెట్ట | 0.12 | 0.07 | [illegible] | 333/29B | 13A | 12B | 13C, 663 | [illegible] |
| 143 | 335-12 | పల్లం | 0.07 | 0.03 | [illegible] | 13B | 12A | 11A | 12C | |
| 144 | 335-11 | పల్లం | 0.08 | 0.04 | [illegible] | 12B | 334/25 | 10 | 11B | |
| 145 | 335-7 | పల్లం | 0.20 | 0.03 | [illegible] | 334/21 | 7A | 7A | 8 | |
| 146 | 335-8 | పల్లం | 0.08 | 0.08 | [illegible] | 334/24 | 7B | 15B | 9 | [illegible] |
| 147 | 335-9 | పల్లం | 0.08 | 0.08 | [illegible] | 334/25 | 8 | 15B | 10 | |
| 148 | 335-10 | పల్లం | 0.23 | 0.23 | [illegible] | 11A | 9 | 15B | 14A | |
| 149 | 335-14 | పల్లం | 0.32 | 0.26 | [illegible] | 11B | 10,15B | 22B | 14B | |
| 150 | 335-15 | పల్లం | 0.53 | 0.31 | [illegible] | 8,9,10 | 15A | 21B, 22B | 14A | [illegible] |
| 151 | 335-21 | పల్లం | 0.47 | 0.09 | [illegible] | 15B | 21A | 22A | 22B | |
| 152 | 335-22 | పల్లం | 0.71 | 0.68 | [illegible] | 15B,14A | 21B, 21A | 336/3A | 22C | |
| 153 | 336-3 | పల్లం | 0.29 | 0.28 | [illegible] | 335/22B | 2,1 | 5B,4A | 3B | [illegible] |
| 154 | 336-2 | పల్లం | 0.02 | 0.02 | [illegible] | 3A | 1 | 5B | 3A | |
| 155 | 336-4 | పల్లం | 0.07 | 0.06 | [illegible] | 3A | 5B | 7A | 4B | [illegible] |
| 156 | 336-5 | పల్లం | 0.14 | 0.13 | [illegible] | 3A | 5A | 6B | 4A | |

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 157 | 336-6అ | పల్లం | 0.15 | 0.12 | [illegible] | 5B | 6A | 8B | 7A | |
| 158 | 336-7ఎ | పల్లం | 0.14 | 0.11 | [illegible] | 4A | 6B,8B | 9B | 7B | |
| 159 | 336-8అ | పల్లం | 0.08 | 0.06 | [illegible] | 6B | 8A | 9B | 7A | |
| 160 | 336-9అ | పల్లం | 0.07 | 0.05 | [illegible] | 8B | 9A | 10B | 9C | |
| 161 | 336-10అ | పల్లం | 0.06 | 0.04 | [illegible] | 9B | 10A | 11B, 13 | 10C | |
| 162 | 336-11అ | పల్లం | 0.03 | 0.02 | [illegible] | 10B | 12A | 13A | 13B | |
| 163 | 336-12అ | పల్లం | 0.02 | 0.01 | [illegible] | 11B | 12A | 15B | 13A | |
| 164 | 336-13ఎ | పల్లం | 0.07 | 0.06 | [illegible] | 10B | 11B,12B | 14A | 13B | |
| 165 | 336-14ఎ | పల్లం | 0.05 | 0.04 | [illegible] | 13A | 15B | 16B | 14B | |
| 166 | 336-15అ | పల్లం | 0.04 | 0.02 | [illegible] | 12B, 13A | 15A | 16B | 14A | |
| 167 | 336-16అ | పల్లం | 0.30 | 0.29 | [illegible] | 15B,14A | 16A | 18B | 17B | |
| 168 | 336-17ఎ | పల్లం | 0.06 | 0.02 | [illegible] | 14A | 16B | 18B | 17B | |
| 169 | 336-18అ | పల్లం | 0.39 | 0.31 | [illegible] | 16B | 18A | 19B | 18C | |
| 170 | 336-19అ | పల్లం | 0.74 | 0.60 | [illegible] | 18B | 19A | 20B | 19C | |
| 171 | 336-20అ | పల్లం | 0.50 | 0.42 | [illegible] | 19B | 20A | 21B | 663 | |
| 172 | 336-21అ | పల్లం | 0.27 | 0.22 | [illegible] | 20B | 21A | 22B | 663 | |
| 173 | 336-22అ | పల్లం | 0.28 | 0.22 | [illegible] | 21B | 22A | 23B | 663 | |
| 174 | 336-23అ | పల్లం | 0.60 | 0.51 | [illegible] | 22B | 23A | 356 | 23C | |
| 175 | 356-2అ | మెట్ట | 0.35 | 0.31 | [illegible] | 336/ 23B | 2A1 | 5 | 3 | |
| 176 | 356-3 | పల్లం | 0.19 | 0.19 | [illegible] | 336/ 23B | 2B | 4 | 663, 11B | |
| 177 | 356-4 | పల్లం | 0.15 | 0.15 | [illegible] | 3 | 5 | 7B | 11B | |
| 178 | 356-5 | మెట్ట | 0.20 | 0.20 | [illegible] | 2B | 1 | 6 | 4 | |
| 179 | 356-6 | పల్లం | 0.06 | 0.06 | [illegible] | 5 | 1 | 7B | 7B | |
| 180 | 356-7అ | పల్లం | 0.26 | 0.25 | [illegible] | 6 | 7A | 8B | 11B | |
| 181 | 356-8అ | పల్లం | 0.16 | 0.14 | [illegible] | 7B | 8A | 9B,10B | 11B | |
| 182 | 356-9అ | పల్లం | 0.57 | 0.28 | [illegible] | 8B | 9A | 10B | 10B | |
| 183 | 356-10అ | పల్లం | 0.49 | 0.43 | [illegible] | 8B | 9B | 352 | 11B | |
| 184 | 356-11అ | పల్లం | 0.52 | 0.49 | [illegible] | 11A | 3,4,7B,8B,10B | 357 | 663 | |
| 185 | 357-2అ | పల్లం | 0.22 | 0.15 | [illegible] | 356/ 10B,11B | 2A1 | 3B | 663 | |
| 186 | 357-3అ | పల్లం | 0.22 | 0.15 | [illegible] | 2B | 3A | 4B | 663 | |
| 187 | 357-4అ | పల్లం | 0.79 | 0.55 | [illegible] | 3B | 4A | 5 | 663 | |
| 188 | 357-5 | పల్లం | 0.19 | 0.19 | [illegible] | 4B | 11B,12B | 9A | 6B,8 | |
| 189 | 357-6ఎ | పల్లం | 0.04 | 0.01 | [illegible] | 663 | 663 | 5 | 6B | |
| 190 | 357-9ఎ | పల్లం | 0.42 | 0.39 | [illegible] | 5 | 11B, | 10B | 9B | |
| 191 | 357-10అ | పల్లం | 0.31 | 0.26 | [illegible] | 9A | 10A | 13B | 10C | |
| 192 | 357-11అ | పల్లం | 0.56 | 0.07 | [illegible] | 4B | 11A | 10A | 5,9A | |
| 193 | 357-13అ | పల్లం | 0.39 | 0.24 | [illegible] | 10B | 13A | 14B | 13C | |
| 194 | 357-14అ | పల్లం | 0.35 | 0.21 | [illegible] | 13B | 14A | 15B | 14C | |
| 195 | 357-15అ | పల్లం | 0.46 | 0.28 | [illegible] | 14B | 15A | 361/ 1B | 15C | |
| 196 | 361-1అ | పల్లం | 0.58 | 0.44 | [illegible] | 357 | 1A | 2B | 1C | |
| 197 | 361-2అ | పల్లం | 0.31 | 0.21 | [illegible] | 1B | 2A | 3B | 2C | |
| 198 | 361-3అ | పల్లం | 0.26 | 0.14 | [illegible] | 2B | 3A | 4B | 3C | |
| 199 | 361-4అ | పల్లం | 0.65 | 0.44 | [illegible] | 3B | 4A | 5B | 4C | |
| 200 | 361-5అ | పల్లం | 0.45 | 0.26 | [illegible] | 4B | 5A | 6B | 5C | |
| 201 | 361-6అ | పల్లం | 0.46 | 0.26 | [illegible] | 5B | 6A | 7B | 6C | |
| 202 | 361-7అ | పల్లం | 0.33 | 0.18 | [illegible] | 6B | 7A | 8B | 7C | |
| 203 | 361-8అ | పల్లం | 0.50 | 0.24 | [illegible] | 7B | 8A | 362/ 1B | 8C | |
| 204 | 362-1అ | పల్లం | 0.23 | 0.11 | [illegible] | 361/ 8B | 1A | 2B | 1C | [illegible] |
| 205 | 362-2అ | పల్లం | 0.66 | 0.37 | [illegible] | 1B | 2A | 3B | 2C | [illegible] |
| 206 | 362-3అ | పల్లం | 0.67 | 0.40 | [illegible] | 2B | 3A | 4B | 3C | [illegible] |
| 207 | 362-4అ | పల్లం | 0.45 | 0.24 | [illegible] | 3B | 4A | 5B | 4C | [illegible] |
| 208 | 362-5అ | పల్లం | 0.40 | 0.24 | [illegible] | 4B | 5A | 6B,7 A | 5C | [illegible] |
| 209 | 362-6అ | పల్లం | 0.17 | 0.14 | [illegible] | 5B | 6A | 8B | 7A | |
| 210 | 362-7ఎ | పల్లం | 0.23 | 0.10 | [illegible] | 5B | 6B | 8B | 7B | |
| 211 | 362-8అ | పల్లం | 0.49 | 0.29 | [illegible] | 6B,7 A | 8A | 9B | 8C | |
| 212 | 362-9అ | పల్లం | 0.56 | 0.30 | [illegible] | 8B | 9A | 10A | 9C | |
| 213 | 362-10ఎ | పల్లం | 0.77 | 0.47 | [illegible] | 9B | 360 | 363/ 1 | 10B | [illegible] |
| 214 | 363-1 | మెట్ట | 0.82 | 0.82 | [illegible] | 262 | 360 | 3A | 2A,2B | [illegible] |
| 215 | 363-3ఎ | మెట్ట | 0.82 | 0.64 | [illegible] | 1 | 364 | 5B | 3B | [illegible] |
| 216 | 363-5అ | మెట్ట | 1.40 | 0.98 | [illegible] | 3A | 364 | 6B | 5C | [illegible] |
| 217 | 363-6అ | మెట్ట | 0.30 | 0.18 | [illegible] | 5B | 7B | 9A | 6C | |
| 218 | 363-7అ | మెట్ట | 0.06 | 0.05 | [illegible] | 6B | 7A | 8B | 6B | |
| 219 | 363-8అ | మెట్ట | 0.16 | 0.15 | [illegible] | 7B | 8A | 10B | 9A | [illegible] |
| 220 | 363-9ఎ | మెట్ట | 0.18 | 0.13 | [illegible] | 6B | 8B | 10B | 9B | [illegible] |
| 221 | 363-10అ | పల్లం | 0.60 | 0.40 | [illegible] | 8B | 10A | 12B | 10C | [illegible] |
| 222 | 363-12అ | పల్లం | 0.41 | 0.35 | [illegible] | 10B | 364 | 13A | 12C | [illegible] |
| 223 | 363-13ఎ | పల్లం | 0.40 | 0.35 | [illegible] | 12B | 364 | 659 | 13B | [illegible] |
| 224 | 364-5అ | పల్లం | 0.30 | 0.16 | [illegible] | 360 | 5A | 6B | 363 | [illegible] |
| 225 | 660-12అ | పల్లం | 2.44 | 1.20 | [illegible] | 659/ 2 | 12A | 638 | 13A, 14A, 15A, 16A | [illegible] |
| 226 | 660-13ఎ | పల్లం | 0.72 | 0.60 | [illegible] | 659 | 12B | 14A | 13B | [illegible] |
| 227 | 660-14ఎ | పల్లం | 0.17 | 0.10 | [illegible] | 13A | 12B | 15A | 14B | [illegible] |
| 228 | 660-15ఎ | పల్లం | 0.28 | 0.16 | [illegible] | 14A | 12B | 16A | 15B | [illegible] |
| 229 | 660-16ఎ | పల్లం | 0.36 | 0.17 | [illegible] | 15A | 12B | 638 | 16B | [illegible] |
| 230 | 638-1అ | మెట్ట | 1.69 | 0.40 | [illegible] | 660/ 12B | 1A | 3B | 1C | [illegible] |
| 231 | 638-2అ | మెట్ట | 0.99 | 0.40 | [illegible] | 2A | 2A | 637 | 3B | [illegible] |
| 232 | 638-3అ | మెట్ట | 1.89 | 1.12 | [illegible] | 1B | 2B, 3A | 637 | 3C | [illegible] |
| 233 | 638-5ఎ | పల్లం | 0.37 | 0.03 | [illegible] | 660 | 660 | 1C | 5B | [illegible] |
| 234 | 637-1అ | మెట్ట | 1.76 | 0.95 | [illegible] | 638/ 2B | 1A | 636 | 2A, 1C | [illegible] |
| 235 | 637-3ఎ | మెట్ట | 0.60 | 0.24 | [illegible] | 638 | 1B | 1C | 2B | [illegible] |
| 236 | 636-2అ | మెట్ట | 3.24 | 1.34 | [illegible] | 637 | 2A | 3B | 2C | |
| 237 | 636-3అ | మెట్ట | 0.70 | 0.29 | [illegible] | 2B | 3A | 4B | 3C | |
| 238 | 636-4అ | మెట్ట | 0.78 | 0.29 | [illegible] | 3B | 4A | 634 | 4C | |
| 239 | 634-1అ | మెట్ట | 0.42 | 0.01 | [illegible] | 4A | 1A | 2B | 4B | |
| 240 | 634-2అ | మెట్ట | 0.46 | 0.19 | [illegible] | 1A | 2A | 3B | 4B | |
| 241 | 634-3అ | మెట్ట | 1.39 | 0.93 | [illegible] | 2B | 3A | 633 | 4B | [illegible] |
| 242 | 634-4అ | మెట్ట | 4.25 | 1.44 | [illegible] | 636 | 4A, 1B, 2B, 3B | 633 | 4C | [illegible] |
| 243 | 633-12ఎ | మెట్ట | 3.25 | 1.86 | [illegible] | 634 | 643 | 632 | 1A2 | [illegible] |
| 244 | 632-1అ | మెట్ట | 4.68 | 2.44 | [illegible] | 633 | 1A | 631 | 1C | [illegible] |
| 245 | 631-1అ | మెట్ట | 2.62 | 2.27 | [illegible] | 632/ 1B | 1A,2, 3 | Ramacha nrapuram | 4A | [illegible] |
| 246 | 631-4ఎ | మెట్ట | 3.18 | 1.29 | [illegible] | 632/ 1B | 1B | Rama chan rapu ram | 4B | [illegible] |
| మొత్తం | | | | 59.37 | | | | | | |

| గోష్వారా | | |
|---|---|---|
| వర్గీకరణ | | విస్తీర్ణం |
| మెట్ట | | 23.06 |
| పల్లం | | 36.31 |
| మొత్తం | | 59.37 |

సం/- కె.ధనంజయ రెడ్డి,ఐ.ఎ.యస్.,
జిల్లా కలెక్టరు, శ్రీకాకుళం.

# ప్రజ్ఞా వికాస్ పరీక్షకు విశేష స్పందన



ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస్ పేరుతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 87 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 10,783 మంది హాజరయ్యారు. పట్టణంలోని స్థానిక కస్పా హైస్కూల్లో నిర్వహించిన పరీక్షకు సంబంధించి ప్రశ్నపత్రాలను సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ చీకటి దివాకర్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.శేషగిరి, కస్పా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అప్పలనాయుడు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ సామాజిక బాధ్యత కలిగిన సంఘమన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూనే వారికి మోడల్ పరీక్షలను నిర్వహించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో విద్యార్థుల్లోని భయాన్ని పోగొట్టేందుకు మోడల్ పరీక్ష ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎం.వెంకటేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

## 'సువర్ణముఖి' ఒడ్డున షూటింగ్ సందడి

ప్రజాశక్తి-సీతానగరం

మండల కేంద్రంలోని శివాలయం దగ్గర సువర్ణముఖినది సమీపంలో ఆదివారం సినీనటుడు, దర్శకుడు ఆర్.నారాయణ మూర్తి సినిమా షూటింగ్ జరిగింది. గత నాలుగు రోజులుగా మండలంలోని లచ్చయ్యపేట, చల్లంనాయుడువలస, లక్ష్మీపురం, పరిసర ప్రాంతాలలో షూటింగ్ నిర్వహించారు. అయితే నది ఒడ్డున ఇసుక మాఫియాపై ప్రత్యేకంగా షూటింగ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు పెద్దఎత్తున మహిళలు, ప్రజలు తరలివచ్చారు. షూటింగ్‌కు ప్రజలు బాగా సహకరి స్తున్నారని, వారికి నారాయణమూర్తి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్.వేణు నాయుడు, బి.శ్రీనువాసరావు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

## కొండడాబా జాతరకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలసలో ఆదివారం కొండడాబా జాతరకు యాత్రికులు భారీగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచి వేలాదిగా జనం పాదయాత్రగా కొండడాబాకు చేరుకున్నారు. చుట్టుపక్కల మండలాలతోపాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా యాత్రికులు పోటెత్తారు. ఆదివారం ఉదయం నాలుగు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు దివ్యబలి పూజలు జరిగాయి. ఫాదర్ పి.జీవన్‌బాబు ఆధ్వర్యంలో ఈ యాత్ర జరిగింది. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. తలనీలాల మొక్కుబడులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**పటిష్ట బందోబస్తు**

వ్యాకులమాత జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కొత్తవలస సిఐ రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యాన పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. విశాఖపట్నం మార్గంలో మంగళపాలెం నుంచి రైల్వేస్టేషన్, దేవాడ, వియ్యంపేట, తుమ్మికాపల్లి మీదుగా బందోబస్తు నిర్వహించారు.

# వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న జెట్లీ

ప్రజాశక్తి-గరివిడి

పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై ఆదివారం బెంగుళూర్‌కు చెందిన జెట్లీ ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. సహాయ్ స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు వాకాడ శ్రీనివాసరావు, గజపతినగరం పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యం సౌజన్యంతో పట్టణంలోని శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో అవగాహన సదస్సును నిర్వహించారు. పరీక్షలలో ఒత్తిడిని ఎలా అధిగమించాలి, మానసిక స్థైర్యాన్ని ఎలా పెంపొందించుకోవాలి, కష్టమైన సబ్జెక్టులను ఇష్టంగా ఎలా చదవాలి, ఏ సబ్జెక్టుకు ఎంత సమయం కేటాయించాలి, 10వ తరగతి పూర్తి చేసిన తరువాత ఎటువంటి రంగాలలో ఎలాంటి చదువులు చదవాలనే లక్ష్యాన్ని సాధించేందుకు ఏ విధంగా కష్టపడాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలకు నివృత్తి చేశారు. కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గరివిడి, కొండపాలెం, తాటిగూడ, త్రిపులెక్స్ కెఎల్‌పురం, అభ్యాస్ కెజిబివి పాఠశాలల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. చీపురుపల్లి మండలం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలాజీ పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చంద్రశేఖర్, రెడ్డి పావని, ఎస్ఎంఎస్ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ డైరెక్టర్ వాకాడ గోపి, సహాయ్ అధ్యక్షుడు ఉప్పు శ్రీను, బొద్దూరు శంకరరావు, ఎస్.కాంతారావు, ఏ.సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలను గద్దె దించాలి

## నాగేశ్వరరావు సన్మాన సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు

ప్రజాశక్తి - అనకాపల్లి

కార్మిక వర్గానికి వ్యతిరేకంగా పరిపాలన సాగిస్తున్న కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వాలను గద్దె దించేందుకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. పోస్టల్ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన కామ్రేడ్ ఎం.నాగేశ్వరరావును స్థానిక వివి రమణ రైతు భారతి భవనంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సింగరావు మాట్లాడుతూ కార్మిక సంఘాలు సంస్థలను పట్టుకొని పైరవీలు సాగిస్తే కార్మికులు నష్టపోతారన్నారు. అధికార ప్రతిపక్ష పార్టీలు ప్రజా, కార్మిక సమస్యలను పట్టించుకోవడంలో విఫలమయ్యాయని విమర్శించారు. స్వాతంత్ర్యానికి ముందు ఉన్న కార్మిక చట్టాలను కూడా తమకు అనుగుణంగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. ఇటువంటి తరుణంలో ప్రత్యామ్నాయ రాజకీయాలను బలపర్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్మిక సంఘాలు బలపడితేనే ఇది సాధ్యమన్నారు. బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ సంస్థలు మూతపడడం ఖాయమని స్పష్టం చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.80 వేల కోట్ల మేరకు పెట్టుబడులను ఉపసంహరిస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. అలాగే ఇన్‌కమ్ ట్యాక్స్ రూ.5 లక్షలు సీలింగ్ దాటిన వారు ప్రభుత్వానికి రూ.12 లక్షల కోట్లు పన్ను కట్టాల్సి ఉందన్నారు. ఇటువంటి తరుణంలో కార్మిక వర్గం తరపున పోరాడే నాగేశ్వరరావు లాంటి వ్యక్తుల అవసరం సిఐటియుకి ఎంతైన ఉందని చెప్పారు. ఆయన సేవలను సిఐటియు సద్వినియోగం చేసుకుంటుందన్నారు.

సన్మాన గ్రహీత ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక సంఘాల నాయకులు అధికార యంత్రాంగానికి తొత్తులుగా మారకూడదన్నారు. యూనియన్లకు అతీతంగా కార్మికులకు సేవలందించాలని సూచించారు. తమ నుంచి ముందు తరాలవారు స్ఫూర్తి పొందే విధంగా కార్మిక వర్గ నాయకులు పని చేయాల్సి ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖను ప్రయివేటీకరించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. పోస్టల్‌శాఖ ఆస్తులను లూటీ చేసి కార్పొరేట్ రంగానికి కట్టబెట్టే ప్రయత్నాలను పోస్టల్ ఉద్యోగులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు.



నాగేశ్వరరావును సన్మానిస్తున్న పోస్టల్ ఉద్యోగుల సంఘాల నాయకులు

**నాగేశ్వరరావుకు ఘన సన్మానం**

ఈ సందర్భంగా నాగేశ్వరరావును రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోస్టల్ యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఎఐపిఇయు గ్రూప్ సి డివిజన్ అధ్యక్షులు దామరౌతు నూకరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ ఎం.వెంకటేశ్వర్లు, ఎఐపిఇయు గ్రూప్ సి ఎపి సర్కిల్ రాష్ట్ర కార్యదర్శి డిఎఎస్‌వి ప్రసాద్, పోస్టు మాస్టర్స్-ఎంటిఎస్ ఎపి సర్కిల్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.విద్యాసాగర్, ఎఐపిఇయు జిడిఎస్ (ఎన్ఎఫ్‌పిఇ ) ఎపి సర్కిల్ రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, ఎఐపిఇయు జిడిఎస్ (ఎన్ఎఫ్‌పిఇ) ఎపి సర్కిల్ రాష్ట్ర అధ్యక్షులు కె.మనోహర్ ప్రసంగించారు.

## జంగాలు సంక్షేమ సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి, గరివిడి మండలాలకు చెందిన జంగాలు సంక్షేమ సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఉమా నీలకంఠేశ్వర దేవస్థానం ఆవరణలో రెండు మండలాలకు చెందిన జంగాల కులస్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా తాలాడ జగదీశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మీగడ రమేష్, ఉపాధ్యక్షునిగా డి.సోమేశ్వరరావు, గౌరవాధ్యక్షునిగా దీపాల కనకరాజు, కోశాధికారిగా దీపాల భానుమతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా చెన్నాపురం కోటేశ్వరరావు, గుంప స్వామి, నాగేశ్వరరావు తదితరులు ఎన్నికయ్యారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించనున్నామని షిరిడీసాయి బాబా ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం వారు మాట్లాడారు. విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గాంధీనగర్ కాలనీ సాయిబాబా ఆలయం వద్ద శిబిరం ఉంటుందన్నారు.

# ఒకే... రెడీ... యాక్షన్...



సోనాలి బింద్రే

సినిమా ప్రేమికులకు ఒకే..రెడీ..యాక్షన్ అనే మాట నిత్యం వినిపిస్తూ ఉండాలి. లేకపోతే తట్టుకోలేరు. అందుకే ఎక్కువ కాలం సినిమాలకు దూరంగా ఉండలేరు నటీనటులు. చాలా కాలంగా సోనాలి బింద్రే కెమెరాకు దూరంగా ఉంది. కేన్సర్‌తో పోరాడి గెలిచిన నటి బింద్రే. ఈ వ్యాధిన బారిన పడినప్పుడు కూడా ఆత్మస్థైర్యం కోల్పోకుండా పోరాడింది. ఈమె జీవితంలో ఎంతోమంది కేన్సర్ బాధితులకు స్ఫూర్తి. ఇప్పుడు మళ్లీ కెమెరా ముందుకొచ్చింది. ఆ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్టు ద్వారా పేర్కొంది. అంతేకాదు వ్యానిటీ వ్యాన్ ఎక్కేముందు మరో భావోద్వేగమైన వీడియో పోస్టు చేసింది. 'సుదీర్ఘ సెలవులు అనంతరం మళ్లీ కెమెరా ముందుకెళుతున్నా. ఈ అందమైన భావోద్వేగాన్ని మాటల్లో చెప్పలేను' అని పేర్కొంది. సోనాలి న్యూయార్క్‌లో కేన్సర్ ట్రీట్‌మెంట్ చేసుకుంది. ఆ విషయాన్ని 2018 ఏప్రిల్‌లో సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించింది. ఆ సమయంలో చాలా మంది బాలీవుడ్ సెలబ్రిటీలు ఈమెకు ధైర్యాన్ని నింపారు. గత ఏడాది డిసెంబర్ మూడో తేదీన ఇండియాకు తిరిగొచ్చింది.

# దేవరకొండ సరసన నలుగురు హీరోయిన్లు

సాధారణంగా ఓ మోస్తరు సినిమాలో ఒకరో ఇద్దరో హీరోయిన్లుంటారు. కానీ విజయ్ దేవరకొండ చిత్రానికి నలుగురు కథానాయికలు. విజయ్ హీరోగా క్రాంతి మాధవ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్ గా రాబోతుంది. ఈ సినిమా దసరా సందర్భంగా ప్రారంభమైంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఇంకా టైటిల్ ఖరారు చేయలేదు. ఇప్పటికే రాశీఖన్నా, ఐశ్వర్య రాజేష్, ఇజబెల్లా కథాయికలుగా నటిస్తున్నారు. వీరితో పాటు ఇప్పుడు నాలుగో కథానాయికగా కేథరిన్ థెరిసాను ఎంపిక చేశారు. కేథరిన్ 'సరైనోడు' తర్వాత అంత పెద్ద చిత్రం ఇదే అయి ఉండొచ్చు. 2017లో గోపీచంద్ సరసన 'గౌతమ్‌నంద' చిత్రంలో నటించింది. సినిమా ఫ్లాప్ అయినా కేథరిన్ నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఈమె తెలుగు కథానాయికగా చేసిన 'ఇద్దరమ్మాయిలతో', 'నేను రాజు నేనే మంత్రి' మంచి విజయాన్ని నమోదు చేసుకున్నాయి. ఇప్పుడు విజయ్ దేవరకొండతో నటిస్తోంది. ఈ చిత్రానికి గోపీసుందర్ బాణీలు సమకూరుస్తున్నారు. జే కే సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. నిర్మాత కె.ఎస్ రామారావు సమర్పణలో క్రియేటివ్ కమర్షియల్స్ బ్యానర్ పతాకంపై కెఏ వల్లభ ఈ సినిమాని నిర్మిస్తున్నారు.



రాశీ ఖన్నా

క్యాథరిన్

ఇజబెల్లా

ఐశ్వర్య రాజేష్

# హారర్ జోనర్‌కు ఎప్పుడూ విజయమే

## 'అమావాస్య ' ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాత సి.కల్యాణ్




సచిన్ జోషి హీరోగా వైకింగ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్ పై రూపొందుతోన్న సినిమా 'అమావాస్య'. భూషణ్ పటేల్ దర్శకత్వంలో రైనా సచిన్‌జోషి, దీపెన్‌ఆమిన్ నిర్మించారు. నర్గిస్ ఫక్రి హీరోయిన్. ఈ సినిమా నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నిర్మాత సి కళ్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొని బిగ్ ఆడియో సీడీని విడుదల చేశారు.

సి.కల్యాణ్ మాట్లాడుతూ "నాకు హారర్ జోనర్ అంటే చాలా ఇష్టం. నేను ఇప్పటి వరకు చాలా హారర్ సినిమాలు నిర్మించాను. ఈ జోనర్ ఎప్పుడూ విజయం సాధిస్తుంది. ఈ సినిమాలో సచిన్ చాలా బాగా కనపడుతున్నారు. అతను మంచి నటుడు. తనకు చాలా వ్యాపారాలు ఉన్న సినిమాపై ఉన్న ఫ్యాషన్‌తో నటిస్తున్నారు. ఆయన భార్య రైనా సచిన్ జోషి గారు నిర్మాతగా మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను. వారిద్దరూ కలిసి తెలుగులో ఎన్నో సినిమాలను నిర్మించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. భూషణ్ ఈ సినిమాను చాలా అద్భుతంగా తెరకెక్కించారని ట్రైలర్ చూస్తేనే తెలుస్తోంది. ఆయన చాలా టాలెంటెడ్ డైరెక్టర్' అని అన్నారు.

హీరో సచిన్ జోషి మాట్లాడుతూ 'నేను చాలా కాలంగా హారర్ జోనర్‌లో ఓ సినిమా చేయాలని ఎదురుచూస్తున్నాను. అలాంటి సమయంలో భూషణ్ పటేల్ నాకు ఈ స్క్రిప్ట్ చెప్పారు. తెలుగులో హారర్ చిత్రాలకు మంచి ఆదరణ దొరుకుతున్న సమయంలో మంచి కాన్సెప్ట్‌తో సినిమా చేయడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం ఉన్న లెటెస్ట్ టెక్నాలజీ వి.ఎఫ్.ఎక్స్ వర్క్‌ను ఉపయోగించాం. మంచి కథే సినిమాకు హైలైట్. రెండు భాషల్లో చిత్రీకరించాం. ఎందుకంటే తెలుగు సినిమాకు నా తొలిప్రాధాన్యత ఎప్పుడూ ఉంటుంది. భూషణ్ ఇప్పటికే 1920 ఈవిల్ రిటర్న్స్, రాగిణి ఎం.ఎం.ఎస్2, అలోన్ వంటి సూపర్‌హిట్ చిత్రాలను డైరెక్ట్ చేశారు. అలాంటి హారర్ స్పెషలిస్ట్ డైరెక్టర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. హాలీవుడ్ స్థాయిలో హారర్ చిత్రాన్ని అందించాలని ఛాలెంజింగ్‌గా భావించి ఈ సినిమా చేశాం. అమావాస్య యూనిక్ స్క్రీన్‌ప్లేతో తెరకెక్కింది. కథకు తగ్గట్లు మ్యూజిక్‌కు తగ్గ ప్రాధాన్యముంటుంది. నాకు సినిమాలంటే ప్యాషన్. చాలా కథలు వింటూ ఉంటాను. నచ్చిన సినిమాలు చేయడానికి ఆసక్తి చూపుతుంటాను' అని చెప్పారు.

దర్శకుడు భూషణ్ పటేల్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో కథతో పాటు వి.ఎఫ్.ఎక్స్‌కు చాలా ప్రాధాన్యముంది. ఇప్పటి వరకూ ఉపయోగించని సాంకేతికతను ఇందులో ఉపయోగించాం. దీనికి ఆసక్తికరమైన కథ కూడా తోడైంది. క్లైమాక్స్ అందరినీ ఆశ్చర్యపరిచేలా ఉంటుంది. సచిన్‌తో చాలా కాలంగా సినిమా చేయాలని అనుకుంటున్నాను. కానీ ఇద్దరం వారి వారి పనులతో బిజీగా ఉండటం వల్ల కలిసి సినిమా చేయలేకపోయాం. గత ఏడాది ఓ సందర్భంలో ఇద్దరం కలుసుకున్నప్పుడు సచిన్‌కు మూడు నిమిషాల పాటు చెప్పాను. అతను ఈ సినిమా కలిసి చేస్తున్నామని నాతో చెప్పాడు. తననే హీరోగా పెట్టి సినిమా చేయాలని అప్పుడే నేను నిర్ణయించుకున్నాను. మా టీం అందరం చాలా కష్టపడి ఈ సినిమాను తెరకెక్కించాం సినిమా చాలా బాగా వచ్చింది. హీరోయిన్ నర్గీస్ మంచి నటనతో అందరిని ఆకట్టుకుంటుంది' అనిపేర్కొన్నారు.

# చింతకింది 'మల్లేశం'



చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న సినిమా 'మల్లేశం'. అగ్గిపెట్టెలో పట్టేంత చిన్న చీరలను కూడా నేచి ప్రపంచాన్ని అబ్బుర పరిచిన వ్యక్తి మల్లేశం. అతను సాధించిన విజయాలతో చేనేత ప్రాముఖ్యతను దేశవ్యాప్తంగా చాటి చెప్పిన ఘనత ఆయన సొంతం. ఈయన జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. రాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీ అధికారి, రాజ్ ఆర్ నిర్మిస్తున్నారు. ఇందులో మల్లేశం పాత్రలో ప్రియదర్శి నటిస్తున్నారు. అనన్య, ఝాన్సీ, చక్రపాణి కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. చిత్రయూనిట్ సిరిసిల్ల జిల్లాలో ఈ చిత్ర ఫస్ట్ లుక్ విడుదల చేశారు. బాబు శాడిలాస్య ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. లక్ష్మణ్ ఆలే ప్రొడక్షన్ డిజైనర్. విమర్శకుల ప్రశంసలు అందుకున్న నితిన్ లుకోస్ ఈ చిత్రానికి సౌండ్ డిజైన్ చేస్తున్నారు. మార్క్ కే రాబిన్ బాణీలు సమకూరుస్తున్నారు. పెద్దింటి అశోక్ కుమార్ మాటలు రాస్తున్నారు. గోరేటి వెంకన్న, చంద్రబోస్ ఈ చిత్రానికి సాహిత్యం అందిస్తున్నారు. వెంకట్ సిద్ధిరెడ్డి ఈ చిత్రానికి ఎగ్జిగ్యూటివ్ ప్రొడ్యూసర్.

# 'మున్నాభాయ్ 3' ఈ ఏడాదే ఉండొచ్చు



వినోద్ చోప్రా

'మున్నాభాయ్' ఫ్రాంచైజ్‌లో భాగంగా మూడో పార్టు ఈఏడాదే ఉండొచ్చునని నిర్మాత వినోద్ చోప్రా అన్నారు. పూర్తిస్థాయి స్క్రిప్ట్ లేకుండా సినిమా ప్రారంభించడం సాధ్యం కాదని చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో వినోద్ చోప్రా మాట్లాడుతూ అన్నీ అనుకూలిస్తే ఈ ఏడాది మూడో భాగం సెట్స్‌పైకి వెళ్లబోతుంది. 'మూడో భాగానికి సంబంధించి పూర్తి స్థాయి స్క్రిప్ట్ ఇంకా సిద్ధం కాలేదు. అందుకే ఈ ఇప్పటి వరకూ చేయలేదు. రాజ్‌కుమార్ హిరానీ దర్శకత్వ బాధ్యతలను తిరిగి చేపడితే ఈ ఏడాదే ఈ సినిమా మొదలు కానుంది' అని చెప్పారు. 'సంజు' సినిమా షూటింగ్‌లో రాజ్‌కుమార్ హిరానీ తన తోటి సహదర్శకురాలిని లైంగిక వేధించారని ఆమె ఆరోపణలు చేసింది.

# చీకటి గదిలో చితక్కొట్టుడు


హారర్ కథను యూత్‌ను ఆకట్టుకునేలా చెప్పేందుకు వచ్చిన సినిమానే 'చీకటి గదిలో చితక్కొట్టుడు'. హాలీవుడ్‌లో 'అమెరికన్ గై', బాలీవుడ్‌లో 'మస్తీ', 'హేట్ లవ్‌స్టోరీ' తరహాలో ఈ చిత్రం ఉంటుందని దర్శకుడు సంతోష్ పి.జయకుమార్ చెప్పారు. గత ఏడాది తమిళంలో విడుదలైన ఈ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేశారు. అదిత్, నిక్కితంబోలి నాయికా నాయికలు. అనుకోని సందర్భంలో ఓ బంగ్లాకు వచ్చిన యువతీయువకులకు చీకటి గదిలో దెయ్యం ఎలాంటి బుద్ధి చెప్పిందనేది ఈ చిత్ర కథాంశమని పేర్కొన్నారు. హీరో అదిత్ మాట్లాడుతూ 'ఇంతకుముందు 'ఎల్7' సినిమా చేశా. పెద్దగా ఆడలేదు. హారర్‌లో వినూత్నంగా చేయాలని చేసిన కథ ఇది. యూత్ ఆలోచనలు, వారి చేష్టలు ఎలా ఉంటాయనేది ఇందులో కొన్ని పాత్రల ద్వారా చెప్పాం. నటుడిగా నన్ను అందరూ గుర్తిస్తున్నారు. కానీ రావాల్సిన పేరు రాలేదు. ఈ చిత్రంతో అది వస్తుందనే నమ్మకముంద'ని తెలిపారు. 'ఇలాంటి చిత్రాలకు సంగీతం కీలకం. తమిళంలో ఇచ్చినట్లుగానే ఇందులోనూ ట్యూన్స్ ఇచ్చే అవకాశం వచ్చిందని' సంగీత దర్శకుడు బాలమురళి బాలు అన్నారు. తెలుగులో పరిచయం అయినందుకు ఆనందంగా ఉందని నటి నిక్కితంబోలి పేర్కొన్నారు. తాగకుండా ఓ భిన్నమైన పాత్ర పోషించానని తాగుబోతు రమేష్ చెప్పారు.

# సినిమాలే మరో పనేదీ లేదు –కరిష్మా



తానెప్పుడూ కెమెరాను మిస్ కానని బాలీవుడ్ నటి కరిష్మా కపూర్ చెప్పింది. జీవితంలోనే తానేదీ ప్రణాళిక వేసుకోనని, కష్టపడడం ఒక్కటే తెలుసని పేర్కొంది. కరిష్మా 2012లో 'డేంజర్స్ ఇష్క్' చిత్రంలో నటించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఏ సినిమాలోనూ ఈమె కనిపించలేదు. దీంతో చాలా మంది సామాజిక మాధ్యమాల్లో ఆమెను ఆరా తీయడం మొదలు పెట్టారు. సినిమాలు మానేసి మరొక పనేదో చేసుకుంటున్నారని పోస్టులు పెడుతున్నారు. వీటిపై ఆమె స్పష్టతనిచ్చింది. లేక్మే ఫ్యాషన్ వీక్‌లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ 'నేను ఎప్పుడూ కెమెరా ముందే ఉంటాను. నేనేదో చేస్తున్నానని అందరూ అడుగుతున్నారు. నా జీవితంలో ఏదీ ప్రణాళిక వేసుకోలేదు. ఓ సినిమాతో త్వరలోనే మీ ముందుకు వస్తున్నా. స్టార్స్ పిల్లలు రాణించడం అంత సులువేం కాదు. చేయాల్సిన దాని కోసం నేను తీవ్రంగా శ్రమిస్తా. అది కష్టమైనా చేసి తీరుతా. నేను చేసే పని కోసం రెండొంతులు కష్టపడతా. దీనిలో చాలా ఆనందాన్నీ..గొప్ప అనుభావాన్ని పొందుతా ' అని పేర్కొంది. ఫ్యాషన్ రంగం గురించి కరిష్మా మాట్లాడుతూ 'నాకు నచ్చినవే వేసుకుంటా. ఏవో సినిమాలోనివో, నడుస్తున్న ట్రెండ్‌నో అనుసరించను. నాకేది బాగుందనిపిస్తే వాటినే ధరిస్తా' అని చెప్పింది.

# ఈ నవ్వుకు అతనే కారణం



రితేశ్ దేశ్‌ముఖ్, జెనీలియా

ఏ సందర్భం వచ్చినా జెనీలియా, రితేశ్ దేశ్‌ముఖ్ తమ మధ్యనున్న ప్రేమను వ్యక్తం చేస్తూ ఉంటారు. మరోసారి తమ ఏడో వివాహ వార్షికోత్సవం సందర్భంగా హృదయానికి హత్తుకునేలా ఓ పోస్టులో పేర్కొంది. 'ప్రతి అమ్మాయి తనకు కాబోయే భర్త ఎలా ఉండాలనే దానిపై కొంత అవగాహన ఉంటుంది. నిజం చెప్పాలంటే నాకు మాత్రం అలాంటి కలలేవీ కనలేదు. నా స్నేహితుడే అద్భుతమైన జీవిత భాగస్వామిగా దొరికాడు. నేను బాధలో ఉన్నప్పుడు నన్ను ఓదారుస్తాడు. జీవితం ఎంత కఠినంగా ఉన్నా ఇద్దరం కలిసే ప్రయాణించగలం అన్న భరోసా కల్పిస్తాడు. నేను నవ్వుతూ ఉండటానికి కారణం అతనే. ఐ లవ్యూ రితేశ్. ఇద్దరం కలిసి ఎప్పుడూ ఇలాగే సంతోషంగా ఉందాం. సుఖదు:ఖాలను ఒకరితో ఒకరు పంచుకుందాం. హ్యాపీ యానివర్సరీ' అంటూ తన భర్తతో కలిసి దిగిన ఫొటోను జత చేశారు. బాలీవుడ్‌లో జెనీలియా, రితేశ్ దేశ్‌ముఖ్ కలసి 2003లో 'తుజే మేరి కాసమ్' చిత్రంలో నటించారు. దీంతో పాటు మస్తీ, తేరే నాల్ లవ్ హో గయా వంటి చిత్రాల్లో వీరిద్దరూ నటించారు. మరాఠీలో రితేశ్ అరంగేట్రం చేసిన 'లై భారి' చిత్రానికి జెనీలియా నిర్మాతగా కూడా వ్యవహరించింది. 2012 ఫిబ్రవరి 3న వివాహం చేసుకున్న వీరికి ఇద్దరు పిల్లలు.

# మరో పది రోజుల్లో...

వింక్ గర్ల్ ప్రియా ప్రకాశ్ వారియర్, రోషన్ నటించిన 'లవర్స్ డే' చిత్రం ప్రేమికుల దినోత్సవం నాడు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. తెలుగు, మలయాళంతో పాటు కన్నడ, తమిళ భాషల్లో ఈ చిత్రం ఏక కాలంలో విడుదల కానున్నది. ఒమర్ లులు దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని తెలుగులో సుఖీభవ సినిమాస్ బ్యానర్‌పై ఎ. గురురాజ్, సి.హెచ్.వినోద్‌రెడ్డి అందిస్తున్నారు.నిర్మాతలు గురురాజ్, వినోద్ రెడ్డి మాట్లాడుతూ "జనవరి 23వ తేదీన అల్లు అర్జున్ విడుదల చేసిన ఆడియోకు మంచి స్పందన వచ్చింది. ఆడియో రిలీజ్ తర్వాత ప్రియా ప్రకాశ్ వారియర్‌కు టాలీవుడ్‌లో క్రేజ్ మరింత పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో సినిమాను తెలుగు ప్రేక్షకులకి దగ్గరగా చేసేందుకు, ప్రేక్షకులకు సంపూర్ణమైన వినోదాన్ని అందించేందుకు ప్రీ ప్రొడక్షన్ పనులను క్వాలిటీతో రూపొందించాం. ప్రియ వారియర్‌కు తెలుగులో ఉమ (ప్రముఖ దర్శకుడు రేలంగి నర్సింహారావు తమ్ముడి కూతురు), ఈ చిత్రంలో మరో ప్రధాన పాత్రను పోషించిన నూరిన్‌కు సింగర్ లిప్సిక డబ్బింగ్ చెప్పారు. మొత్తం ఎనిమిది పాటలు ఉన్నాయి. చంద్రబోస్, చైతన్య ప్రసాద్, శివ గణేష్, శ్రీజో, శ్రీ సాయికిరణ్ సాహిత్యాన్ని అందించారు. ఇందులో ఓ పాట థియేటర్లలో ప్రేక్షకులకు సర్‌ప్రైజ్‌గా ఉంటుంది' అని అన్నారు.



రోషన్, వారియర్

# రూపాయి




# నకిలీ కార్డులతో..

మనిషిని పోలిన మనుషులు ఉంటారని ఎలా చెబుతారో.. సరిగ్గా మన డిబెట్ కార్డ్ లేదా క్రెడిట్ కార్డ్‌ని పోలిన కార్డులు కూడా ఉంటాయి. ఏంటి మీకు నమ్మబుద్ధి కావడంలేదా?! దొంగతనాలు, మోసాలకు పాల్పడేవారికి.. టెక్నాలజీ కూడా వారి భుజాన వేలాడే ఓ ఆయుధంగా మారిపోతుంది. వాటి ఆసరాగా మనకు తెలియకుండానే మనకు సంబంధించిన మనీ ట్రాన్స్‌మిషన్ కార్డ్స్ (ఏటిఎమ్, క్రెడిట్) ను తయారుచేసుకుని క్షణాల్లో మన ఎకౌంట్లోంచి డబ్బులు కాజేస్తారు. మన జేబులో చెయ్యి పెట్టకుండానే డెబిట్, క్రెడిట్ కార్డులు మాయం చేసేస్తున్న సంఘటనలు ఇటీవల కాలంలో ఎక్కువవుతున్నాయి. అందుకే కార్డ్స్ వాడుతుంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఎలా మనకు తెలియకుండా నకిలీకార్డ్స్‌తో మన ఎకౌంట్లో డబ్బులు కొల్లగొడుతున్నారు? అనే విషయాలు ఈ వారం 'రూపాయి'లో తెలుసుకుందాం!

# మోసాలు - జాగ్రత్తలు

**ఒ**కప్పుడు డబ్బులు డ్రా చెయ్యాలంటే కచ్చితంగా బ్యాంకులకు వెళ్లి అంతో ఇంతో సమయం కేటాయిస్తేగానీ కుదిరేదికాదు. కానీ టెక్నాలజీ తీసుకొచ్చిన సౌలభ్యం కారణంగా బ్యాంకింగ్ రంగాల్లో వచ్చిన పెనుమార్పుల కారణంగా దాదాపు దశాబ్ధంన్నర కిందటే 'ఏటిఎమ్ కార్డ్' వాడుక ఊపందుకుంది. దీంతో కుబేరుల నుంచి మొదలుకుని రోజువారీ పనులు చేసుకునే కూలీల వరకూ డిబెట్ కార్డ్ వినియోగం అనేది తప్పనిసరిగా మారిపోయింది. అయితే సౌకర్యాలతోపాటు ప్రమాదాలు కూడా పొంచి ఉంటాయన్నది జగమెరిగిన సత్యం. ముఖ్యంగా డిబిట్, ఏటిఎమ్ కార్డుల్లో సమాచారాన్ని దొంగిలించడం, ఆ కార్డులను ప్రతిసృష్టి చేయడం (క్లోనింగ్) వంటి అంశాలు ఖాతాదారుల్ని తీవ్రమైన నష్టానికి గురిచేస్తున్నాయి.

### క్లోనింగ్ కార్డ్ అంటే..

అసలు కార్డ్‌కి నకిలీ తయారుచేయడమే క్లోనింగ్. మన దగ్గరున్న డెబిట్, క్రెడిట్ వంటి ఆర్థిక లావాదేవీలు నెరపే కార్డులు మూడోచేతికి అందినప్పుడు కార్డ్ నెంబర్లను డూప్లికేట్ చేసే మిషన్లో దొంగచాటుగా స్వైప్ చేసి, పిన్ నెంబర్‌ని కాజేసి, వాటి ఆధారంగా కొత్తకార్డు సృష్టించి, ఆ కార్డుతో మనకు తెలియకుండానే మన ఎకౌంట్‌కి చిల్లుపెట్టడం అనే సంఘటనలు ఈ మధ్యకాలంలో తరచూ జరుగుతున్నవే.



### ఇలా.. మోసం చేస్తారు!

'సార్.. నేను మీ బ్యాంక్ మేనేజర్‌ని మాట్లాడుతున్నా.. మీ ఏటిఎమ్ కార్డ్ బ్లాక్ అయ్యింది. నెంబర్ రిలీజ్ చెయ్యాలి. పిన్ నెంబర్ ఒకసారి చెప్పండి' అని ఫోన్‌లో ఓ గొంతు వినపడగానే సుబ్రావ్ పేరుతో సహా వివరాలన్నీ టకాటకా చెప్పేశాడు. ఫోన్ ఇలా పెట్టాడో లేదో అలా ఎకౌంట్లో పదివేలు డ్రా చేసినట్టు మెస్సేజ్ వచ్చింది. ఎవరో దొంగవెధవ పిన్ నెంబర్ నొక్కేశాడన్న విషయం సుబ్రావ్‌కి బోధపడ్డానికి ఎంతోసేపు పట్టలేదు.




రమణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. నెలకు 60 వేలకు పైగా ఆదాయం. ఆదాయానికి తగ్గట్టే పలు బ్యాంకుల్లో సేవింగ్ ఎకౌంట్స్ ఉన్నాయి. ఆయా బ్యాంక్‌ల ఏటిఎమ్ కార్డ్స్, కొన్ని క్రెడిట్‌కార్డ్స్‌తోనే రోజువారీ ఆర్థిక లావాదేవీలు జరపడం అలవాటు. అయితే ఒకరోజు సడన్‌గా ఫలానా ఎకౌంట్ నుంచి రూ. 40 వేలు డ్రా చేసినట్టు రమణ ఫోన్‌కి బ్యాంక్ నుంచి ఎస్సెమ్మెస్ అలర్ట్ మెస్సేజ్ వచ్చింది. బ్యాంక్ కార్డ్ తన జేబులోనే ఉండగా ఇదేంటబ్బా? అని తలపట్టుకున్నాడు రమణ.

రమణ, సుబ్రావ్, సుబ్బలక్ష్మి, కాంతం, పరంధామయ్య, శీను, రాధిక, రామారావు, భవానీ ఇలా చాలామంది తమకు తెలియకుండానే తమ ఎకౌంట్లో వున్న డబ్బులు నష్టపోతున్నారు. స్వయంగా మనకు మనం కార్డ్ చేతికిచ్చి, పిన్ నెంబర్ చెప్తేగానీ డబ్బులు డ్రా చేసే అవకాశం లేదు. కానీ ఎకౌంట్లో డబ్బులు మాయం అవుతున్నాయి. కారణాలేంటి?

### మోసాలు.. పలు విధాలు


మీరు ఏదైనా ఏటిఎమ్ సెంటర్లో డబ్బులు డ్రా చేస్తున్న సమయంలో పక్కపక్కనే నిలబడేందుకు ప్రయత్నిస్తున్నా.. మీరు టైప్ చేసే పిన్ నెంబర్లను గుర్తుపెట్టుకునేంత దగ్గరలో నిలబడి ఉన్నా, లేదా మీరు పిన్ నెంబర్ టైప్ చేస్తున్నప్పుడు అదేపనిగా గమనిస్తున్నా మన ఎకౌంట్‌కి ఏదో ప్రమాదం పొంచి ఉన్నట్టే. అలా చూసిన వ్యక్తికి సంబంధించిన మరొకవ్యక్తి మన నుంచి ఏటిఎమ్ కార్డ్ లేదా మన కార్డులు ఉంచిన పర్సు కాజేసే అవకాశం ఉంది. అలాగే కొన్ని ఏటిఎమ్ మిషన్లు నెట్‌వర్క్ నెమ్మదిగా ఉండటం కారణంగా అంతకుముందు లావాదేవీలు జరిపిన పిన్‌నెంబర్ స్టేటస్‌తోనే కొన్ని సెకన్లు, నిముషాలపాటు కొనసాగుతుంటుంది. ఈ విషయాన్ని పసిగట్టే దొంగలు కార్డ్‌స్వైప్ చేయకుండానే విత్‌డ్రా ఆప్షన్ సెలెక్ట్ చేసి.. డబ్బులు డ్రా చేసుకునే సంఘటనలూ అనేకం జరుగుతున్నాయి.



కొద్దిపాటి సమయంలోనే ఎకౌంట్ నుంచి డబ్బులు డ్రా చేసినట్టు బ్యాంక్ నుంచి ఎలర్ట్ మెసేజ్ వచ్చిన సంఘటనలూ జరుగుతున్నాయి. దీనికీ కారణం ఉంది. చాలా మంది తమ పుట్టిన సంవత్సరాన్ని కార్డ్ పిన్ నెంబర్‌గా (పాస్వర్డ్) పెట్టుకుంటారు. ఉదాహరణకు 1976, 1968 ఇలా. అలాగే కార్డ్ ఉంచే కవర్‌పై ఎక్కడో ఒకచోట చిన్న చిన్న అక్షరాలతో పిన్ నెంబర్ గుర్తుకోసం వేస్తుంటారు. ఆధార్, ఓటరు గుర్తింపు కార్డ్ వంటివీ కొంతమంది పర్సుల్లో క్యారీ చేస్తుంటారు. ఇవన్నీ పర్సు దొరికిన, కాజేసిన వ్యక్తులకు మేలు చేసే అంశాలు. ఈ విషయాలన్నింటిపై అవగాహన కలిగిన దొంగలే ప్రత్యేకించి ఏటిఎమ్ కార్డ్‌ల చోరీకి పాల్పడుతుంటారు.

### వ్యాలెట్ పోయిందా?

సాధారణంగా ప్రయాణాల్లో ఉన్నప్పుడు పొరపాటున జేబులో పర్స్ పోగొట్టుకున్నప్పుడు.. అందులో ఉన్న డబ్బులతోపాటు, రోజువారిగా వినియోగిస్తున్న బ్యాంక్ కార్డ్‌లను కూడా పోగొట్టుకునే అవకాశం ఉంది. పర్స్ పోయిన కొద్దిసేపట్లోనే అంటే పిన్ నెంబర్ బ్లాక్ చేయించేందుకు తీసుకునే




**కొత్తగా బ్యాంకులు కంప్యూటర్ చిప్ ఆధారిత కార్డుల్ని ప్రవేశపెడుతున్నాగానీ.. డిబెట్, క్రెడిట్ కార్డుల మోసాలు అక్కడక్కడ జరుగుతూనే ఉన్నాయి. అందుకే డెబిట్, క్రెడిట్ కార్డుల విషయంలో తగిన భద్రత ఉండాలి. అవాంఛనీయ ఫోన్లు, అపరిచిత వ్యక్తులకు డిబెట్, క్రెడిట్ కార్డు వివరాలు ఇవ్వడం అంత మంచిది కాదు. కార్డుల భత్రత విషయంలో వ్యక్తిగత జాగ్రత్తలే కీలకం. పొరపాటున ఎప్పుడైనా.. మనం తెలియకుండా పోగొట్టుకున్న సొమ్ముకి బ్యాంకులు ఏమాత్రం జవాబుదారీ కాదన్న విషయం మర్చిపోకూడదు.**

**- వి.చైతన్య**

## క్రయ, విక్రయాల్లో జాగ్రత్త!

**మా**ర్కెట్లో చిన్న చితకా వస్తువుల్ని కొనడానికీ కరెన్సీ స్థానంలో 'కార్డ్స్' వినియోగమే ఎక్కువ. మార్కెట్స్, సూపర్ బజార్లు, షాపింగ్ మాల్స్, చివరికి వైన్ షాపుల్లో కూడా డెబిట్, క్రెడిట్ కార్డ్‌లను వాడడం సర్వసాధారణమైంది. అయితే ఇలాంటి చోట్ల కూడా మన కార్డ్ పిన్ నెంబర్లు చేతులు మారిపోతున్నాయి. సాధారణంగా షాపింగ్ మాల్స్‌లో కొన్న వస్తువులకు బిల్లు చెల్లించేటప్పుడు డెబిట్, క్రెడిట్ కార్డుల్ని అందజేస్తుంటాం. మిషన్‌పై కార్డ్‌ను స్వైప్ చేసుకుని, మనతో పిన్ నెంబర్ టైప్ చేయించి, డబ్బులు జమ కట్టుకుంటారు. కార్డ్‌పై ఉన్న మాగ్నెటిక్ స్ట్రయిప్ సమాచారం ద్వారా సంబంధిత బ్యాంక్ నుంచి డబ్బులు జమ అవుతుంటాయి. అయితే ఇలా కార్డ్ స్వైప్ చేసే క్రమంలో కార్డ్ సమాచారాన్ని డూప్లికేట్ చేసుకోడానికి అనేక చోర మార్గాలున్నాయి. పిన్ నెంబర్ టైప్ చేసినప్పుడు అందులో అమర్చిన హిడెన్ మిషన్ (రహస్య యంత్రం) పిన్ నెంబర్‌తో సహా కార్డుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని రికార్డ్ చేసుకోవచ్చు. అంతేకాదు, మనం టైప్ చేసే పిన్ నెంబర్ క్లియర్‌గా సీసి కెమెరాల్లో రికార్డు అవుతుంది. ఇలా కస్టమర్ల పిన్ నెంబర్‌లను దుర్వినియోగం చేసే ప్రమాదం లేకపోలేదు. పెట్రోల్ బంక్‌లు, బార్లల్లో స్వైప్ చేసేటప్పుడు డెబిట్ కార్డ్ పిన్ నెంబర్లను కళ్ళుగప్పి రకరకాలుగా తస్కరించే సంఘటనలూ ఎక్కువగానే జరుగుతున్నాయి.




మన కళ్ళ ముందే రెప్పపాటు సమయంలో పిన్ నెంబర్లను కాజేసే పద్ధతి ఒకటైతే, ఫోన్ల ద్వారా బ్యాంక్ సిబ్బందిమి అంటూ నమ్మించి పిన్ నెంబర్, అకౌంట్ నెంబర్ ఇతర వివరాలన్నీ చాకచక్యంగా అడిగి తెలుసుకుంటారు. ఆ తర్వాత వాటి ఆధారంగా క్లోనింగ్ పద్ధతిలో డూప్లికేట్ కార్డ్ సృష్టించి, మోసాలు చేయడం మరోపద్ధతి. అలాగే మనం కార్డ్ ఉపయోగించిన కొద్ది క్షణాల్లో ఏటీఎమ్ మిషన్ స్వైప్ హోల్డర్లో మాగ్నిటైజ్డ్ కార్డ్ ఉంచి, అంతకుమునుపు కార్డ్ నెంబర్‌ని ఆ కార్డ్‌లోకి రీలోడ్ చేసుకునే అధునాతన టెక్నాలజీ ద్వారా కార్డ్ క్లోనింగ్ మోసాలూ జరుగుతున్నాయి.



# చిన్నారి

## జోక్:

తండ్రి : ఏరా పరీక్ష ఎలా రాశావు?

కొడుకు : బాగా రాశాను నాన్న

తండ్రి : అంత నమ్మకంగా ఎలా చెప్తున్నావురా?

కొడుకు : వందకు వంద మార్కులు వస్తాయని చెప్పానుగా ఇంకా నామీద డౌటా?

తండ్రి : నేను నమ్మను

కొడుకు : నువ్వు నమ్మవని తెలుసు నాన్న అందుకే నీకు చూపించడానికి ఆన్సర్‌షీట్ తీసుకొచ్చా..

## పొడుపు కథ

తెల్లని సువాసనగల మొగ్గ
ఎర్రగా పూసి
మాయమైపోతుంది
ఏమిటది?

జవాబు : కర్పూరం

## నీడ కనిపెట్టండి!



పిల్లలూ! ఈ చిత్రంలో.. విచిత్ర వేషధారణలో ఉన్న కొంతమంది పిల్లలు వారి నీడలు ఉన్నాయి. ఏ నీడ ఎవరిదో కనిపెట్టండి?

## బడికి వెళ్దాం



రండి రండి బడికి వెళ్దాం
కలిసి మెలసి చదివేద్దాం
గేయాలన్నీ నేర్చేద్దాం

చక్కగా పుస్తకం కాపాడేద్దాం
మార్కులు దండిగా తెచ్చుకుందాం
మంచి విషయాలు నేర్చేద్దాం

పుస్తకంపై దృష్టి పెట్టేదాం
చదువులను నేర్చి గెలిచేద్దాం
విజయాలన్ని సాధిద్దాం

చదువుతూ హాయిగా గడిపేద్దాం
ప్రయోజకులుగా అయిపోదాం
తల్లిదండ్రులకు మంచి పేరు తెద్దాం




వి.నందిని
9వ తరగతి
జడ్.పి.హెచ్ స్కూల్
చిప్పగిరి మండలం
కర్నూలు జిల్లా

## రంగులు వేయండి!

పిల్లలూ! ఇక్కడ మీకు ఎంతో ఇష్టమైన బొమ్మ ఉంది కదా? దానికి చక్కని రంగులు వేయండి!





పి. బాలాజీ
8వ తరగతి
జడ్.పి.హెచ్. స్కూలు,
పెనుమాక,
తాడేపల్లి మండలం,
గుంటూరు జిల్లా.

## నేను గీసిన బొమ్మ



## పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com



# పదేళ్ల తరువాత..

## ఇంగ్లాండ్‌పై టెస్టు సిరీస్ గెలిచిన విండీస్



**నార్త్ సౌండ్:** ఇంగ్లాండ్‌తో రెండో టెస్టులోనూ వెస్టిండీస్ క్రికెట్ జట్టు విజయం సాధించింది. ఇంగ్లాండ్ విధించిన 14 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని విండీస్ వికెట్ కోల్పోకుండా ఛేదించింది. ఈ మ్యాచ్‌ను 10 వికెట్ల తేడాతో గెలుచుకుంది. ఈ విజయంతో మూడు టెస్టుల ఈ సిరీస్‌ను ఇంకా ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే చేజిక్కించుకుంది. ఇంగ్లాండ్‌పై టెస్టు సిరీస్‌లో గెలవడం వెస్టిండీస్ జట్టుకు 10 సంవత్సరాల తరువాత ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ రెండో టెస్టులో మూడో రోజు ఆటను 6 వికెట్ల నష్టానికి 272 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో ప్రారంభించిన వెస్టిండీస్ చివరికి తన తొలి ఇన్నింగ్స్‌లో 306 పరుగులకు ఆలౌటైంది. ఈ తరువాత 119 పరుగుల వెనుకబాటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ కేవలం 132 పరుగులకే ఆలౌటయింది. విండీస్ ముందు 14 పరుగుల లక్ష్యం నిలిపింది. ఈ టెస్టులో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 187 పరుగులకు ఆలౌటయింది. ఈ సిరీస్‌లో తొలి టెస్టులో విండీస్ 381 పరుగులు భారీ తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో మూడో టెస్టు ఈ నెల 9న ప్రారంభం కానుంది.

# కివీస్ గడ్డపై భారత్ కొత్త చరిత్ర

## చివరి వన్డేలో భారత్ గెలుపు
## 4-1తో సిరీస్‌ను ముగించిన టీమిండియా



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అంబటి రాయుడు (90 పరుగులు)

**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన చివరి వన్డేలో అంబటి రాయుడు సత్తా చాటాడు. కష్టసమయంలో జట్టును అదుకున్నాడు. రాయుడు 90 పరుగులతో (113 బంతుల్లో నాలుగు సిక్స్‌లు, ఎనిమిది ఫోర్లు)తో కివీస్ బౌలర్లపై అధిపత్యం చెలాయించాడు. విజయ్ శంకర్ (45 పరుగులు, 64 బంతుల్లో నాలుగు ఫోర్లు), హర్థిక్ పాండ్యా (45 పరుగులు, 22 బంతుల్లో 5 సిక్స్‌లు, 2 ఫోర్లు) కూడా ప్రత్యర్థి బౌలర్లపై సత్తా చాటడంతో భారత్ 49.5 ఓవర్లలో 252 పరుగులకు చేసింది. తరువాత లక్ష్య సాధనలో న్యూజిలాండ్ 44.1 ఓవర్లలోనే 217 పరుగులకు ఆలౌటయింది. భారత్ 35 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో భారత్ ఈ సిరీస్‌ను 4-1తో గెలుచుకుంది. కివీస్ గడ్డపై టీమిండియా కొత్త రికార్డు నెలకొల్పింది. కివీస్‌లో 4-1లో వన్డే సిరీస్ గెలుచుకున్న మూడో జట్టుగా నిలిచింది. 1999-2000లో ఆస్ట్రేలియా, 2000-2001లో శ్రీలంక జట్లు కూడా 4-1తో వన్డే సిరీస్ గెలుచుకున్నాయి. భారత్ మూడో జట్టుగా నిలిచింది. అయితే భారత్ గతంలో 3-1తో కివీస్‌పై సిరీస్ గెలుచుకుంది. ప్రస్తుత వన్డే సిరీస్‌లో నాలుగు మ్యాచ్‌లో ఓడిపోవడంతో ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసే సువర్ణావకాశాన్ని కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆదివారం వన్డేలో ముందుగా టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. అయితే మ్యాట్ హెన్రీ, ట్రెంట్ బౌల్ట్ బౌలింగ్ ధాటికి రోహిత్ (2), ధావన్ (6), శుభమ్ గిల్ (7), ధోనీ (1) పెవిలియన్ చేరుకున్నారు. 18 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో అంబటి రాయుడు , విజయ్ శంకర్ జాగ్రత్తగా ఆడారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యం అందించారు. అయితే అర్ధశతకానికి చేరువైన శంకర్ జట్టు స్కోరు 116 వద్ద రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన కేదార్ జాదవ్ (34, 45 బంతుల్లో మూడు ఫోర్లు)తో కలిసి అంబటి రాయుడు ఆరో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. జట్టు స్కోరు 190 వద్ద ఆరో వికెట్‌గా అవుటయ్యాడు. ఈ తరువాత 203 వద్ద ఏడో వికెట్‌గా జాదవ్ (34 పరుగులు, 45 బంతుల్లో మూడు ఫోర్లు) పెవిలియన్ చేరుకున్నాడు. అయితే ఈ తరువాత హర్దిక్ పాండ్య (45 పరుగులు 22 బంతుల్లో 2x4, 5x6) జూలు విదిల్చిన సింహంలా రెచ్చిపోయాడు. హ్యాట్రిక్ సిక్సులు బాదేశాడు. అయితే పాండ్య తరువాత భువీ, షమి తక్కువ స్కోరుకు అవుటయ్యారు. ఈ తరువాత లక్ష్య ఛేదనలో కివీస్ ఎప్పటిలాగానే తడబడింది. 18 పరుగుల వద్దే ఓపెనర్ హెన్రీ నికోల్స్ (8) షమి బౌలింగ్ ఔటయ్యాడు. మరో ఓపెనర్ కొలిన్ మన్రో (24 పరుగులు) ను సైతం అతడే పెవిలియన్ పంపించాడు. ఈ క్రమంలో సారథి కేన్ విలియమ్సన్ (39), టామ్ లేథమ్ (37) నాలుగో వికెట్‌కు 67 పరుగులు జోడించారు. క్రీజులో పాతుకు పోతున్న విలియమ్సన్‌ను జాదవ్ కీలక సమయంలో ఔట్ చేశాడు. రాస్ టేలర్ (1) విఫలమయ్యాడు. దీంతో ఆ జట్టు 135/6తో నిలిచింది. ఈ క్రమంలో జేమ్స్ నీషమ్ (44 పరుగులు) రాణించాడు. తన బ్యాటింగ్‌తో భయపెట్టాడు. క్రీజు బయట నిలబడిని అతడిని ధోనీ సమయోచితంగా రనౌట్ చేయడంతో కివీస్ పని ముగిసింది. చివర్లో మిచెల్ శాంట్నర్ (22), మ్యాట్ హెన్రీ (17) కాస్త మెరిసినా చాహల్ వారిని పెవిలియన్‌కు పంపాడు. దీంతో 217 పరుగులకు ఆలౌటయింది. రాయడుకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, షమికి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించాయి.

### విదర్భ 200/7
### సౌరాష్ట్రతో రంజీ ఫైనల్

**నాగ్‌పూర్ :** ఆదివారం ఇక్కడ సౌరాష్ట్రతో ప్రారంభమైన రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో విదర్భ క్రికెట్ జట్టులో బ్యాట్స్‌మెన్లు నిరాశ పరిచారు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సరికి విదర్భ ఏడు వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచిన విదర్భ మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్‌కు దిగింది. అయితే 29 పరుగులకే ఓపెనర్లు ఫైజల్, సంజయ్ వికెట్లు కోల్పోయింది. తరువాత వసీం జాఫర్ 23 పరుగులు చేసి మూడో వికెట్‌గా జట్టు స్కోరు 60 వద్ద అవుట య్యాడు. ఈ తరువాత కలే (35 పరుగులు), గణేష్ సతీష్ (32 పరుగులు)తో ఫరవాలే దనిపించగా, వాద్కర్ 45 పరుగులు చేశాడు. ఆదివారం ఆటముగిసే సరికి కర్నేవర్ (31 పరుగులు), వాఖరే (0) క్రీజ్‌లో ఉన్నారు.

### 'సైనా' స్ఫూర్తిదాయకం

**ముంబయి:** 'సైనా' పేరుతో ప్రముఖ షట్లర్ సైనా నెహ్వాల్ బయోపిక్ రూపొందుతున్న విషయం తెలిసిందే. 'ఈ సినిమా స్క్రిప్టు చాలా బాగుంది. శ్రద్ధా ఈ సినిమా కోసం చాలా సాధన చేసింది, ఈ సినిమా కోసం మీలాగే నేను ఎదురుచూస్తున్నా. ప్రతీ క్రీడాకారిణి విజయం వెనుక ఓ అద్భుతమైన కథ ఉంటుంది. ఎన్నో కష్టాలు పడుంటారు, సమస్యలు ఎదుర్కొనుంటారు. కాబట్టి ఓ క్రీడాకారిణి జీవితంపై సినిమా తీస్తే కచ్చితంగా బాగుంటుంది. ఎందుకంటే ఇలాంటి సినిమాలు స్ఫూర్తిని కల్గించేలా ఉంటాయి. నా జీవిత కథ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా' అని సినిమా గురించి సైనా పేర్కొన్నారు.

## ఐర్లాండ్‌పై భారత మహిళల గెలుపు



**ముర్సియా (స్పెయిన్) :** భారత మహిళా హాకీ జట్టు ఆదివారం సంచలన విజయం నమోదు చేసింది. ప్రపంచకప్‌లో రజత పతక విజేత ఐర్లాండ్‌ను ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ 3-0 గోల్స్ తేడాతో కంగుతినిపించింది. ఈ ఏడాది తొలి పర్యటనను ఘనంగా ముగించింది. శనివారం ఈ ఇరు జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. ఆదివారం మ్యాచ్‌లో ముందుగా 13వ నిమిషంలోనే నవ్‌జోత్ కౌర్ గోల్‌తో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తరువాత 26వ నిమిషంలో దీప్ గ్రేస్ ఈక్కా గోల్‌తో భారత్ ఆధిక్యం 2-0కు చేరింది. తరువాత భారత్ మరో గోల్ చేసింది. కాగా, పర్యటనలో ముందుగా ప్రపంచ కప్‌లో కాంస్య పతక విజేత స్పెయిన్‌తో జరిగిన సిరీస్‌ను 1-1తో భారత్ సమం చేసిన సంగతి తెలిసిందే.

## లంక లక్ష్యం 516

### ఆసీస్‌తో రెండో టెస్టు

**కాన్‌బెర్రా:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక కష్టాల్లో ఉంది. ఈ టెస్టులో మూడో రోజు ఆటలో ఆస్ట్రేలియా తన రెండో ఇన్నింగ్‌ను 3 వికెట్ల నష్టానికి 196 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. శ్రీలంక ముందు 516 పరుగులు భారీ లక్ష్యాన్ని నిలిపింది. మూడో రోజు ఆటలో ముందుగా 3 వికెట్ల నష్టానికి 123 పరుగులతో తన తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన శ్రీలంక జట్టు 215 పరుగులకే తన ఇన్నింగ్స్‌ను ముగించింది. ఈ తరువాత రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఆస్ట్రేలియాలో ఖాజా సెంచరీతో ( 136 బంతుల్లో 101 పరుగులు, 14 ఫోర్లు) అజేయంగా నిలిచాడు. త్వరగా తన ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన ఆసీస్ శ్రీలంకను రెండో ఇన్నింగ్స్‌కు ఆహ్వానించింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక ఆట ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 17 పరుగులు చేసింది. ఈ టెస్టులో ఆస్ట్రేలియా తన తొలి ఇన్నింగ్స్‌ను 534/5 వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో తొలి టెస్టులో ఆసీస్ ఇన్నింగ్స్ 40 పరుగులతో విజయం సాధించింది.




## అభివృద్ధిని అడ్డుకుంటున్న గవర్నర్

- యానాం సభలో పుదుచ్చేరి సిఎం నారాయణస్వామి
- ఇంజినీరింగ్ కళాశాలకు డిజిటల్ శంకుస్థాపన చేసిన ప్రధాని

**ప్రజాశక్తి - యానాం**

పుదుచ్చేరి అభివృద్ధిని గవర్నర్ కిరణ్‌బేడీ అడ్డుకుంటున్నారని పుదుచ్చేరి సిఎం నారాయణస్వామి విమర్శించారు. యానాం గిరియంపేటలో నిర్మించనున్న కేంద్ర ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదివారం ఆన్‌లైన్‌లో డిజిటల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు అధ్యక్షత వహించారు. సభలో సిఎం నారాయణస్వామి మాట్లాడుతూ ఇక్కడ కాలేజీ ఏర్పాటుతో యానాం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. త్వరలో జిప్‌మెర్, ఆయుష్ హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. వీటిని యానాం తీసుకురావడంలో మంత్రి మల్లాడి కృష్ణారావు ఎంతగానో కృషి చేశారని తెలిపారు. అయితే రాష్ట్ర సంక్షేమానికి, అభివృద్ధికి గవర్నర్ అడ్డుపడుతున్నారని విమర్శించారు. త్వరలో ఈ సమస్య తీరనుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖమంత్రి కమలకున్నన్, పార్టీ విప్ అనంతరామ్, సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, యానాం ప్రాంతీయ పరిపాలన అధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్‌సి నితిన్ గౌహాల్, పిడబ్ల్యుడి ఇఇ రామదాసు, సిఐ గట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో ఏడుగురు రోహింగ్యా ముస్లిం పిల్లలు

**న్యూఢిల్లీ :** ఉత్తర త్రిపురలోని రైల్వే స్టేషన్ వద్ద రోహింగ్యా ముస్లింలకు చెందిన ఏడుగురు పిల్లలను ఆదివారం భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నట్లు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్)కు చెందిన అధికారి ఒకరు తెలిపారు. దీంతో గడిచిన రెండు వారాలలో త్రిపుర, అస్సాం-త్రిపుర సరిహద్దులో మొత్తం 68 మంది రోహింగ్యా ముస్లింలను అదుపులోకి తీసుకున్నట్లయ్యింది. వీరిలో అత్యధికులు పిల్లలే కావడం విశేషం. "ఉత్తర త్రిపురలోని ధర్మ నగర్ రైల్వే స్టేషన్ వద్ద రోహింగ్యా ముస్లింలకు చెందిన ఆరుగురు బాలికలు, ఒక బాలుడిని అదుపులోకి తీసుకున్నాం. వీరందరూ కూడా 18 సంవత్సరాల లోపు వయస్సు వారే. వీరిని ఆదివారం త్రిపుర పోలీసులకు అప్పగించాం" అని అధికారి తెలిపారు.

# క్యాన్సర్‌కు ప్రభుత్వ చికిత్స ఏదీ!

- నామమాత్రంగానే ఎన్టీఆర్ వైద్యసేవ
- గణాంకాల నమోదుకు వైద్యఆరోగ్య శాఖ మంగళం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

క్యాన్సర్ వ్యాధి తీవ్రత రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రతియేటా దేశంలో దాదాపు 25 శాతం కేసులు పెరుగుతున్నాయి. గతేడాది దేశవ్యాప్తంగా 11.57 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతుంటే అందులో 7.8 లక్షల మంది ఈ వ్యాధి కారణంగానే మరణిస్తున్నట్లు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ ప్రివెన్షన్ అండ్ రిసెర్చ్ ( ఎన్ఐసిపిఆర్ ) గణాంకాలు తెలుపుతున్నాయి. క్యాన్సర్ ప్రాథమిక స్థాయిలో గుర్తించడంవల్ల సరైన చికిత్స అందడంతో ప్రాణాపాయం తప్పవచ్చు. కానీ అత్యధిక కేసుల్లో అడ్వాన్స్‌డ్ స్థాయిలోనే వ్యాధి బయటపడుతోందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఇక రాష్ట్రంలోనూ ప్రతియేటా క్యాన్సర్ బారిన పడుతున్నవారి సంఖ్య కూడా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే అందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో చికిత్స అందించేందుకు గాని, పరిశోధించేందుకుగాని సరైన సంస్థ ఏదీ అందుబాటులో లేవు. కర్నూలులో క్యాన్సర్ పరిశోధనా సంస్థను ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించినప్పటికీ ఇప్పటికీ దానికి అడుగు ముందుకుపడలేదు. ఇక ఏ ప్రభుత్వ ఆస్పత్రిలోనూ రేడియాలజీ విభాగం సరిగా పనిచేయడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ఫలితంగా రోగులు ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇక రాష్ట్రంలో ఇటీవల కాలంలో అంకాలజీ సెంటర్స్ ( క్యాన్సర్ ఆస్పత్రులు ) కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. అలాగే చికిత్స కోసం చేయాల్సిన ఖర్చు కూడా పెరుగుతోంది. ప్రాథమిక స్థాయిలో క్యాన్సర్ చికిత్సకు దాదాపు రూ. 4 లక్షలు ఉంటే, అడ్వాన్స్‌డ్ స్థాయిలో రూ. 4.5 లక్షల నుంచి 9.5 లక్షల వరకు, చివరిస్థాయిలో ఉంటే అంతకంటే ఎక్కువ ఖర్చువుతోందని ఇటీవల ముంబైకు చెందిన ' ఎడిల్‌విస్ - టోకియో ' సంస్థ సర్వేలో పేర్కొంది.




### గణాంకాలూ లేవు!

రాష్ట్రంలో క్యాన్సర్ బారిన ఎందరు పడుతున్నవారు, చికిత్స పొందుతున్న వారి వివరాలను నమోదు చేసే గణాంక వ్యవస్థ కూడా అందుబాటులో లేదు. ఉమ్మడి రాష్ట్రంలో క్యాన్సర్ రిజిస్ట్రీ పేరుతో రోగుల వివరాలు నమోదు చేసేవారు. అయితే రాష్ట్ర విభజనానంతరం ఆ ప్రక్రియకు వైద్యఆరోగ్య శాఖ మంగళం పాడింది. మరెవైపు ఇతర సేవల తరహాలోనే క్యాన్సర్ కేర్ సెంటర్ల విషయంలోనూ ప్రయివేటు భాగస్వామ్యం వైపు రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోంది. అన్ని జిల్లాల్లో క్యాన్సర్ వ్యాధి ప్రాథమిక నిర్ధారణ, పరిశోధనకు క్యాన్సర్ కేర్ సెంటర్లను నెలకొల్పేందుకు ప్రభుత్వం టాటా ట్రస్ట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే అవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాలంటే మరింత సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

### ఎన్టీఆర్ వైద్యసేవ కొన్నింటికే...

రాష్ట్రంలోనూ క్యాన్సర్ బారిన పడి చికిత్స పొందుతున్నవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ప్రభుత్వం చేసిన చెల్లింపులను పరిశీలిస్తే పెరుగుదల అర్థమవుతోంది. అయితే క్యాన్సర్ చికిత్సలో కొన్నింటికి మాత్రమే ఈ పథకం వర్తిస్తోంది. వైద్యసేవ ద్వారా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ 2.5 లక్షల వరకు మెడికల్ ఖర్చులు ప్రభుత్వం చెల్లిస్తోంది. కానీ జాబితాలో క్యాన్సర్ రోగులకు ఇచ్చే చికిత్సలన్నీ అందుబాటులో లేకపోవడం, చికిత్సకు సరిపడా మొత్తాన్ని ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించకపోవడం వంటి పలు సాంకేతిక కారణాలతో ఇది కొంతవరకే బాధితులకు ఉపయోగపడుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రం నెలకొల్పాల్సిన అవసరముందని పలువురు వైద్యాధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ చికిత్సలో ముఖ్యమైన నాలుగు విభాగాల్లో రేడియేషన్ అంకాలజి, మెడికల్ అంకాలజి, సర్జికల్ అంకాలజి సహా పేలియాటిక్ విభాగం కూడా ఉండాలని అంటున్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు తమకు అందించే చికిత్స కారణంగా శారీరకంగా, మానసికంగా కుంగిపోకుండా కౌన్సెలింగ్ ఇచ్చేందుకు పేలియాటిక్ విభాగం అవసరమన్నారు. వాటితోపాటు పీడియాట్రిక్ క్యాన్సర్ యూనిట్ కూడా నెలకొల్పాలని చెబుతున్నారు.

**గత నాలుగేళ్లలో ఎన్టీఆర్ వైద్యసేవ కింద క్యాన్సర్ చికిత్స పొందుతున్నవారి వివరాలు**

| సంవత్సరం | ఎన్టీఆర్ వైద్యసేవకు నమోదుచేసుకున్న క్యాన్సర్ బాధితుల సంఖ్య | నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో పొందిన కీమో, రేడియో థెరపీలు | ప్రభుత్వం వెచ్చించిన మొత్తం (రూ. కోట్లలో) |
|---|---|---|---|
| 2014-15 | 19586 | 64447 | 100 |
| 2015-16 | 24399 | 88340 | 136 |
| 2016-17 | 26000 | 95000 | 146 |
| 2017-18 | 28000 | 111000 | 175 |
| 2018-19 (సెప్టెంబర్ వరకు) | 18774 | 63000 | 99.5 |

### 5 నుంచి ఎనర్జీ ఇన్నోవేషన్ సదస్సు : ముఖ్యమంత్రి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రం రెండంకెల వృద్ధి సాధించడంలో విద్యుత్ రంగం పాత్ర ఎంతో కీలకమైందన్నారు. అంతర్జాతీయ కన్సల్టెన్సీ డాల్‌బర్గ, భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, సహకారంతో ఈ నెల 5 నుంచి రెండు రోజుల పాటు విజయవాడలో 'పవరింగ్ ఆంధ్రప్రదేశ్-ఎనర్జీ ఇన్నోవేషన్-2019' పేరుతో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంధన శాఖ అధికారులతో ఆదివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూఇంధన రంగంలో ఇన్నోవేషన్స్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, అంతర్జాతీయ ఉత్తమ విధానాల గుర్తించి రాష్ట్ర విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాటికి రాష్ట్రంలో 10 లక్షల ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు.

### రైతుల పథకం అవమానకరం

- బిజెపి అసంతృప్త నేత శత్రుఘ్న సిన్హా

**న్యూఢిల్లీ :** ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో రైతులకు ప్రకటించిన ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ఆకట్టుకోలేదని బిజెపి అసంతృప్త నేత శత్రుఘ్న సిన్హా అభిప్రాయ పడ్డారు. పార్టీ అధిష్టానంపై విమర్శలు చేయడానికి ఎటువంటి అవకాశాన్ని వదులుకోని ఆయన రైతులకు నగదు ఇవ్వడాన్ని 'అవమానకరం, కించపరచడం' అని ట్వీట్ చేశారు. రెండు హెక్టార్ల కన్నా తక్కువ భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఏడాదికి 6 వేల చొప్పున ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. నిర్ణయాత్మక ఆలోచనలకు తావునివ్వటానికి ఆలస్యం చేయవద్దు' అని ట్వీట్ చేశారు. ఈ బడ్జెట్ 'ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్'లా లేదని, ఓట్ల బడ్జెట్ వలె ఉందని సిన్హా ధ్వజమెత్తారు.

### బట్టతలలున్న వారికి దువ్వెనలు అమ్మారు

#### మోడిపై ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్

**న్యూఢిల్లీ :** ప్రధాని మోడి తెలివైన సేల్స్‌మాన్ అని ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ అన్నారు. మోడి బట్టతల ఉన్న వారికి దువ్వెనలు అమ్మి తన పాలనలో జుట్టు పెరిగేలా చేస్తానని హామీ ఇచ్చారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఆదివారం పాట్నాలోని గాంధీ మైదాన్‌లో జన ఆకాంక్ష ర్యాలీ నిర్వహించింది.

# 35 ప్రభుత్వరంగ సంస్థల అమ్మకానికి కేంద్రం ప్రణాళిక


- క్యాబినెట్ ముందుకు 'దీపం' నివేదిక
- 2019-20లో రూ.90 వేలకోట్ల ఉపసంహరణ లక్ష్యం

**న్యూఢిల్లీ :** పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా 35 కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను(సీపీఎస్ఈ) అమ్మడానికి ఆర్థికశాఖ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. నిటి ఆయోగ్ ఇటీవలే సీపీఎస్ఈల్లోని లాభాలతో ఉన్న, నష్టాలతో ఉన్న సంస్థల ఐదో జాబితాను పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగానికి(దీపంకు) సమర్పించింది.

వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణను దృష్టిలో ఉంచుకొని అమ్మకాల ప్రక్రియను సులభతరం చేయడం కూడా ఎంతో ముఖ్యమని తాము భావిస్తున్నట్టు దీపం కార్యదర్శి అతాన్ చక్రవర్తి తెలిపారు. 35 కంపెనీల అమ్మకాల విషయంలో క్యాబినెట్ ఆమోదం పొందాల్సి ఉన్నదని ఆయన తెలిపారు. ప్రస్తుతం 57 సీపీఎస్ఈలు స్టాక్ మార్కెట్‌లో నమోదై ఉన్నాయి. వీటి మొత్తం మార్కెట్ విలువ రూ.13 లక్షల కోట్లు.

వ్యూహాత్మక అమ్మకానికి తయారైన వడబోత జాబితాలో ఎయిర్ ఇండియా, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, బీఈఎంఎల్, స్కూటర్స్ ఇండియా, భారత్ పంప్స్ కాంప్రెసర్స్, సెయిల్‌కు చెందిన సాలెం, దుర్గాపూర్ యూనిట్లు, హిందుస్తాన్ ఫ్లోరోకార్బన్, హిందుస్తాన్ న్యూస్‌ప్రింట్, సెంట్రల్ ఎలక్ట్రానిక్స్, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఐటీడీసీ ఉన్నాయి. పవన్‌హాన్స్ అమ్మకం విషయం పురోగతిలో ఉన్నట్టు అతాన్ చక్రవర్తి తెలిపారు. పవన్‌హాన్స్‌లో ప్రస్తుతం కేంద్రంతోపాటు ఓఎన్‌జీసీకి 51 శాతం, 49 శాతం చొప్పున వాటాలున్నాయి. ఈ సంస్థ కింద 46 చాపర్లు(హెలికాప్టర్లు)న్నాయి. తాత్కాలిక ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ ఇటీవల లోక్‌సభకు సమర్పించిన బడ్జెట్‌లో ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణపై వివరాలు వెల్లడించారు. 2019-20లో రూ.90,000 కోట్ల విలువైన సీపీఎస్ఈల వాటాలు విక్రయించాలనేది లక్ష్యంగా తెలిపారు. 2018-19లో రూ.80,000 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, రూ.35,100 కోట్లు ఇప్పటికే సమీకరించినట్టు తెలిపారు. మిగతా రూ.44,000 కోట్లను కూడా వచ్చే రెండు నెలల్లో సమీకరించనున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. 2017-18లో సీపీఎస్ఈల్లోని వాటాలు విక్రయిండం ద్వారా కేంద్రం రూ.లక్ష కోట్లు సమీకరించింది.

## ఉపాధి అవకాశాలకు గండికొడుతున్న మోడీ : రాహుల్



**న్యూఢిల్లీ :** ప్రధాని మోడీ విశ్వవిద్యాలయాల్లో వెనుకబడిన వర్గాలకు ఉపాధి అవకాశాలు విస్మరిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. తన పారిశ్రామిక సన్నిహితుల అభివృద్ధే ధ్యేయంగా మోడీ సాగుతున్నారని ఆయన దుయ్యబట్టారు. యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వ్ చేసిన అధ్యాపకుల నియామకంలో ముందుకు పోవాలని ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ దీనికి విరుద్ధంగా పోస్టుల సంఖ్యను తగ్గిస్తూ ప్రభుత్వం వారి అవకాశాలకు గండికొడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు విద్యార్థులకు సక్రమంగా స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయట్లేదన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68